# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

గురువారము, మార్చి 12, 2015

**THURSDAY, THE 12TH MARCH, 2015**

14వ శాసన సభ 4వ సమావేశం, వాల్యూం- 6 నంబరు--5

**14TH L.A. IV SESSION, VOL—6 NO.-5**

శక సంవత్సరం-1936, ఫాల్గుణ-22

**22- Phalguna, 1936 – S.E.**

శాసన సభ సచివాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు- 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | డా. కోడెల శివప్రసాదరావు |
| ఉప సభాపతి | : | శ్రీ మండలి బుద్ధప్రసాద్ |
| కార్యదర్శి(ఇంచార్జ్) | : | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>డా.వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ శ్రీనివాస్ అల్లాడి |

– – –

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

**(14వ శాసన సభ)**
**(నాల్గవ సమావేశముః నాల్గవ రోజు )**

**గురువారం, మార్చి 12, 2015**
**సభ గం.09.00లకు లకు ప్రారంభమైనది**
**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

--------------

## విషయ సూచిక


| | | పుట సంఖ్య |
|---|---|---|
| 1. వాయిదా తీర్మానం – తిరస్కృతి (నదుల అనుసంధానం, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం మరియు పట్టిసీమ ఎత్తిపోతల పథకంపై) | .... | 5 |
| 2. నక్షత్ర గుర్తు గల ప్రశ్నలు మరియు సమాధానములు | ..... | 5–65 |
| 3. సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు | ..... | 65 |
| 4. సభాపతిచే ప్రకటన (బడ్జెట్ కాపీలను మెంబర్స్ సర్వీస్ సెక్షన్ నుంచి తీసుకోవాలని) | .... | 65–66 |
| 5. బడ్జెట్ ప్రసంగం | ..... | 67–111 |
| 6. సభ వాయిదా (మ.గం.2.10 ని.లకు) | ...... | 111 |

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ

# గురువారం, తేది.12 మార్చి, 2015

* * *

**(సభ ఉదయం 9.00 గంటలకు ప్రారంభమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)**

## వాయిదా తీర్మానం

మిస్టర్ స్పీకర్: నదుల అనుసంధానం, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం మరియు పట్టిసీమ ఎత్తిపోతల పథకంపై శ్రీ జ్యోతుల నెహ్రూ మరియు ఇతరులు ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించడమైనది.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: (మైక్ లేకుండా) అధ్యక్షా, ఆ అంశంపై చర్చించాల్సిన అవసరముంది.

శ్రీ జ్యోతుల నెహ్రూ: (మైక్ లేకుండా) అధ్యక్షా, చాలా ప్రాధాన్యత కలిగిన అంశం.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి:(మైక్ లేకుండా) కచ్చితంగా పట్టిసీమపై చర్చించడానికి అవకాశమిస్తారు.

మిస్టర్ స్పీకర్: మీ ఇష్టం వచ్చినట్లు కామెంట్లు చేస్తుంటారు. 344వ నిబంధన కింద నదుల అనుసంధానం విషయంపై చర్చ ఉంది, కాబట్టి అప్పుడు మాట్లాడవచ్చు.

**Let us go to the Question Hour. Now Question No.705.**

**ప్రశ్న నెం.705 (31)** **శ్రీ కె.వెంకట రమణమూర్తి, ఎమ్మెల్యే**

**గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రిగారు దయచేసి ఈకింది సమాచారం తెలియజేస్తారా :-**

అ) వంశధార ప్రాజెక్టు మూడవ ప్యాకేజ్ పనులను ప్రారంభించని విషయం వాస్తవమేనా;

ఆ) 87 మరియు 88 ప్యాకేజీలలో చేసిన పనుల కోసం కాంట్రాక్టు కంపెనీలకు అధిక చెల్లింపులు చేసిన విషయం వాస్తవమేనా;

ఇ) అయితే, సదరు కంపెనీల నుంచి ఆ మొత్తాలను తిరిగి వసూలు చేసే ప్రతిపాదన ఏదైనా ఉందా?

ఈ)భూసేకరణలో జాప్యం మూలంగా ప్రభుత్వంపై అధికంగా ఆర్థిక భారం పడిన విషయం వాస్తవమేనా భూసేకరణ, పరిహారం మరియు పునరావాసం వంటి వాటికి సంబంధించిన పనులను ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది?

**జల వనరుల శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు):**

అ) లేదండీ. వంశధార ప్రాజెక్టులో ఎటువంటి మూడవ ప్యాకేజి పనులు లేవు.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఈ) భూమి సేకరణ మరియు ఆర్ అండ్ ఆర్ కార్యక్రమాలను 2016 జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రతిపాదించడమైనది.

శ్రీ కె.వెంకట రమణమూర్తి (పాతపట్నం): అధ్యక్షా, పొరపాటున రెండవ ప్యాకేజీకి బదులుగా మూడవ ప్యాకేజీ అని వచ్చింది. అయితే ముఖ్యంగా మా జిల్లాలో వంశధార రెండో దశ స్టేజ్-2ను ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారు 2005లో మా జిల్లాకు అందించిన వరం. అటువంటిది ఇప్పుడు మనం 2015లో ఉన్నాం. సుమారు పది సంవత్సరాలు దాటినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. 87, 88 ప్యాకేజీలలో 2009లోనే పనులు ఆగిపోయాయి. హార్వెల్ కన్‌స్ట్రక్షన్స్, శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ ఆ రెండు ప్యాకేజీల పనులనూ వదలి వెళ్లాయి. తరవాత రెండోసారి టైం పొడిగించినా కూడా పనులు జరగలేదు. అప్పటినుంచీ పనులు జరగనందున ఎస్ఎస్ఆర్ రేట్లు పెరగడంతో ఆ రెండు ప్యాకేజీలలో సుమారుగా రూ.100కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుంది. దీనికి ఎవరు బాధ్యులు? ఆనాటి ప్రభుత్వమా, అధికారులా లేక కాంట్రాక్టర్లా? ఈపీసీ విధానంలో లాభం వచ్చే పనులు చేసి మిగతా పనులు వదలి వెళ్లడంతో ఆ అదనపు భారం ప్రజల మీద పడుతుంది. గత సంవత్సరం బడ్జెట్‌లో వంశధార ప్రాజెక్టుకు రూ.40 కోట్లు కేటాయించగా దానిలో రూ.20 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రస్తుత సంవత్సరం బడ్జెట్‌లో అయినా ఎక్కువ నిధులు కేటాయించి వంశధార

ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నాను. ముఖ్యంగా భూసేకరణ చాలా పెద్ద సమస్యగా ఉంది. భూసేకరణలో ఇప్పటివరకు సేకరించాల్సినవి ఎందుకూ పనికిరాని భూములు కొన్ని వందల ఎకరాలతోబాటు, కొన్ని నిర్మాణాలు కూడా ఉన్నాయి. సేకరించిన వాటిలోని నిర్మాణాలకు ఇంతవరకు పరిహారం కూడా ఇవ్వలేదు. నిర్వాసిత గ్రామాలలో ఇంతవరకు మౌలికవసతులు కల్పించకపోవడంతో అక్కడ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాలకు 2005 నుంచి ఇంతవరకు రోడ్డు సౌకర్యం, మౌలికవసతులు కల్పించకపోవడంతో నాటు బండ్లు, మనుషులు కూడా వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. అక్కడ ఉపాధి హామీ పథకం కూడా అమలుచేయడంలేదు. అక్కడి నిర్వాసితులకు పునరావాసం కల్పించి, వారికి మౌలికవసతులు కల్పించాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. అలాగే వారికి ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాల్సిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విధంగా ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులను నిర్దేశించుకొని ఒక సంవత్సరంలో ఏయే ప్రాజెక్టులు పూర్తిచేయగలమో నిర్ధారించుకొని, వాటిని పూర్తి చేయాలని నిర్ణయించుకొన్నాం. గత పది సంవత్సరాల కాలంలో ఆ విధంగా ప్రాజెక్టులు పూర్తి చేసినట్లయితే గౌరవసభ్యులు ఈ రోజు ఆవేదన చెందాల్సిన పరిస్థితి ఉండేది కాదు. 2005-14 మధ్య ప్రాజెక్టులలో పనులు చేయకపోగా, పొడిగింపులు మీద పొడిగింపులు ఇచ్చి దశాబ్దకాలంపాటు సాగడంతో ఈ ఇబ్బందులు వచ్చాయి. గౌరవసభ్యులు చెప్పిన విధంగా భూసేకరణ, పునరావాసానికి సంబంధించి తప్పకుండా చర్యలు తీసుకుంటాం. శాసనసభ సమావేశాలు పూర్తయిన తరవాత ఆ ప్యాకేజీలన్నింటిని పూర్తిగా పరిశీలించి, అక్కడికి స్వయగా వెళ్లి పనులు వేగవంతం చేయడంతోబాటు భూసేకరణ, పునరావాసానికి సంబంధించిన పనులన్నీ 2016లోపు పూర్తిచేసే విధంగా ముందుకు వెళుతున్నాం. ముఖ్యమంత్రిగారు ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఆ విషయం గవర్నర్‌గారి ప్రసంగంలో కూడా పొందుపరచడం జరిగింది. వంశధార, నాగావళి నదులపై ప్రాజెక్టులు పూర్తిచేయడంతోబాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించిన తోటపల్లి ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. గౌరవసభ్యులు చెప్పిన విధంగా ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధిత మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. నేను కూడా ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తానని తెలియజేస్తున్నాను.

శ్రీ కె.వెంకట రమణమూర్తి(పాతపట్నం): అధ్యక్షా, ముఖ్యంగా గత పది సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో మౌలికవసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మీ ద్వారా మంత్రిగారిని కోరేదేమంటే, ఆ ప్రాంతంలో రోడ్లు లేకపోవడంవలన ప్రజలు చందాలు వేసుకొని

రోడ్లు వేసుకొనే పరిస్థితి వచ్చింది. కాబట్టి ఆ ప్రాంతంలో కనీస మౌలికవసతులు కల్పించాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం): అధ్యక్షా, తప్పకుండా ఆ ప్రాంతంలో మౌలికవసతులు కల్పించడంతోబాటు ఆ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం అమలుచేసేందుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

...

**మిస్టర్ స్పీకర్: ప్రశ్న నెం.32 (827)      శ్రీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎం.ఎల్.ఏ.,**

**గౌరవనీయులైన వెనుకబడిన తరగతుల సంక్షేమం మరియు చేనేత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :-**

అ) చేనేతకారుల సహకార సంఘాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో వున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా ;

ఆ) అయితే, సదరు సంఘాలలో పని చేస్తున్న సిబ్బందికి జీతభత్యాల చెల్లింపుకు సంబంధించిన 116-సి నియమాన్ని మినహాయించేందుకు ప్రభుత్వం వద్ద ఏదేని ప్రతిపాదన ఉందా ;

ఇ) పునరుద్ధరణ, సంస్కరణ, పునర్ నిర్మాణ పథకాన్ని (ఆర్ఆర్ఆర్ పథకం) అమలు చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

**వెనుకబడిన తరగతుల సంక్షేమం మరియు చేనేత శాఖ మంత్రి (శ్రీ కొల్లు రవీంద్ర):**

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) రాష్ట్రంలో 2011-12 నుండి ఆర్ఆర్ఆర్ పథకాన్ని అమలుపరచడమవుతున్నది. 489 నేతకారుల సహకార సంఘాలు, 7738 వ్యక్తిగత నేతకారులు రూ.91.08 కోట్ల మొత్తంతో ఈ పథకం క్రింద లబ్ధిపొందారు.

శ్రీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (అనపర్తి): అధ్యక్షా, ఈ రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్న మాట వాస్తవం. గతంలో ప్రాథమిక వ్యవసాయ సహకార

సంఘాలకు 116-సి క్రింద సిబ్బంది జీతభత్యాలు సొసైటీల నుండి చెల్లించడం జరిగేది. తరువాత ప్రభుత్వం 116-సికి మినహాయింపు ఇచ్చి ప్రభుత్వమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది. కానీ చేనేత సహకార సంఘాలకు మాత్రం ఈ నిబంధన నుండి మినహాయింపు ఇవ్వలేదు. చేనేత సహకార సంఘాలకు కూడా 116-సి క్రింద మినహాయింపు ఇచ్చినట్లైతే ఆ సహకార సంఘాలకు ఆర్థికంగా వెసులుబాటు వస్తుంది. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమ్మేళనంతో పొందుపరచిన ఆర్‌ఆర్‌ఆర్ పథకం క్రింద అర్హత పొందిన చేనేత సహకార సంఘాలకు వెంటనే ఈ పథకాన్ని వర్తింప చేసినట్లైతే ఈ సహకార సంఘాలు అప్పుల ఊబి నుండి బయట పడటానికి వెసులుబాటు వస్తుంది. చేనేత కార్మికులు ఉత్పత్తి చేస్తున్న అనేక వస్త్ర నిల్వలు వారి వద్ద ఉండిపోవడం జరిగింది. ఉదాహరణకు తూర్పుగోదావరి జిల్లాలో సుమారు రూ.18 కోట్ల నిల్వలు సొసైటీల దగ్గర ఉన్నాయి. వీటికి వెంటనే మార్కెటింగ్ ఇన్సెంటివ్ ఇచ్చినట్లైతే వాటికి వెసులుబాటు రావడంతోబాటు చేనేత కార్మికులు అప్పుల ఊబి నుంచి బయటపడతారని ఈ సందర్భంగా మీద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలి): స్పీకర్ సార్, మంత్రి గారు మొదటి ప్రశ్నకు లేదండీ అని సమాధానమిచ్చారు. ఇవాళ చేనేత కార్మిక సామాజిక వర్గం మానవ సమాజంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకున్న సామాజిక వర్గం. వీళ్లమీద అనేక బాధ్యతలున్నాయి. సమాజం యొక్క అభివృద్ధికి గానీ, సమాజం పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉండటానికి వీళ్ల పాత్ర ఎంతో ఉందనే విషయం అందరికీ తెలిసిందే. అందువలన గతంలో చేనేత కార్మికులు ఉత్పత్తి చేస్తున్న ప్రతీ వస్తువునీ ప్రభుత్వమే కొనుగోలు చేసి పండుగ దినాలను, ఇతరత్రా ప్రాముఖ్యం చెందిన రోజుల్లో చేనేత కార్మికులను ఆదుకోవాలనే ఒకే ఒక్క లక్ష్యంతో సబ్సిడీ మీద చేనేత వస్త్రాలను ఇచ్చిన పథకాలను ప్రవేశ పెట్టిన నేపథ్యం కూడా తెలుగుదేశం ప్రభుత్వానికుంది. అయితే ఇవాళ ఉన్న పరిస్థితుల్లో చేనేత ఉత్పత్తులకు మార్కెట్‌లేక ఇబ్బందులు పడుతున్న విషయాలను మీ దృష్టికి తీసుకువస్తున్నాను. వారు చేస్తున్న ఉత్పత్తులకు సరియైన కొనుగోలు లేదు, మార్కెటింగ్ లేదు. ప్రభుత్వమే ముందుకు వచ్చి ఏదైనా సహాయం చేస్తుందా అని అంటే ఇప్పుడే నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మీద అనేక బాధ్యతలు ఉండటం వలన ముందుకు రావడానికి కొన్ని అడ్డంకులు ఉన్న విషయాన్ని ముఖ్యంగా చేనేత సమాజమే అంగీకరిస్తోంది. ఈ సమయంలోనే కేంద్ర ప్రభుత్వం Revival, Restructure, Reform అనే స్కీము పెట్టింది. చేనేత కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతో దీనిక్రింద కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.33 కోట్లు విడుదల చేసింది. దానికి మ్యాచింగ్ గ్రాంటు క్రింద ప్రభుత్వం రూ.7 కోట్లు విడుదల చేయాలి.

అధ్యక్షా, ప్రభుత్వాలు ప్రజల దగ్గరి నుంచి పన్నులు వసూలు చేయడమే కాకుండా ఆయా సామాజిక వర్గాల స్థితిగతులను, ఆర్థికపరమైన అభివృద్ధిలో నడిపించడం కోసం ప్రభుత్వం కూడా కొంత వెసులుబాటుతనంతో ముందుకు వచ్చి వృత్తిమీద ఆధారపడిన ఇలాంటి కార్మికులను, ఇలాంటి సామాజిక వర్గాలను ఆదుకోవలసిన అవసరం ఉంది కాబట్టి ఆ

రూ.33 కోట్లు ఏదైతే కేంద్రం విడుదల చేసిందో దానితోబాటు రూ.7 కోట్లు మ్యాచింగ్ గ్రాంటు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ముఖ్యమంత్రి గారిని ఈ సందర్భంగా కోరుతున్నాను. వీలైతే తొందరలో రూ.7 కోట్లు విడుదల చేసి Revival, Restructure, Reform పథకం క్రింద ఈ చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరుతున్నాను. తరువాత రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి. అవి ఇవాళ ఉన్న బకాయిలు కాదు. గడచిన ఏడెనిమిది సంవత్సరాల నుంచి ఉన్న బకాయిలను కూడా వెంటనే ఇవ్వాలి. వీరికి వడ్డీ రాయితీ కూడా ఇవ్వాలి. చేనేతకు సంబంధించి ఏదైతే మూల వస్తువు ఉందో ఆ నూలు మీద సబ్సిడీ ఇవ్వాలి. ఈ విధంగా ఆర్థికంగా, సామాజికంగా వాళ్లకున్న సమస్యల్ని బహిర్గతంగా చెప్పుకోలేని ఈ చేనేత సామాజిక వర్గాలను ఆదుకోవాలనే బాధ్యత ప్రభుత్వానికుందనే మాటను మనవి చేస్తూ వీటిమీద ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో తెలియచేయాలని మీద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ వై.విశ్వేశ్వరరెడ్డి (ఉరవకొండ): సార్, చేనేత రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉందనే విషయాన్ని అందరూ గుర్తించాలి. ముఖ్యంగా ఈ ఒక్క సంవత్సరంలోనే అనంతపురం జిల్లాలో దాదాపుగా 10 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటన ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులు చాలా దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మూతపడిన చేనేత సంఘాల పునరుద్ధరణ, బకాయిల రద్దు, మూల ధన సహాయం అందించడంతో బాటు 50 శాతం సబ్సిడీతో మగ్గాలు సరఫరా చేస్తామనే విషయాల్ని ఎన్నికల మేనిఫెస్టోలో తెలుగుదేశం పార్టీ చెప్పడం జరిగింది. చేనేత కార్మిక సంఘాలకు సంబంధించిన బకాయిల రద్దు, చేనేత సహకార సంఘాల పటిష్టం, ముడి సరుకుల సరఫరా, మార్కెటింగ్ సౌకర్యాలను జిల్లా, డివిజన్ కేంద్రాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పడం జరిగింది. చేనేత కార్మికులకు రూ.1000 కోట్లతో ఫండ్ ఏర్పాటు చేస్తామని, ప్రతీ బడ్జెట్‌లో రూ.1000 కోట్లకు తగ్గకుండా నిధులు కేటాయిస్తామని చెప్పడం జరిగింది. ఈ మధ్య కాలంలో రిబేటు, త్రిఫ్ట్ ఈ సౌకర్యం అంతా కట్ చేశారు. నెలకు రూ.600 వరకు యార్న్ కొనుగోలుకు సబ్సిడీ ఇచ్చే ప్రక్రియ మూడు నెలలుగా ఆగిపోయింది. నేషనల్ హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్‌మెంటు కార్పోరేషన్ వాళ్లు నెలకు రూ.1000/- ఇచ్చే సౌకర్యం కూడా రద్దయిందని చాలా మంది చేనేత కార్మికులు కోరారు. ఈ విషయంలో మొహమాటాలకు పోకుండా ఉన్న పరిస్థితిని గుర్తించి వాళ్లను ఆదుకోవడానికి, ఆప్కోను బలోపేతం చేయడానికి, ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకోవాలి. కేరళ రాష్ట్రంలో ప్రభుత్వ తోడ్పాటుతో చేనేత వస్త్రాలు ప్రతీ స్కూలుకి ఉచితంగా సరఫరా చేస్తున్నారు. అలాగే రాజీవ్ విద్యా మిషన్ ద్వారా మన రాష్ట్రంలో కూడా ఉచితంగా ప్రతీ స్కూలుకి, స్కూలు పిల్లలకు బట్టలు అందించడానికి ప్రభుత్వం స్పందించాలని, ఎలక్షన్ హామీలను అమలు చేస్తే ఈ పరిస్థితి మెరుగవుతుందని నేను మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కొల్లు రవీంద్ర (మచిలీపట్నం): అధ్యక్షా, రామకృష్ణారెడ్డి గారు చెప్పిన విధంగా ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టము నందలి సెక్షన్ 116-సి ని మినహాయించడం గురించి,

"ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం నందలి సెక్షన్ 116-సి ప్రకారం సంఘం ఏ సంవత్సరంలోనైనా సాధించిన స్థూల లాభంలో 30 శాతం లేక వ్యాపార వ్యవహార మూలధనంలో 20 శాతం ఏది తక్కువైతే దానిని మించకుండా ఏర్పాటు చేసుకున్న నిధికి లోబడి తన సిబ్బందీకరణ పద్ధతులు, వారి అర్హతలు, వారి వేతనములు మరియు ఇతర భత్యములను నిర్ణయించి రిజిస్ట్రార్ అనుమతికి పంపే అధికారం కలిగియున్నది. చేనేత సహకార సంఘాల అధ్యక్షులు మరియు ఇతరుల అభ్యర్థన మేరకు సదరు సెక్షన్ 116-సిని చేనేత సహకారం మినహాయింపుకి ప్రతిపాదనలు పంపియున్నాం. తప్పకుండా దానిని పరిశీలించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. రాష్ట్రంలో ఉన్న అన్ని చేనేత సహకార సంఘాలకు పునరుద్ధరణ, సంస్కరణ మరియు పునర్నిర్మాణం, రాష్ట్ర ప్రభుత్వ రుణమాఫీ పథకం క్రింద 2011-12 నుండి ఆర్థిక సహాయాన్ని పొందుచున్నవి. కాబట్టి చేనేత సహకార సంఘాలు తీవ్రమైన ఇబ్బందిని ఎదుర్కొంటున్న లేదా పైన చెప్పబడిన పథకం వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

2011, నవంబరులో చేనేత రంగమునకు పునరుద్ధరణ, సంస్కరణ మరియు పునర్‌నిర్మాణం క్రింద రూ.3,884 కోట్లతో ప్రకటించి నాబార్డు ఈ పథకాన్ని అమలు చేయు సంస్థగా ఉన్నది. దీనిద్వారా రాష్ట్ర ప్రభుత్వం యొక్క వాటా 25 శాతం, కేంద్ర ప్రభుత్వం యొక్క వాటా 75 శాతంతో సంఘాలకు ఇవ్వడం జరుగుతుంది. సూర్యారావు గారు చెప్పిన విధంగా 20 శాతం యార్న్ సబ్సిడీ ఇవ్వడం జరుగుతోంది. అది కూడా నేరుగా చేనేత కార్మికుడికి వచ్చే విధంగా ప్రతిపాదన చేయడం జరిగింది. పావలా వడ్డీ రుణాలు కూడా ఇవ్వడం జరుగుతుంది. ట్రైనింగ్ మరియు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా ఇవ్వడం జరుగుతుంది. కామన్ వర్క్ షెడ్స్ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆరు నేత బజార్లను కూడా ఇప్పటికే ప్రారంభించడం జరిగింది. 33 క్లస్టర్ల ద్వారా దాదాపుగా 22,967 మంది వీవర్స్‌ని ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుంది.

...

అలాగే 266 గ్రూపులకు రూ.9 కోట్లను ఆల్‌రెడీ రిలీజ్ చేయడం, మరో రూ.3 కోట్లను ప్రపోజ్ చేయడం కూడా జరిగింది. అలాగే వెల్ఫేర్ స్కీమ్స్‌ని కూడా, మహాత్మాగాంధీ బంకర్ బీమా యోజన క్రింద 62,228 వీవర్స్‌కి ఇన్సూరెన్స్‌ను, అలాగే స్కాలర్‌షిప్పులను కూడా ఇవ్వడం జరుగుతోంది. వృద్ధాప్య పింఛన్లను కూడా 86 వేల మందికి ఇవ్వడం జరుగుతోంది. అది కూడా 65 సంవత్సరాల నుంచి **50** సంవత్సరాలకు తగ్గించి రూ.200 ఇచ్చే పెన్షన్‌ను రూ.1000 లకు పెంచి ఇవ్వడం జరిగింది. థ్రిఫ్ట్ ఫండ్‌ను కూడా ఇవ్వడం జరుగుతోంది. ఇది కాకుండా ఎక్కువ శాతం ఎక్యుమ్యులేట్ అయిపోయి ఉన్న స్టాక్‌ను అమ్ముకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి గారు మొన్న 20 శాతం రిబేట్‌ను కూడా ప్రకటించడం జరిగింది. రైతు రుణమాఫీతోబాటు చేనేత రుణ మాఫీ చేయడం కోసం, కోటయ్య కమిటీ ఇచ్చిన రిపోర్టు ప్రకారం రూ.165 కోట్లను మరి వీవర్స్‌కి గానీ అలాగే 5 హెచ్‌బి లోపు ఉన్న పవర్ లూమ్స్‌కు గానీ అవసరమైతే రూ.200 కోట్లను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నాను.

అట్లాగే విశ్వేశ్వరరెడ్డి గారు చెప్పిన విధంగా మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి అంశాన్ని అమలు చేస్తాము. చేనేత కార్మికులుగా ఉన్న వారందరినీ ఆదుకునే అవకాశాన్ని ఎట్టిపరిస్థితుల్లో కూడా తీసుకుంటామని ఈ సందర్భంగా ప్రకటిస్తున్నాను.

**ప్రశ్న నెం.685 (33) గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ మరియు పారిశుద్ధ్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారాన్ని తెలియజేస్తారా?**

అ) ప్రమాదవశాత్తు ఇళ్లు కాలిపోయినట్టి కుటుంబాలకు ఇందిరా ఆవాస్ యోజన క్రింద గృహాలను మంజూరు చేయడంలేదన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తేవడం జరిగిందా?

ఆ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్య ఏమిటి?

ఇ) రాష్ట్రం మొత్తం మీద పెండింగులో ఉన్న అట్టి కుటుంబాల దరఖాస్తుల సంఖ్య ఎంత? వారికి గృహాలను నిర్మించడానికి ఎప్పటిలోగా అనుమతిని ఇవ్వడమవుతుంది?

**గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ మరియు పారిశుద్ధ్య శాఖ మంత్రి (శ్రీమతి కిమిడి మృణాళిని)**

అ) అవునండీ.

ఆ) కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ చేసిన ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం అగ్ని ప్రమాదం, అల్లర్లు, దహనకాండలు వంటి కేసులతోపాటు ప్రకృతి వైపరీత్యాలకు గురైన బిపిఎల్ కుటుంబాలన్నింటికీ గృహాలను మంజూరు చేయడం కోసం చేసిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సాధికార కమిటీ ఆమోదించవలసి ఉంది. అయితే, జిల్లా కేటాయింపులో రెగ్యులర్ ఇందిరా ఆవాస్ యోజన కార్యక్రమం క్రింద ప్రకృతి వైపరీత్యాలకు గురైన కుటుంబాలతోపాటు బిపిఎల్ కుటుంబాలన్నింటికీ జిల్లా కలెక్టర్లు గృహాలను మంజూరు చేయవచ్చు.

ఇ) ఇందిరా ఆవాస్ యోజన ప్రత్యేక ప్రాజెక్టుల క్రింద ప్రకృతి వైపరీత్యాల బాధితులకు 3895 గృహాలను మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను సమర్పించడమైయింది. వాటిలో అగ్ని ప్రమాద బాధితులకు సంబంధించిన 3275 గృహాలు ఉన్నాయి. ఇవి జనవరి 2015 నాడు పంపించడం జరిగింది.

శ్రీ కాకాని గోవర్ధన్‌రెడ్డి(సర్వేపల్లి): అధ్యక్షా, ఇందిరా ఆవాస్ యోజన (ఐఏవై) పథకం క్రింద అగ్ని ప్రమాద బాధితులకు, అనాథలకు, అంగవైకల్యం కలిగిన వారికి, ప్రకృతి వైపరీత్యాల

కారణంగా గృహాలను కోల్పోయిన కుటుంబాల వారికి గృహాలను మంజూరు చేసే పరిస్థితి ఉంది. అయితే గతంలో ఎప్పుడైనా సరే జిల్లా కలెక్టర్ గారికి 500 ఇళ్లను మంజూరు చేసే అధికారం ఉండేది. ఆ 500 ఇళ్లు కూడా ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే, ఆ విషయాన్ని సంబంధిత జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకువెళ్లిన రెండు వారల లోపల ఇళ్లను మంజూరు చేసే పరిస్థితి గతంలో ఉండేది. అయితే మంత్రిగారు ఇచ్చిన సమాధానంలో ప్రమాదవశాత్తు ఇళ్లు కాలిపోయిన కుటుంబాలకు ఇందిరా ఆవాస్ యోజన పథకం క్రింద గృహాలను మంజూరు చేయడం లేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా అని ప్రశ్న వేస్తే అవునండీ అని మంత్రిగారు సమాధానం చెప్పడం జరిగింది. అంటే అగ్ని ప్రమాదంలో ఇళ్లను కోల్పోయిన వ్యక్తులందరూ సర్వస్వాన్ని కోల్పోయి ఇళ్లు లేక చెట్ల క్రింద బ్రతికే పరిస్థితి ఉంది. అయితే జిల్లా కలెక్టర్ గారు మాత్రం మా దృష్టికి వచ్చిన వెంటనే మేము ప్రొసీడింగ్స్ ఇష్యూ చేశాము, ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేసుకోవాలి, వాటిని ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేసే సౌకర్యం లేదు కాబట్టి మేము ప్రొసీడింగ్స్ ఇష్యూ చేసినప్పటికీ కూడా అవి ప్రభుత్వం నుంచి మంజూరు కాలేదని జిల్లా కలెక్టర్లు చెప్పే పరిస్థితి ఉంది. అగ్ని ప్రమాద బాధితులకు సంబంధించి దాదాపుగా 3,275 ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. మేము మంత్రి గారిని అడిగేదేమంటే ఐఏవై పథకం క్రింద జనవరి నుండి పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు. 2014-15 సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఎన్ని? మీరు ఖర్చు చేసిన మొత్తం ఎంత? నిర్మించిన ఇళ్ల సంఖ్య ఎంత? ఇంతవరకు అసలు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులే రాలేదా? వచ్చిన నిధులేమైనా దారి మళ్లించడం జరిగిందా? ఇళ్లు మంజూరు కాలేదు, బిల్లులను మంజూరు చేసిన దాఖలాలు లేవు. మేనిఫెస్టోలో మాత్రం ఒక్కొక్క ఇంటికి రూ.1,50,000 ఇస్తామని ప్రకటించడం జరిగింది. దీని ప్రకారం ఐఏవై పథకం క్రింద పెండింగ్‌లో ఉన్న ఇళ్లను ఎప్పటిలోపు ఇస్తారు? దానితోబాటు క్రొత్త ఇళ్లను ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియజేయాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాము.

శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ (తెనాలి): అధ్యక్షా, తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని ఒక చిన్న అనుబంధ ప్రశ్నను అడుగుతున్నాను. సహజంగా ప్రమాదవశాత్తు గృహాలు కాలిపోయిన కుటుంబాలకు ఐఏవై పథకం క్రింద ప్రభుత్వమే గృహాలను మంజూరు చేయడమే కాకుండా వారికి చేసిన ఆర్థిక సహాయాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరించడం జరుగుతోంది. ఇది పట్టణాల్లో కూడా ఇదే విధంగా జరిగిన అంశాలు మేము ప్రభుత్వంలో ఉన్నప్పుడు కూడా చూసిన అంశం. కానీ ఈ మధ్య పట్టణాల్లో ఏదైనా ప్రమాదవశాత్తు గృహాలు కాలిపోయినట్లయితే కొంత మేరకే లోను, మిగతాది ఉచితంగా ఇస్తునట్లుగా ప్రభుత్వ యంత్రాంగం ద్వారా తెలిసింది. ఇది వాస్తవమా కాదా అనేది తెలియజేయాల్సిందిగా గౌరవ మంత్రి గారిని తమరి ద్వారా కోరుతున్నాను.

శ్రీ వి.వి.శివరామరాజు(ఉండి): అధ్యక్షా, ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు గృహాలన్నీ కాలిపోయి, వారు సర్వస్వాన్ని కోల్పోయి ఆయా కుటుంబాల వారు రోడ్డున పడే పరిస్థితి వస్తోంది. సాధారణంగా ఇంతకు ముందు కాలంలో ఈ ప్రమాదాలు ఏ విధంగా జరిగేవంటే, వారు కట్టెలతో వంట చేసుకుంటున్నప్పుడు పొయ్యిలోని నిప్పు రవ్వ ఎగిరిపడటం ద్వారా గానీ, బుడ్డి దీపం వల్ల గానీ గతంలో ఫైర్ యాక్సిడెంట్లు జరిగేవి. ప్రస్తుతం ఎక్కడ ఫైర్ యాక్సిడెంట్లు జరిగినా కరెంటు షార్ట్‌సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదాలు సంభవించి మొత్తం సర్వస్వాన్ని కోల్పోతున్నారు. ఎక్కడైతే ఈ షార్ట్‌సర్క్యూట్ అవుతుందో, ఎక్కడైతే లోక్వాలిటీ కండక్టర్లను వాడుతున్నారో అటువంటి సందర్భంలో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంటు వారు కూడా దీంట్లో ఇంటర్వీన్ అయి, ఇటువంటి ప్రమాదాలు సంభవించకుండా లోక్వాలిటీ కండక్టర్లను ఎవరైతే వాడుతున్నారో వాటన్నింటినీ రీప్లేస్ చేసి, ఇటువంటి ప్రమాదాలను నివారిస్తే బాగుంటుంది.

అదే విధంగా, ఈ ప్రమాదాల్లో ఇళ్లు కాలిపోయిన వారందరూ సర్వస్వాన్ని కోల్పోయి పందిళ్లు వేసుకొని నివాసం ఉండే పరిస్థితి ఉంటోంది. ప్రభుత్వం ఇచ్చే సహాయాన్ని సత్వరం అందించి, వారి ఇళ్లు కట్టించే విధంగా, ప్రమాదం సంభవించిన 24 గంటల్లోనే ఇళ్లను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే, వారికి లబ్ది చేకూర్చినట్లవుతుంది, అదేవిధంగా వారికి న్యాయం చేసినట్లవుతుంది. ఈ విషయాన్ని పరిగణనలోనికి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను. అదే విధంగా మన ప్రభుత్వం ఇచ్చే తక్షణ సహాయం కూడా కొంత ఆలస్యం అవుతోంది. ఆ తక్షణ సహాయాన్ని స్పాట్‌లోనే ఇచ్చినట్లయితే ఆ బాధితులకు చాలా రిలీఫ్‌గా ఉంటుందని తమరి ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

శ్రీ కూన రవికుమార్ (ఆమదాలవలస): అధ్యక్షా, ప్రభుత్వానికి ఒక వివరణ, ఒక సూచన కూడా చేస్తున్నాను. రూరల్ ఏరియాస్‌లో ఫైర్ యాక్సిడెంట్లు జరిగినప్పుడు ఇందిరా ఆవాస్ యోజన పథకం క్రింద గృహాలను మంజూరు చేస్తున్నారు. అర్బన్ ఏరియాస్‌లో ఫైర్ యాక్సిడెంట్లు జరిగినప్పుడు మాత్రం ఎటువంటి కవరేజ్ ఉండటం లేదు. అందుచేత చాలా మంది నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి ఐఏవై స్కీమ్ అనేది అర్బన్ ఏరియాస్‌కి కూడా ఎక్స్‌టెండ్ చేస్తారా? చేసేటువంటి అవకాశం ఏమైనా ఉందా? ప్రభుత్వాన్ని పరిశీలించమని కోరుతున్నాను.

...

శ్రీమతి కిమిడి మృణాళిని (చీపురుపల్లి): అధ్యక్షా, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా గత తొమ్మిది మాసాలుగా ప్రతి శాసనసభ సమావేశంలో కూడా గౌరవ సభ్యులు గృహాల మంజూరుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలను చాలా బాధాకరమైన పరిస్థితుల్లో సభలో చెప్పాల్సి వస్తోంది. ఎందుకంటే గతంలో మా పార్టీ ప్రభుత్వ హయాంలో "ఇందిరా ఆవాస్ యోజన (I.A.Y.)" పథకం క్రింద గృహాల మంజూరుకు సంబంధించిన అంశం జిల్లా కలెక్టర్ పరిధిలో

ఉండేది. జిల్లా స్థాయిలో ఎప్పుడైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో అంటే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు గానీ లేదా ఇతరత్రా బాండెడ్ లేబర్స్‌కు గానీ, స్కావెంజర్స్‌కు గానీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు గానీ, ఎస్సీ, ఎస్టీలకు గానీ అక్కడ స్థానికంగా ఉన్నటువంటి అవసరాల మేరకు జిల్లా స్థాయిలోనే మంజూరు చేయడమనేది జరిగేది. ఐ.ఏ.వై. పథకం నందు **75%** షేర్ కేంద్ర ప్రభుత్వానిదైతే, మిగిలిన **25%** షేర్ రాష్ట్ర ప్రభుత్వానిదై ఉంటుంది. గతంలో మా ప్రభుత్వ హయాంలో జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టరే గృహాలను మంజూరు చేసే అధికారం ఉండేది.

అయితే, దురదృష్టవశాత్తు గత పది సంవత్సరాలుగా ఐ.ఏ.వై. పథకం క్రింద మంజూరయ్యే గృహాలను కూడా State Housing Programmeతో కలిసి మిళితం చేసి ఏదైతే ఇందిరా హౌసింగ్ ప్రోగ్రామ్ ఉందో దానితో కలిపి గృహాలను మంజూరు చేయడం వల్ల ఐ.ఏ.వై. క్రింద మంజూరు కావల్సిన గృహాలను జిల్లా స్థాయిలో కలెక్టర్ల పరిధిలో మంజూరు చేయడానికి అవకాశం లేనటువంటి పరిస్థితి నెలకొని ఉంది. ఎందుకంటే ఈమధ్యే కేంద్ర ప్రభుత్వం నుంచి ఆ అంశానికి సంబంధించి విచారించేందుకు గాను విజిలెన్స్ కమిటీ విజయనగరం జిల్లాకు రావడం జరిగింది. అక్కడ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ సమావేశానికి కేంద్ర మంత్రివర్యులు శ్రీ పి.అశోక్ గజపతి రాజు గారు మరియు విశాఖపట్టణం పార్లమెంట్ సభ్యులు కూడా హాజరుకావడం జరిగింది. ప్రస్తుత అంశానికి సంబంధించిన చర్చ ఆ సమావేశంలో జరిగింది. ఐ.ఏ.వై. పథకం క్రింద మంజూరు కావల్సిన గృహాలు జిల్లా స్థాయి పరిధిలో, జిల్లా కలెక్టర్ల స్థాయిలో ఉండే విధానం గత పది సంవత్సరాలుగా లేదనే నిజం ఆ సమావేశంలో బహిర్గతం కాగా కేంద్ర విజిలెన్స్ కమిటీ విస్మయం వ్యక్తపరిచింది. ఆ సమాచారం అన్ని దినపత్రికల్లో ప్రచురితమైంది. ఎందుకంటే ఐ.ఏ.వై. పథకం క్రింద మంజూరు కావల్సిన గృహాలను State Housing Programme క్రింద మంజూరు చేసే విధంగా మిళితం చేయడానికి అవకాశం లేనటువంటి గైడ్‌లైన్స్ కేంద్ర ప్రభుత్వం నుండి జారీ అయినాయి. అట్లాంటి దురదృష్టకరమైన పరిస్థితుల్లో గత ప్రభుత్వ హయాంలో గత పది సంవత్సరాలుగా ఈ విధంగా గైడ్‌లైన్స్‌ను ఉల్లంఘించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నటువంటి కార్యక్రమాలు చేయడం వల్ల, దురదృష్టవశాత్తు ఏదైనా అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో అగ్ని బాధితులకు జిల్లా స్థాయిలో మంజూరు చేయాల్సిన గృహాలను కూడా రాష్ట్ర పరిధిలోకి తీసుకువచ్చి జిలా కలెక్టర్ల చేతులను కట్టేసి, వాళ్లను కట్టడి చేసి ఏ విధమైన అవకాశం కూడా జిల్లా కలెక్టర్లకు ఇవ్వకుండా, అగ్ని ప్రమాద బాధితులకు గృహాలను మంజూరు చేసే అవకాశం లేకుండా చేసినటువంటి ఘనత గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. అందుకు గాను రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రిగా నేను, సభలో కూర్చునటువంటి ప్రజాప్రతినిధులందరూ బాధ పడుతున్నటువంటి సందర్భం ప్రస్తుతం దాపరించింది. ఆ పరిణామాన్ని నేను తప్పకుండా ఖండిస్తున్నాను. గౌరవ సభ్యులందరూ కూడా గృహాలకు సంబంధించిన అంశాన్నే ప్రస్తావిస్తున్నారు. అసలు హౌసింగ్ ప్రోగ్రామ్ గురించి గౌరవ సభ్యులు అడిగినటువంటి

ప్రశ్నలకు ఏమి సమాధానం చెప్పాలో కూడా తెలియనటువంటి పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉంది. గ్రామాలకు వెళ్లితే ప్రతీ నిరుపేద, ఇంటి మంజూరుకు దరఖాస్తు చేసే పరిస్థితి ఉంది. కానీ ఆ విధంగా దరఖాస్తులిచ్చిన పేదల పేర్లన్నీ అప్పటికే గృహాలు మంజూరైన జాబితాలో ఉంటున్నాయి. వాస్తవానికి అటువంటి పేదలకు గ్రామాల్లో గృహాలు లేవు. అసలు మంజూరైనట్టుగా వాళ్లకు సమాచారం కూడా లేనటువంటి పరిస్థితి కనబడుతోంది. కానీ, ఆ పేదల పేరున గృహాలు మంజూరైనట్టుగా, బిల్లుల చెల్లింపు జరిగినట్టుగా సమాచారం మాత్రం ఉంది.

ఆ విధంగా గ్రామాల్లో అసలు ఎవరికి గృహాలు మంజూరు చేయాలో, ఎంత మందికి గృహాలు మంజూరు చేయాలో తెలియనటువంటి పరిస్థితి వల్ల ప్రభుత్వం అయోమయంలో ఉంది. పేద ప్రజానీకం గృహాలు మంజూరు కావాలని కోరుతోంది. కానీ ప్రభుత్వం మంజూరు చేయలేనటువంటి పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే ఎవరైతే ప్రస్తుతం గృహ మంజూరుకు సంబంధించిన దరఖాస్తు ఇస్తున్నారో ఇప్పటికే ఆ దరఖాస్తుదారుని పైన గృహం మంజూరైనట్టుగా, బిల్లు చెల్లింపు జరిగినట్టుగా జాబితాలో కనబడుతోంది. ఆ పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో ఉంది. అదే విధంగా ఈ పరిస్థితిని ప్రతీ ఎమ్మెల్యే ఎదుర్కొంటున్నారు.

అధ్యక్షా, ఐ.ఏ.వై. పథకం క్రింద గృహాల మంజూరుకు సంబంధించి కొత్తగా వచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం మొత్తం మంజూరీలో 5% వేరుగా ఉంచుకుని ఎక్కడైనా ప్రకృతి వైపరీత్యాల వల్ల గానీ, అగ్ని ప్రమాదాల వల్ల గానీ ఇండ్లు కోల్పోయిన వారికి ఆ ఉంచుకున్న 5% గృహాల నుంచి ఆ బాధితులకు గృహాలను మంజూరు చేయమనే నిబంధన ఉంది. ఆ విధంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను అవసరమని భావిస్తే గౌరవ సభ్యులందరికీ పంపించడం జరుగుతుంది. ఈ గైడ్‌లైన్స్ 2013వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

**<u>Guidelines of Housing Department for the year 2013</u>**

**"5% of IAY allocation would be retained at the central level as a reserve fund. Special projects for utilizing the reserve fund can be posted by States, UT's for the following purposes. Rehabilitation of BPL families effected by natural calamities, rehabilitation of BPL families effected by violence and law and order problems, settlement of re-bonded labourers, and liberated manual scavengers, settlement of particularly vulnerable tribal groups. These projects would have**

**to be submitted by the State Governments with adequate details and justification to the Ministry of Rural Development by September''**

ఇది కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి క్లారిఫికేషన్. గతంలో ఐ.ఏ.వై. పథకం క్రింద గృహాలను జిల్లా స్థాయిలో మంజూరుచేసే అవకాశం ఉండేది. తరువాత కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం జిల్లా కలెక్టర్లే ఐ.ఏ.వై. పథకం క్రింద గృహాలను మంజూరుచేసి అందుకు సంబంధించిన ratification కొరకు కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం జిల్లా కలెక్టర్లే గృహాలు మంజూరు చేసి తరవాత కేంద్రానికి ratification కొరకు పంపించేటటువంటి పరిస్థితి లేదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు గానీ, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు గానీ ఆ బాధితుల జాబితాను పూర్తి సమాచారం (detailed list with justification) తో కేంద్ర ప్రభుత్వానికి పంపించమనే విధంగా గైడ్‌లైన్స్ ఉన్నాయి. ఆ తరువాతే అగ్ని ప్రమాద బాధితులకు కేంద్ర ప్రభుత్వం నుంచి గృహాలు మంజూరు అవుతాయి. కనుక గౌరవ సభ్యులందరూ విషయాన్ని గమనించాలని సభాముఖంగా తమరి ద్వారా కోరుతున్నాను.

అదే విధంగా గౌరవ సభ్యులు, శ్రీ కూన రవికుమార్ గారు అడిగినట్టుగా రూరల్ ఏరియాస్‌కు కూడా ఐ.ఏ.వై.పథకం క్రింద అగ్ని ప్రమాదాలకు గురైన బాధితులకు గృహాలను మంజూరు చేయాల్సిందిగా కోరుతున్నారు. తప్పకుండా గౌరవ సభ్యులు చెప్పినటువంటి అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సత్వర చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తమరిద్వారా సభకు తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: మంత్రిగారూ, ఐ.ఏ.వై. పథకం క్రింద గృహాల మంజూరులో అవకతవకలు జరిగాయని మీరు చెబుతున్నారు. డబ్బులు తీసుకుని గృహాల మంజూరు జరిగిందని కూడా మీరే చెబుతున్నారు. మీరే ఆ అవకతవకలపైన విచారించి సత్వర చర్యలు తీసుకోవచ్చు కదా! తప్పిదాలకు పాల్పడిన వారిని గుర్తించి వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేయొచ్చు కదా!

**Question No. 711 (34) is postponed at the request of the Member.**

శ్రీ కె. గోవర్ధన్ రెడ్డి: అధ్యక్షా.........

మిస్టర్ స్పీకర్: గోవర్ధన్ రెడ్డి గారు మాట్లాడండి.

శ్రీ కె. గోవర్ధన్ రెడ్డి(సర్వేపల్లి): అధ్యక్షా, గౌరవ మంత్రి గారు మేం అడిగిన ప్రశ్నకు తప్ప మిగిలిన సమాచారం అంతా చెప్పడం జరిగింది. మేం అడిగిన ప్రశ్నకు తప్ప మిగితా సమాచారం అంతా సభకు ఇచ్చారు. మేం ప్రధానంగా అడిగేదేమిటంటే, గతంలో ఎప్పుడైనా సరే జిల్లా

కలెక్టర్లు గృహాలను మంజూరు చేసిన తరువాత, వివరాలను అప్‌లోడ్ చేసిన తరువాత, పదిహేను రోజుల లోపల లబ్ధిదారులకు గృహాలు మంజూరు అయ్యే అవకాశం ఉండేది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అగ్ని ప్రమాద బాధితులకు సంబంధించి ఒక్క గృహం కూడా మంజూరు కాలేదు. జనవరి మాసం వరకు మీరు ఇవ్వలేదని మీరే చెబుతున్నారు. కానీ జనవరి మాసం తరువాత మీ లెక్క ప్రకారం 3,895 గృహాలు. అధికారుల వద్ద నుండి సమాచారం తెప్పించుకోండి. అగ్ని ప్రమాదాల బాధితులకు మీ హయాంలో ఒక్క గృహమైన మంజూరైందా? మంజూరైనటువంటి పరిస్థితి ఉందా? మంజూరై ఉంటే సమాధానం చెప్పండి. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సర కాలంగా గృహ మంజూరుకు సంబంధించిన నిధులను విడుదల చేసిన దాఖలాలున్నాయా? ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా ఆ నిధులను ఖర్చుచేసి ఎన్ని గృహాలను నిర్మించి అగ్ని ప్రమాద బాధితులకు మంజూరు చేశారు? స్పష్టంగా మేం అడిగిన అంశాలకు సంబంధించిన సమాధానం చెప్పాల్సి ఉంది. మీరు అవసరమైన అంశాలకు సంబంధించిన సమాధానాన్ని సభలో చెప్పకుండా గతానికి వెళ్లారు. గతానికి వెళ్లాలంటే, డిబెటబుల్‌గా చెప్పుకోవడానికి చాలా ఉంది.

కానీ, ఈరోజున మేం అడిగింది కేంద్ర ప్రభుత్వం నుంచి గృహాలకు సంబంధించి ఎంత మొత్తంలో నిధులు మంజూరు అయినాయి? వచ్చిన నిధుల్లో ఏ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించి గృహాలను నిర్మించి, లబ్ధిదారులకు మంజూరు చేసింది? ఆ సమాచారం చెప్పండి? గత సంవత్సర కాలంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపని కారణంగానే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదా? నిధులు విడుదల అనేది గత సంవత్సర కాలంగా జరగలేదా? సంవత్సర కాలంగా నిధుల కొరత వల్ల నూతనంగా గృహాలను నిర్మించే పరిస్థితి ఉందా, లేదా? వివరంగా సమాధానం చెప్పవల్సిందిగా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీమతి కిమిడి మృణాళిని (చీపురుపల్లి): అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన అంశానికి సంబంధించి రూ.568.00 కోట్లు ఐ.ఏ.వై. పథకం క్రింద 2014-15వ సంవత్సరానికి గాను మొత్తం వెచ్చించి 76,330 గృహాలను నిర్మించి లబ్ధిదారులకు మంజూరుచేయడం జరిగింది. అందులో కేంద్ర ప్రభుత్వ వాటా మొత్తం రూ.426.00 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా మొత్తం రూ.142.00 కోట్లు. ఆ మొత్తం సొమ్ములో రూ.330.00 కోట్లు గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం ఖర్చు చేయడం జరిగింది.

గౌరవ సభ్యులు చెప్పినట్టుగానే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగింది. త్వరలోనే ఆ ప్రతిపాదనల నిమిత్తం కొత్తగా గృహాల మంజూరు జరుగుతుంది. అయితే, ఈ సందర్భంగా మేం ప్రభుత్వం తరపున చెప్పే సమాధానం ఏమిటంటే, ప్రస్తుతం మారినటువంటి కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం జిల్లా స్థాయిలో కలెక్టర్లు

అగ్నిప్రమాద బాధితులకు గృహాలను మంజూరు చేసే అధికారం లేదు కనుక కేవలం ప్రతిపాదనలను మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరుగుతోంది. అయితే ఐ.ఏ.వై. పథకం క్రింద గృహాల మంజూరు గత పది సంవత్సరాలుగా అగ్నిప్రమాద బాధితులకు ఎక్కడ కూడా ఇవ్వలేదనే విషయాన్ని కచ్చితంగా చాలా క్లియర్‌గా సభకు చెప్పగలం. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం తరపున విజయనగరం జిల్లాకు విజిలెన్స్ కమిషన్ వచ్చిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వచ్చిన చర్చలో ఐ.ఏ.వై. పథకానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాను లింక్ చేయడం వల్ల ఆ విధమైన అవకతవకలు జరిగేందుకు అవకాశం కల్గిందనే విషయం తెలిసింది. ఆ తప్పిదం గత పది సంవత్సరాల ప్రభుత్వ హయాంలో జరిగింది. గత ప్రభుత్వాలు చేసిన తప్పులను ఈనాడు మా ప్రభుత్వంపైన రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. చాలా బాధగా ఉంది. ఆ కాలంలో ఒక్కో లబ్ధిదారుడికి ఐదేసి బిల్లులను మంజూరుచేశారు. ఆ విషయం ప్రత్యక్షంగా అందరికీ తెలిసిందే. ఆ విధంగా ఐ.ఏ.వై. పథకం క్రిందనే, ఇందిరమ్మ పథకం క్రింద గృహాలను మంజూరుచేసే విధంగా నిర్ణయం తీసుకోవడం జరిగింది. నేను చెప్పే విషయాలన్నీ వాస్తవాలే. ప్రతిపక్షం పనిగట్టుకుని ప్రభుత్వం పైన ఆరోపణలు చేస్తోంది. ఒక్కొక్కరు పది, పదహేను గృహాల పైన బిల్లులు సృష్టించి ప్రభుత్వ సొమ్మును కాజేయడం జరిగింది. ఈనాడు గృహాల మంజూరు గురించి పేద ప్రజానీకం చాలా ఇబ్బందులు పడుతోంది. నిజానికి పేద ప్రజలకు గృహాలు లేవు. కానీ వారి పేరున గృహం మంజూరైనట్టుగా జాబితా ఉంది. తద్వారా బిల్లు పేమెంట్స్ కూడా జరిగింది. పేదవాడు ఇళ్లు లేదని ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తే ఏ విధంగా మంజూరు చేయాలో తెలియనటువంటి పరిస్థితి నెలకొని ఉంది. ఇళ్లు లేదని నిరుపేద మొర్రో అని అంటున్నాడు. కానీ అతని పేరు ఇళ్లు మంజూరైనట్టుగా జాబితాలో చేర్చబడింది. తప్పకుండా అన్ని అవకతవకలపైన ప్రభుత్వం విచారణ చేయిస్తోంది. నివేదక ప్రభుత్వానికి అందిన వెంటనే తప్పకుండా బాధ్యులపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను.

...

మిస్టర్ స్పీకర్ ః అచ్చెనాయుడు గారు..

శ్రీ కె.అచ్చెన్నాయుడు (టెక్కలి)ః అధ్యక్షా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలసి ఇందిరా ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తుంది. ఇందులో మొదటి ప్రాధాన్యత ఇళ్లు కాలిపోయిన బాధితులకు ఇవ్వాల్సి ఉంది. గౌరవ సభ్యులు చెప్పిన విధంగా గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మాణానికి ఎంత మంజూరు చేసింది, అవి దేనికి ఖర్చుపెట్టారు అని సభ్యులు అడుగుతున్నారు. ఇబ్బంది ఎక్కడ వచ్చిందంటే...

(సంబంధిత మంత్రిగారు సమాధానం చెప్పాలి అంటూ వైఎస్ఆర్‌సీపీ సభ్యులచే సభకు అంతరాయం )

సంబంధిత మంత్రిగారు సమాధానం చెప్పారు. కానీ నాకున్న అనుభవం కూడా చెబుతాను. నేను ఎవరినీ విమర్శించడం లేదు, ఉన్న సమస్య చెబుతున్నాం. గత రెండు మూడు సంవత్సరాల నుండి ఇళ్లు కాలిపోయి, ఇల్లు లేక ఎవరు ఇబ్బంది పడుతున్నారో వారికి మొదటి ప్రాధాన్యతలో ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సి ఉంటుంది. ఇండ్లు కాలిపోయి ఇండ్లు లేక ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. ఏదైనా పూరి గుడిసె ఇల్లు ఉండి కాలిపోయిందంటే అది నిజమే. ఇల్లు కాలిపోయినట్లు రికార్డ్సు చూపించాలి. ఎవరైతే అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధితులున్నారో వారికి ఇల్లు మంజూరు చేయాలి. గతంలో వారికి ఇల్లు మంజూరైనట్లుగా, వారు తిరిగి ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నుండి డబ్బు అందుకున్నట్లుగా రికార్డులున్నాయి. మేము వారికి ఇల్లు మంజూరు చేయలంటే వీలు కాని పరిస్థితి ఉంది. అగ్ని ప్రమాదంలో ఇల్లుపోయిన వ్యక్తికి ఇల్లు మంజూరు చేయడం, బిల్లులు కూడా చేసుకోవడం గత ప్రభుత్వంలో జరిగింది. గత ప్రభుత్వంలో జరిగిన ఇటువంటి పొరపాట్ల వలన పేదవాడు నష్టపోకూడదని జియోట్యాగింగ్ విధానాన్ని రాష్ట్రంలో ఈరోజున ప్రవేశపెట్టారు. 90శాతం జియోట్యాగింగ్ పూర్తయ్యింది, మరో 10శాతం కూడా పూర్తయిన తరువాత ఎవరైతే పేదవారున్నారో, ఎవరైతే అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయి ఉన్నారో వారిపై చర్యలు తీసుకోండని వీరు సూచిస్తున్నారు, అలా చర్యలు తీసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవు. ఇల్లు ఒకరి పేరుతో మంజూరు అయ్యి ఉంటే, వారిపేరు పెట్టి వాళ్ల నాయకులందరూ 10 సంవత్సరాలు... ఇక్కడ విమర్శించాలని కాదు, వాళ్లకు కూడా తెలుసు.

(ఈ సందర్భంలో ప్రతిపక్ష నాయకులు శ్రీ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సభలోకివచ్చి తమ స్థానంలో కూర్చున్నారు. )

జియోట్యాగింగ్ పూర్తయిన తరువాత ఎక్కడా ఇబ్బందులు లేకుండా, అవినీతి అక్రమాలు లేకుండా మీరు అంటున్నట్లు రూ. 1.50వేలతో ఇళ్లని ఏమైతే మాట్లాడుతున్నారో ఆ రూ. 1.50వేల తోనే కాదు, తప్పనిసరిగా ఎక్కడా ఇబ్బందులు లేకుండా పేదవానికి అన్ని హంగులతో గృహాలు నిర్మిస్తామని ఈ సభద్వారా తెలియజేస్తున్నాను. దీనిని అర్థంచేసుకోవాల్సిందిగా గౌరవసభ్యులను కోరుతున్నాను.

శ్రీ జి.బుచ్చయ్యచౌదరి (రాజమండ్రి రూరల్): అధ్యక్షా నేను మంత్రి గారిని తమద్వారా కోరేదేమనగా గత 10సంవత్సరాలలో భారీగా గృహాలు నిర్మిస్తామని నిర్మించారో..

(ఈ దశలో వైఎస్ఆర్‌సీపి సభ్యులు శ్రీ కె.నారాయణస్వామి మరియు కొంతమంది సభ్యులు తమ స్థానం నుండి లేచి సభకు అంతరాయం కలిగించారు.)

మిస్టర్ స్పీకర్: ప్లీజ్.. సిట్‌డౌన్ ... దయచేసి కూర్చోండి.

శ్రీ జి.బుచ్చయ్యచౌదరి(రాజమండ్రి రూరల్)ః నీ కేంటయ్యా బాధ.. ఆరోజు ప్రభుత్వంలో ఉన్నావా? దోచుకున్నావా ? నీకేంటి బాధ ? నీకు బాధ అయితే, నీవు దోచుకోని ఉంటే చెప్పు.

మిస్టర్ స్పీకర్ః ప్లీజ్.. బుచ్చయ్య చౌదరి గారు.. నో క్రాస్ టాకింగ్.. ప్లీజ్ అడ్రస్ ది ఛైర్..

శ్రీ జి.బుచ్చయ్యచౌదరి (రాజమండ్రి రూరల్)ః నేను ప్రశ్న అడుగుతుంటే వాళ్లకేంటి.

మిస్టర్ స్పీకర్ః మీరు మాట్లాడండి..

శ్రీ జి.బుచ్చయ్యచౌదరి(రాజమండ్రి రూరల్)ః గత పది సంవత్సరాలలో జరిగిన ఇళ్ల నిర్మాణాలలో అవకతవకలమీద ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణాలో ప్రభుత్వం విచారణ చేసి లోపాలన్నీ ఎత్తి చూపించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి జియోట్యాగింగే కాదు, నా నియోజకవర్గంలో నిర్మించిన 3,000 ఇళ్లపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేయించాము. మంత్రిగారి దృష్టికి ఈ విషయం తీసుకువస్తున్నాను. ఆ 3,000 ఇళ్లలో 1,200 ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు ఇచ్చారు. దానిపై విచారణ చేయమని మేమూ అడిగాము. ఎందుకంటే, ఒక జియోట్యాగింగ్ తోనే పూర్తి కాదు. లబ్ధిదారుల ఎంపిక దగ్గరనుండి కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలికే వారికి మేడలతోపాటు కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టుకున్న విషయం మీ దృష్టికి వచ్చిందా? ఎవరైతే బాధితులున్నారో, పేదవారున్నారో వారికి అందవలసిన ఇళ్లన్నీ కూడా అందకుండా, డబ్బున్నవారికి, ఉద్యోగాలున్న వారికీ, పొలాలున్న వారికి కట్టబెట్టి దోపిడీ చేసారు. వాటిన్నింటిపై సమగ్ర విచారణచేసి నిజమైన అర్హులకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియజేయవల్సిందిగా గౌరవ మంత్రిగారిని తమద్వారా కోరుతున్నాను.

( ఈ దశలో ప్రతిపక్ష సభ్యులచే సభకు అంతరాయం )

మిస్టర్ స్పీకర్ ః ప్లీజ్.. ప్లీజ్..

శ్రీ కాకాని గోవర్ధన్‌రెడ్డి (సర్వేపల్లి)ః అధ్యక్షా, మేము స్పష్టంగా గృహనిర్మాణ శాఖా మంత్రిగారిని అడిగిందేమంటే గత సంవత్సరం రోజులుగా ఇళ్లు మంజూరయ్యాయా? ఎంత ఖర్చు చేశారు అని అడిగితే దానికి సమాధానం చెప్పలేక అచ్చెన్నాయుడు గారు మాట్లాడటం జరిగింది. అచ్చెన్నాయుడుగారు ఆల్‌రౌండర్ అనుకోండి, అన్నింటిపై మాట్లాడొచ్చు, మాట్లాడుతున్నారు కూడా. సమస్య వచ్చింది కాబట్టి చెబుతున్నాం. వీరు అడిగారు కాబట్టి

చెబుతున్నాం. మీరు ప్రభుత్వం ఏలినప్పుడు, మీ ప్రభుత్వాలు నడిచినప్పుడు నియోజకవర్గానికి 500 నుండి 1000 ఇళ్లు ఇచ్చిన మాటను మర్చిపోకండి.

రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు మంజూరు చేశారు. పొరపాటు ఎక్కడైనా జరిగి ఉంటే విచారించి చర్యలు తీసుకోండి. అంతే తప్ప మీరు నూరు జన్మలెత్తినా, వంద అవతారాలెత్తినా సరే మీరు రాజశేఖరరెడ్డిలాగ మరలా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు ఇచ్చే పరిస్థితి ఉండదన్న విషయం మీకూ, మాకే కాదు, ఈ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అన్న విషయం గుర్తుంచుకోండి. వారు అడిగారు కాబట్టి మాట్లాడాల్సి వచ్చింది, లేకపోతే నేను మాట్లాడి ఉండేవాడిని కాదు. ఐఏవై గురించి మాట్లాడే సందర్భంలో గత ప్రభుత్వాల గురించి మాట్లాడారు కాబట్టి నేను మాట్లాడాల్సి వచ్చింది, లేకపోతే నేను మాట్లాడను. మీరు ఈరోజు చెబుతున్నారు గదా, గడిచిన ఒక సంవత్సరంగా ఒక్క రూపాయి బిల్లు చెల్లించడం లేదు, ఒక గృహం మంజూరు చేయని విషయం వాస్తవమా కాదా అన్న విషయంపై సూటిగా సమాధానం చెప్పాల్సిందిగా కోరుతున్నాను. దానికి మాత్రం సమాధానం చెప్పకుండా మిగతావన్నీ మాట్లాడుతున్నారు. గత సంవత్సరం నుండి ఒక బిల్లు కానీ, ఒక ఇల్లు కానీ మంజూరు కాలేదు. ఇది వాస్తవమా కాదా చెప్పాల్సిన బాధ్యత ఉంది. కాబట్టి దానిమీద మంత్రిగారు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిందిగా తమద్వారా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః మంత్రి సుజాత గారు...

శ్రీమతి పి.సుజాత (చింతలపూడి)ః గత 10సంవత్సరాల కాలంలో అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట్లుగా పేదలకు రావల్సిన పక్కా గృహాలు కానివ్వండి, మరుగుదొడ్లు మంజూరులో గానీ, తల్లీ , పిల్ల కాంగ్రెస్ నాయకులు వారి కార్యకర్తలకు దోచిపెట్టారు.

(ఈ సందర్భంలో వైఎస్ఆర్‌సీపి సభ్యులచే సభకు అంతరాయం)

అట్లాంటి వాళ్లు వీరు. వీరికి అడిగే అర్హత కూడా లేదు. ఈరోజున గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఏదైతే పేదలకు హామీ ఇచ్చారో, వారందరికీ న్యాయం చేసే దిశగా ఎన్నికల ప్రణాళికలో పొందుపరచినవన్నీ కూడా అమలుచేసేందుకు సాయశక్తులా కృషిచేస్తాం, పనులు చేసి తీరుతాం అని ఈ సందర్భంగా తమకు తెలియజేసుకుంటున్నాను. మరుగుదొడ్ల నిర్మాణంలో కూడా కార్యకర్తల పేరు చెప్పి బిల్లులు చేసుకొని దోచుకుతిన్న నాయకులు ఈ తల్లీ , పిల్ల కాంగ్రెస్ వారు. వీరా సార్ నీతి వాఖ్యాలు చెప్పేది? ఆ విషయాల్ని వాళ్ల విజ్ఞతకే వదలివేస్తున్నాం. ఈరోజు ప్రభుత్వం తరపున ఏవైతే హామీ ఇచ్చామో అన్ని హామీలూ నెరవేర్చి తీరతామని తమకు తెలియజేసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ ః జగన్మోహన్‌రెడ్డి గారు..

శ్రీ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి (పులివెందుల)ః అధ్యక్షా, పేదవానికి పక్కా గృహాలు నిర్మాణం అనేది ముఖ్యమైన విషయం. ఈ రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ఒక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మళ్లీ రెండవ బడ్జెట్ కూడా ఈరోజు ప్రవేశపెట్టబోతుంది. ఈ సంవత్సరానికీ బడ్జెట్ ప్రవేశపెట్టారు, 10నెలలు అవుతోంది, ఈ కాలంలో కనీసం ఒక్క కొత్త ఇల్లునైనా మీరు మంజూరు చేశారా అని నేను సూటిగా అడుగుతున్నాను. రెండవదేమనగా, ఒక కొత్త ఇల్లు అయినా ఇవ్వకపోగా చివరకు ఇంతకు మునుపు మంజూరైన ఇళ్లను కూడా రద్దు చేశారు. పనులు మొదలు పెట్టుకొని బేస్‌మెంట్, స్లాబ్ లెవల్ స్థాయికి వచ్చిన ఇళ్లకు కూడా payments pertaining to housing shall be stopped అనిచెప్పి ఏకంగా జీవోనే విడుదల చేశారు.

(ఈ సందర్భంలో శ్రీ వైఎస్.జగన్మోహన్ రెడ్డి తమ చేతిలో ఉన్న జీవో పత్రాన్ని సభాపతి గారి వైపు చూపించారు. )

నేను అడిగేది అంతా ఒకటే. గత సంవత్సర కాలంలో మీరేమి చేశారు? ఒక్క కొత్త ఇల్లునైనా మంజూరు చేశారా అని అడుగుతున్నాను. అది చేయకపోగా 10 సంవత్సరాల రాజశేఖరరెడ్డి ప్రభుత్వ పాలనా, తల్లికాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ అంటూ ఇటువంటి అబాండాలు వేస్తున్నారు.

...

నేను ఒకటే అడుగుతున్నాను. కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ అని అంటున్నారు. అవిశ్వాస తీర్మానంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని పడేసే అవకాశం ఉన్నప్పుడు మీ తెలుగుదేశం కాంగ్రెస్ సపోర్ట్ చేయలేదా అని అడుగుతున్నాను. ఇదే సభలో 294 మంది సభ్యులు, ఇదే సభలో రూ.32,000 కోట్లను కిరణ్ సర్కారు కరెంట్ చార్జీలను బాదుడు బాదితే ఇదే చంద్రబాబునాయుడుగారు విప్ జారీ చేసి మరీ కిరణ్ సర్కారును పడిపోకుండా కాపాడారు. (ప్రతిపక్ష సభ్యులు చప్పట్లు) ఆరోజు అవిశ్వాస తీర్మానంలో కిరణ్ సర్కారుకు వచ్చినవి 146 ఓట్లు. అంటే 148 ఓట్లు రావలసినదానికి 146 ఓట్లే వచ్చాయి. 2 ఓట్లు తగ్గాయి. 2 ఓట్లు తగ్గినా కూడా ఆరోజు కిరణ్ కుమార్‌రెడ్డి సర్కారు నిలబడిందంటే, దానికి కారణం ఈ తెలుగుదేశం పార్టీ. ఈ తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్‌కు సపోర్ట్ చేసింది కాబట్టే ఆనాడు కిరణ్ సర్కారు నిలబడింది.

(అధికార పార్టీ సభ్యులచే అభ్యంతరం)

ఇది ఒక్కటే కాదు అధ్యక్షా, ఆ దివంగత నేత, ప్రియతమ నేత డా. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి గురించి, ఆయన పాలన గురించి మాట్లాడారు. ఆయన పాలనలో ఆ దివంగతనేత ఐదు సంవత్సరాలలో 48 లక్షల ఇళ్లు కట్టి చూపించారు. దేశం మొత్తం 47 లక్షల ఇళ్లు కడితే, ఆ దివంగత నేత డా. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారు రాష్ట్రాన్ని దేశంతో పోల్చి, దేశంలో కన్నా ఎక్కువ

ఇళ్లు రాష్ట్రంలో కట్టి చూపించారు. మీరు హౌసింగ్ గురించి మాట్లాడుతున్నారు. ఇవాళ అడుగుతున్నాను. స్పీకర్ గారికి కూడా ఇది అవసరమే. ఎందుకంటే ఆయన నియోజకవర్గంలో కూడా ఇళ్లు కట్టుకోలేని పరిస్థితిలో ఉన్నారు. దానికి కారణమేమంటే ఈ ప్రభుత్వం ఇళ్లు ఇవ్వడం లేదు కాబట్టి. మీ ఎమ్మెల్యేలందరికీ కూడా ఇది అవసరమే. ప్రజలలోకి ఒకసారి వెళ్లండి. మీరంతా ఒక కొత్త ఇల్లు కట్టించిన పాపాన పోలేదు.

(గౌరవ మంత్రి శ్రీ కె.అచ్చెన్నాయుడుగారు, ప్రతిపక్ష సభ్యులు శ్రీ నారాయణస్వామి మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరారు)

(ప్రతిపక్ష సభ్యులచే అభ్యంతరం)

మిస్టర్ స్పీకర్ః దయచేసి కూర్చోండి. అచ్చెన్నాయుడుగారూ మాట్లాడండి.

శ్రీ కె. అచ్చెన్నాయుడు (టెక్కలి)ః అధ్యక్షా, ప్రతిపక్షనాయకుడుగారు గత శాసనసభలో జరిగిన పరిణామాలన్నిటినీ సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలు అర్థం చేసుకున్నారు. ఎవరు కరెక్టు నిర్ణయం తీసుకున్నారో మొన్న ఎన్నికలలో మొత్తం రుజువు అయింది. దాని జోలికి మనం పోవలస్సిన అవసరం లేదు. నేను ప్రతిపక్షనాయకుడిని అడుగుతున్నాను. రాజశేఖర్‌రెడ్డిగారు 10 సంవత్సరాలలో... గత 5 సంవత్సరాలలో గాని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం గానీ, 'శాచురేషన్' అన్న ఒకే ఒక పదం పెట్టి ఈ కార్యక్రమాన్ని తీసుకుంది. ఈ శాచురేషన్ అన్న పదం పెట్టి, గత 5 సంవత్సరాల్లో ఈ రాష్ట్రంలో ఒక్క పూరి గుడిసె కూడా ఉండకూడదని ఇళ్లు అన్నీ మంజూరు చేశారు. అది వాస్తవం. చెయ్యలేదని చెప్పటం లేదు. కానీ, ఎంత దారుణం అంటే.. ప్రతిపక్ష నాయకుడిగా 13 జిల్లాలలో ఏదైనా ఒక గ్రామాన్ని మీరు సెలెక్ట్ చేయండి, నేను కాదు. ఆ గ్రామానికి మీరూ వెళ్దాం, మేమూ వెళ్దాం ఎన్ని ఇళ్లు మంజూరు అయ్యాయి, ఎన్ని ఇళ్లు కట్టారు, ఎన్ని ఇళ్లకి బిల్లులు తీసుకున్నారనేది ఒకసారి వాస్తవాలను మనం తెలుసుకుందాం. అవకాశం వచ్చింది కదా అని ఎలా బడితే అలా మాట్లాడటం కాదు. 47 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే 13 జిల్లాలలో ఒక్క పూరి గుడిసె కూడా ఉండకూడదు. ఈరోజు ఏ గ్రామానికి వెళ్లినా సరే, ఇళ్లు మంజూరు అయ్యాయి, పూరి గుడిసెలు అలానే ఉన్నాయి. ఫైర్ యాక్సిడెంట్లు జరుగుతున్నాయని ఒక సభ్యుడు అడుగుతున్నారు. శాచురేషన్ జరిగి 47 లక్షల ఇళ్లు కడితే ఫైర్ యాక్సిడెంట్లు ఎలా జరుగుతాయి? పూరిళ్లు ఉంటేనే ఫైర్ యాక్సిడెంట్లు జరుగుతాయి. మొత్తం దోపిడీ జరిగింది. ఇది అందరూ ఒప్పుకోవాలి. ఈ దోపిడీని మేం తొమ్మిది నెలల నుంచి.. ఈరోజు ఇళ్లు మంజూరు చేయడంలేదని గగ్గోలు పెడుతున్నారు. ఇల్లు అయితే మంజూరు చేస్తాం. ఎవరికి మంజూరు చేయాలి? జగన్మోహన్‌రెడ్డిగారికి ఒక ఇల్లు ఇద్దామంటే గతంలో మూడుసార్లు ఇల్లు మంజూరు అయినట్టుగా రికార్డులలో ఉంది. ఈరోజు ఒక వ్యక్తికి ఇల్లు మంజూరు చేద్దామంటే, ఒక పేదవాడి పేరును తీసుకొంటే ఆ పేదవాడి పేరుతో

మూడుసార్లు ఇల్లు మంజూరయినట్టు రికార్డ్‌లో ఉంది. మళ్లీ ఎలా మంజూరు చేయాలని అడుగుతున్నాం. అయినా సరే, గతంలో జరిగిన అవినీతి వల్ల, గతంలో జరిగిన పొరపాట్లు వలన పేదవాడు నష్టపోకూడదు. పేదవాడు చాలా బాధపడుతున్నాడు, దానికి మేం కూడా అంగీకరించాం. నిజమైన పేదవాడు ఇల్లు లేకుండా వర్షంలో తడుస్తున్నాడు, ఎండలో ఎండుతున్నాడు. పేదవాడికి ఇల్లు మంజూరు చేయాలంటే గతంలో మూడుసార్లు బిల్లు అయినట్టు రికార్డుల్లో ఉంది. దాని వలన పేదవాడికి ఇల్లును మంజూరుచేయలేని పరిస్థితి. దానిమీద ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకొంటుంది. ఈ తొమ్మిది నెలలలో అన్ని సర్వేలు చేశాం. ఎవరెవరు మోసాలు చేశారు, ఎవరెవరు ఇళ్లు కట్టకుండా బిల్లులు తీసుకున్నారనేది వాస్తవాలు తీసుకున్నాం. వారిమీద యాక్షన్ తీసుకుంటూ ఈ సంవత్సరం తప్పనిసరిగా పేదరికంలో ఉన్న పేదవారికి ఇల్లు కట్టటానికి ఈ ప్రభుత్వం నిశ్చయంతో ఉందని తెలియజేస్తూ, ఇప్పటికైనా సరే మీకు ఛాలెంజ్ చేస్తున్నాను. మీకు నచ్చిన గ్రామాన్ని సెలెక్ట్ చేయండి. అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమాన్ని చేద్దామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇంకో విషయం ఏమంటే, సరే ఏమీ జరగలేదూ అని అనుకుందాం, ప్రతిపక్ష సభ్యులు ఇన్ని మాటలు మాట్లాడుతున్నారు. ఈరోజు మీరు ఒక హౌస్ కమిటీని కోరండి. దానికి మేం హౌస్ కమిటీ వేస్తాం. అందరం కలిసి అన్ని గ్రామాలూ తిరుగుదాం. గతంలో జరిగిన పొరపాట్లు అన్నిటినీ బయటకు తీద్దాం. తప్పనిసరిగా, హౌస్ కమిటీకి మీరు రెడీగా ఉంటే చెప్పండి. హౌస్ కమిటీ వేసి, మొత్తం వెరిఫై చేద్దామని ఈ సందర్భంగా ప్రతిపక్షానికి తెలియజేస్తున్నాను.

(ప్రతిపక్ష సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూగారు, శ్రీమతి ఆర్.కె.రోజాగారు మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్: మీ ఇద్దరిలో ఎవరు మాట్లాడతారు? నెహ్రూగారు మీరు కూర్చోండి, లేదా రోజాగారిని కూర్చోమనండి. రోజాగారు మాట్లాడండి.

శ్రీమతి ఆర్.కె.రోజ (నగరి): అధ్యక్షా, (గృహ నిర్మాణ శాఖ మంత్రి డా. కిమిడి మృణాళినిని ఉద్దేశించి) మంత్రి పదవేమో ఒక మహిళకు ఇచ్చారు. (గౌరవ మంత్రి శ్రీ అచ్చెన్నాయుడుగారిని ఉద్దేశించి) ఆ మహిళను మేం ప్రశ్న అడిగితే ఇంకో మంత్రి అడ్డదిడ్డంగా లేస్తున్నారు. ఈయన ఒక్కరే తెలివైనవారు అన్నట్లు, అసెంబ్లీలో మిగతావారెవరికీ బుర్ర లేదన్నట్లు ప్రతీ ఇష్యూకి ఆయనే లేస్తున్నారు. అధ్యక్షా, పేదవాడికి ఇల్లు అనేది చాలా ముఖ్యం. ఈరోజు పేదవాడికి ఇల్లు లేదని...

MR. SPEAKER: Please wait. అమ్మా రోజాగారూ బాధ్యత లేని కామెంట్లు మీరు చేయవద్దు. మీరూ మాట్లాడుతున్నారు, వాళ్లూ మాట్లాడుతున్నారు. అందరికీ మైకు ఇస్తున్నాను, అందరూ మాట్లాడుతున్నారు. మీరు అలా మాట్లాడటం కరెక్టు కాదు.

శ్రీమతి ఆర్.కె.రోజ (నగరి)ః అధ్యక్షా, నేను కోరుతున్నది ఒకటే. రూ.1,50,000 లు పెట్టి ఇల్లు కడతామని అధికారపక్షం మేనిఫెస్టోలో పెట్టారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతుంది. అధికారం మీ దగ్గర ఉంది. నేను కోరుకొనేది ఒకటే. ఈరోజు అధికారం మీ చేతిలో ఉంది. ఒకవేళ అవకతవకలు జరిగాయని మీకు ఏదైనా డౌటు ఉంటే ఎంక్వయిరీ వేసుకోండి. ఆ కుంటిసాకులు చూపించి అర్హులైనవారికి ఇళ్లు మంజూరు చేయనీయకుండా, ఆల్‌రెడీ గ్రౌండ్‌లెవెల్, బేస్ లెవెల్, రూఫ్ లెవెల్‌లో ఉన్నవాటికి బిల్లులు ఇవ్వకుండా పేదవారి జీవితాలతో చెలగాటం ఆడవద్దని కూడా ఈ మంత్రిగారికి చెబుతున్నాను. అలాగే గ్రామాలలోకి పోలీసులు లేకుండా కారు అద్దాలు దించి వెళితే, అధికారపక్షం వాళ్లను, డ్వాక్రా మహిళలు లోన్లు అడుగుతున్నారా లేదా, పేదవాళ్లు ఇళ్లు అడుగుతున్నారా లేదా? నిరుద్యోగులు ఉద్యోగాలు అడుగుతున్నారా లేదా తెలిసే పరిస్థితి, అలాగే రైతుల రుణ మాఫీ ఏమేరకు జరుగుతున్నది కూడా తెలిసే పరిస్థితి ఉంటుంది. అంతేగానీ నోరుంది కదా అని, మైకులు ఇస్తున్నారు కదా అని, ప్రతీదానికి తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ అని అంటున్నారు.

మిస్టర్ స్పీకర్ః మీకు కూడా మైకులు ఇస్తున్నాము కదా..

శ్రీమతి ఆర్.కె.రోజ (నగరి)ః తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ అని మమ్మల్ని అనేటప్పుడు అమ్మమ్మ కాంగ్రెస్ చంద్రబాబునాయుడు కాంగ్రెస్ నుంచే వచ్చారు. మా అందరికీ సీనియర్. మమ్మల్ని ఒక వేలి పెట్టి చూపించినప్పుడు నాలుగు వేళ్లు వాళ్లని చూపిస్తున్నాయన్న సంగతిని కూడా వాళ్లు గుర్తుపెట్టుకోవాలి. ఈరోజు గృహ నిర్మాణంలో అన్యాయం జరిగింది అని అంటున్నారు. (మైకు కట్ చేయబడింది)

మిస్టర్ స్పీకర్ః విష్ణుకుమార్ రాజు.

శ్రీ పి. విష్ణు కుమార్ రాజు (విశాఖపట్నం నార్త్)ః అధ్యక్షా, ఇప్పుడు జియో ట్యాగింగ్ అనేది చేస్తున్నారు. 33 లక్షల ఇళ్లకు జియో ట్యాగింగ్ అయ్యిందని నాకు తెలిసింది. మొత్తం 43 లక్షల ఇళ్లు పూర్తి అయినప్పటికీ కూడా ఇంకా 4,23,000 ఇళ్లు ఇంకా ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. కానీ బిల్లులు ఇవ్వటం లేదు. చాలా ఇబ్బంది పడుతున్నారు. అందరూ వచ్చి రిప్రజెంటేషన్స్ కూడా ఇస్తున్నారు. దయచేసి ఒక హౌస్ కమిటీ వేయండి. హౌస్ కమిటీ వేసి ఇబ్బందులు లేకుండా మీరు చేయండి. హౌస్ కమిటీ వేస్తేనే గానీ ఈ ఇష్యూ సార్ట్ అవుట్ అవ్వదు.

మిస్టర్ స్పీకర్ః జగన్మోహన్ రెడ్డిగారు.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల)ః అధ్యక్షా, మీరు ఒక్క ఇల్లూ ఇవ్వలేదు. ఒక్క ఇల్లూ ఇవ్వకపోగా, కట్టినవాళ్లకు ఇంతవరకు బిల్లులు కూడా రాలేదు. జియో ట్యాగింగ్ అనీ, ఇంకొకటీ ఇంకొకటీ అనీ మళ్లీ సంవత్సర కాలం గడిచిపోయింది.

...

గత కాంగ్రెసు పార్టీకి మేము మద్దతు తెలపడం జరగ లేదు. గత కాంగ్రెసు పార్టీకి మద్దతు తెలిపింది మీరు. కిరణ్ సర్కారుకు మద్దతు ఇచ్చింది మీరు. మేము దివంగత నేత ప్రియతమ నాయకుడు రాజశేఖర రెడ్డిగారు వారసులమని గొప్పగా చెప్పుకుంటాం గానీ, కాంగ్రెసు పార్టీకి కాదు. ఇవాళ మీరు ఇప్పటికి కూడా ప్రతి విషయంలోనూ కూడా 'ఊ' అంటే ఆయన (శ్రీ కె. అచ్చెన్నాయుడు గారినుద్దేశించి) concerned Minister కాకపోయినా, ఎత్తుగా, లావుగా ఉన్నాడని గట్టిగా మాట్లాడతాడు. మానవత్వం లేదు కానీ అచ్చెన్నాయుడు గారికి మైకు ఇస్తారు. (బెల్) మనిషి పెరుగుతున్నాడు కానీ ఏమి లాభం? మనిషి ఎదిగే కొద్ది ఒదగాలి. మానవత్వం కూడా మనిషి నుంచి బయటకు రావాలి కానీ అవేమి లేవు. (ప్రతి పక్ష సభ్యులు చప్పట్లు చరిచారు)

MR. SPEAKER: OK. Please conclude.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు మంత్రిగారికి మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరారు)

శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి (పులివెందుల)ః అధ్యక్షా, అటువంటి వ్యక్తులు దారుణమైన మాటలు మాట్లాడే ముందు మానవత్వం గురించి తెలుసుకోండి, ఆ తరువాత చేయాల్సిన పనులు తెలుసుకోండి. We are staging a protest. We are staging a walkout for this question.

(వైఎస్సార్ పార్టీ సభ్యులు వాక్ అవుట్ చేశారు)

మిస్టర్ స్పీకర్ః అయ్యన్న పాత్రుడు గారూ.

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం)ః అధ్యక్షా, ఈరోజు హౌసింగ్ మీద ఇంత చర్చ జరిగిన తరువాత, గతంలో జరిగిన విషయాలను కూడా చర్చించవలసిన అవసరముంది. ప్రభుత్వం ముందుకు వచ్చి ఈరోజు హౌస్ కమిటీ వేయడానికి సిద్ధపడినా సరే వారు ఎందుకు వాకౌట్ చేశారు? కిరణ్‌కుమార్‌రెడ్డి గారి హయాంలో హౌసింగ్ మినిస్టర్ అంటే ఎవరో కూడా తెలియని వ్యక్తి మన జగన్మోహన్‌రెడ్డి గారు. అటువంటి వ్యక్తి ఇవాళ వాకౌట్ చేస్తున్నారంటే, శ్రీమతి రోజా గారు మాట్లాడతారు. కారు అద్దాలను పైకెత్తి ఊర్లోకి వెళ్తామని అంటున్నారు. ఆవిడ వెళ్తారు, మేకప్ చెరిగిపోతుందని ఆవిడ అద్దాలను పైకెత్తి ఊర్లోకి వెళ్తారు. ప్రజలకు మామీద, మా నాయకుడి మీద నమ్మకం ఉంది. మేము చేస్తామనే నమ్మకముంది కాబట్టి ఆ

పరిస్థితి మాకు లేదు. ఆమె మేకప్ చెరిగిపోతుందని కారు అద్దాలను పైకెత్తి ఊర్లోకి వెళుతూ అందరినీ అనడం పద్ధతి కాదు. ఈ రోజు మేము చాలా క్లియర్‌గా అడిగాం, కానీ జగన్మోహన్ రెడ్డి గారు అందుకు సమాధానం చెప్పకుండా వాకౌట్ చేయడంలో అర్థమేమిటి? మీకు హౌస్ కమిటీ కావాలా? వద్దా? అది క్లియర్‌గా చెప్పండి.

శ్రీ యనమల రామకృష్ణుడు (శాసన సభ వ్యవహారాలు మరియు ఆర్థిక శాఖా మంత్రి): అధ్యక్షా, గౌరవ సభ్యులు గానీ, మంత్రులు గానీ వివరాలన్నీ చెప్పారు. (వాకౌట్ చేసిన ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి) వాళ్ళు లేరు గానీ, వాళ్ళు చెప్పాల్సిన అవసరముంటుంది. మీరడిగితే మేము హౌస్ కమిటీ వేస్తామంటే, హౌస్ కమిటీ అనేసరికి ఎందుకు పారిపోయాడో ప్రతిపక్ష నాయకుడు చెప్పాలి. (అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు.) ఆయన బండారమంతా బయటపడుతుందేమోనని హౌస్ కమిటీ అనగానే పారిపోయాడు. ఇప్పుడు ఆ పార్టీలో ఉన్నవాళ్ళు దాదాపు 99 శాతం కాంగ్రెస్ వాళ్ళే. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అవకతవకలపై ఇప్పుడు ఎంక్వైరీ జరుగుతుంది. ఎంక్వైరీ తరువాత జియోట్యాగింగ్ జరుగుతుంది. జియోట్యాగింగ్ జరిగిన తరువాత రియల్ బెనిఫిషరీలకు మాత్రమే ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నాం. రియల్ బెనిఫిషరీలకు ఇస్తామే గానీ, జగన్మోహన్‌రెడ్డిగారు బెనిఫిషరీ కాదు. ఆయన బ్రహ్మాండమైన ఇల్లు కట్టుకున్నారు. ఈ హౌసింగ్ అనేది పేదవాడికి ఇస్తారు. పేదవాళ్ళ హౌసింగ్‌ను కూడా దోచుకునేటువంటి విధానాన్ని వీళ్ళు ఆ రోజు అవలంబించారని మేము చెప్పడం కాదు, అప్పటి హౌసింగ్ మినిస్టర్ గారే చాలా స్పష్టంగా చెప్పారు. కొంతమంది అధికారులను సస్పెండ్ చేశారు. అందుచేత, దాని ఆధారంగా ఆనాడు ఉన్నటువంటి నాయకులందరూ కూడా, ఇప్పుడు కొంతమంది ఈ సభలో కూడా ఉండవచ్చు. వీళ్ళంతా తినేశారు అనే ఉద్దేశంతో, తిన్న వాళ్ళు ఏదైతే తినేశారో, దొంగతనం చేశారో, ఆ డబ్బులన్నింటినీ కూడా వారి నుండి కక్కించడమే కాకుండా, నిజమైన లబ్దిదారుకు మాత్రమే ఈ హౌసింగ్ అందాలనే ఉద్దేశంతోనే ఈనాడు ఈ ఎంక్వైరీకి ప్రభుత్వం అంగీకరించడం జరిగింది. ఈ విధంగా జరుగుతుందని చెప్తుంటే, ఏదో గొడవ చేయాలని చేశారు. హౌస్ కమిటీ అనేసరికి పారిపోయారు. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో హౌసింగ్ మినిస్టర్ ఎవరో ప్రతిపక్షనాయకుడి గారికి తెలియదు. అదేవిధంగా రాజశేఖర రెడ్డి గారి హయాములో హౌసింగ్ మినిస్టర్ ఎవరో కూడా ఆయనకు తెలియనే తెలియదు. ఈ ప్రతిపక్ష నాయకుడు రాజశేఖర రెడ్డి గారి హయాంలో బెంగళూరు నుండి ఆపరేట్ చేసేవాడు. అప్పుడు ఆయన ఇక్కడ లేరు కాబట్టి, ఆయనకు ఈ విషయం తెలియదు. తెలియదు కాబట్టే ఆయన మాట్లాడుతున్నాడు. అందుచేత, మేము హౌస్ కమిటీ వేస్తామంటే, ఎందుకు ఒప్పుకోలేదు? వారు ఎందుకు సభనుంచి పారిపోవడం జరిగింది? అంటే దానిలోనే వాళ్ళ దొంగతనమంతా ఉంది. అధ్యక్షా, ఆయన వచ్చి సమాధానం చెప్తారో, లేదో తెలియలేదు గానీ, ఇప్పుడైతే సభలో లేరు. అయినప్పటికీ కూడా.. The Government have come forward to constitute a House Committee, particularly, on this issue. We want House Committee to

submit its report as early as possible. ఎందుచేతంటే, ఈ సంవత్సరం నుండి తెలుగు దేశం పార్టీ స్కీమ్‌ను మొదలు పెట్టబోతున్నాము.

శ్రీ రావెల కిశోర్ బాబు (ప్రత్తిపాడు)ః అధ్యక్షా, ఇదంతా చూస్తుంటే ఇవాళ రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని సమస్యల ఊబిలోనుండి బయట పడవేసి, కష్టాలను, నష్టాలను సవాళ్ళుగా ఎదుర్కొని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా, నవ్యాంధ్రప్రదేశ్‌గా ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందినటువంటి ఒక బంగారు రాష్ట్రంగా నిర్మించడానికి మా నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు అహర్నిశలూ కృషి చేస్తుంటే...

మిస్టర్ స్పీకర్ః ప్లీజ్ కన్‌ఫైన్ టు హౌసింగ్.

శ్రీ రావెల కిశోర్ బాబు (ప్రత్తిపాడు)ః అధ్యక్షా, వారు వాకౌట్ చేయడం గానీ, వారి ప్రవర్తన గానీ, వారు మాట్లాడే విధానం గానీ, సభ సజావుగా జరగకుండా వారు సృష్టించేటటువంటి గందరగోళ పరిస్థితులు గానీ, ఈ రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకోవడానికి చేసే కుట్రలో ఒక భాగంగా నేను ఈ సభ ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నాను. ఇది అభివృద్ధిని అడ్డుకునే కుట్ర. వైఎస్సార్ పార్టీ అభివృద్ధిని అడ్డుకునే శక్తి. ప్రగతిని అడ్డుకునే శక్తి, సంక్షేమాన్ని అడ్డుకునే శక్తి. ప్రజల యొక్క ధనాన్ని, మానాన్ని, ప్రాణాల్ని దోచుకుని, పందికొక్కులలాగా బలిసి, ఇవాళ ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడానికి చూస్తున్నారు. ఇప్పటికే ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ప్రజల సంపదలను దోచుకున్నారు. పదహారు లక్షల ఎకరాల భూమిని రాజశేఖర రెడ్డి వాళ్ళ అనుయాయులకు, బినామీదారులకు, మిత్రులకు ఎస్.ఈ.జెడ్.ల పేరుపై దోచిపెట్టి, పేదవాడికి సెంటు భూమి కూడా లేకుండా చేసినటువంటి ఘనత రాజశేఖర రెడ్డి గారిది. ఆయన గురించి ఇవాళ హౌస్‌లో మాట్లాడుతున్నారంటే, ఇది కుట్రలో ఒక భాగం. ఈ అభివృద్ధిని అడ్డుకునే అరాచక శక్తులు గానీ, ప్రగతిని, అభివృద్ధిని, సంక్షేమాన్ని అడ్డుకునేటటువంటి శక్తులు గానీ, ఈ విధంగా అడ్డంకులు సృష్టిస్తే కబడ్దార్ అంటూ గ్రామాలలో తిరగనీయమని చెప్పే రోజులు వస్తున్నాయి. (బెల్) ఇప్పటికైనా ఈ రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి ముఖ్యమంత్రిగారు చేస్తున్న కృషికి, ఆయన పడుతున్న కష్టానికి సహకరించకపోయినచో చరిత్ర హీనులుగా మిగలకుండా, చరిత్రలో వాళ్లు కూడా కొంత క్రెడిట్‌ను తీసుకోవడానికి ప్రయత్నం చెయ్యాలని మనవిచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కే.ఈ.కృష్ణమూర్తి (పత్తికొండ)ః అధ్యక్షా, ఈ రోజు వైఎస్సార్‌సీపీ వాళ్లు వాకౌట్ చేసి తప్పించుకున్నారు. కానీ రానున్న రోజులలో ఉపాధి హామీ కల్పనలో కూడా ఇలాగే వాకౌట్ చేస్తారు. అదేవిధంగా ఇవన్నీ కూడా వరుస పెట్టి హౌస్ కమిటీ వేస్తే వాళ్లు ఎప్పుడు కూడా హౌస్ కమిటీలో కూర్చోరు. నేను ఉదాహరణగా చెప్తున్నాను. 200 ఇళ్లు ఉన్న ఊరిలో 2,000 ఇళ్లు

శాంక్షన్ చేశారు. కానీ ఎక్కడ, ఎవరికి కడుతున్నారో తెలియదు. నేను ఎమ్ఎల్ఏగా ఉన్నప్పుడు నేనొక ఊరికి వెళ్ళాను. అక్కడ పూరి గుడిసెలో ఉండే వ్యక్తి ఇప్పుడొక బంగ్లా కట్టుకున్నాడు. నేను ఆశ్చర్యపోయాను. ఇటువంటి సన్నివేశాలు చాలా జరుగుతున్నాయి. హౌస్ కమిటీ కాకుండా ఉపాధి హామీ పనులు, పెన్షన్స్ అనర్హులకు ఇచ్చారు. పెళ్లి కాని పిల్లలకు కూడా పెన్షన్స్ ఇచ్చారు. ఇవన్నీ అసలు కాంగ్రెసు గవర్నమెంట్‌లో ఎట్లా జరిగిందో, ఏవిధంగా జరిగిందో ఆయనకు తెలియదు. ఇంతకు ముందు శాసనసభా వ్యవహారాలు, ఆర్థిక శాఖ మంత్రిగారు చెప్పినట్లు ఆయన బెంగళూరు నుంచి ఆపరేట్ చేశారు కాబట్టి ఇక్కడ జరిగిన అన్యాయాలు అన్నీ ఆయనకు తెలిసినట్లు లేదు. ప్రోటోకాల్ పాటించడం కూడా నేర్చుకోవాలి. ఎప్పుడు చూసినా స్పీకరు గారిని పాయింట్ ఔట్ చేస్తున్నారు. స్పీకరు గారికి కూడా ఇళ్లు లేవు. ఎవరికి ఇళ్లు ఇవ్వాలి, ఎవరికి ఇవ్వకూడదని మాకు తెలియదా?

...

ప్రతిపక్షం వారిని నియంత్రించడానికి ఒక పద్ధతిని అవలంభించమని, వారికి ప్రోటోకాల్ పాటించమని చెప్పండి అధ్యక్షా. ప్రతిపక్ష నాయకుడు సభలో లేచి మాట్లాడుతుంటే సభ్యులు శ్రీమతి రోజా గారు మా నాయకుడు కూర్చొని మాట్లాడతారు అంటే ప్రతిపక్ష నాయకుడు కూర్చొని మాట్లాడతారు. ఇది ప్రోటోకాలా? నాకు అర్థం కావడం లేదు. ప్రతిపక్ష పార్టీలో ఎవరిని ఎవరు నియంత్రిస్తున్నారో తెలియటం లేదు.

శ్రీ పల్లె రఘునాథ్ రెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో గృహనిర్మాణంలో కనీవిని ఎరుగని రీతిలో భారీ అక్రమాలు, అన్యాయాలు జరిగాయి. ఇండ్లు కట్టకపోయినా బిల్లుల చెల్లింపులు జరిగాయి. ఒకే వ్యక్తి ఐదు బిల్లులు తీసుకున్నారు. గౌరవ మంత్రి గారు చెప్పినట్లు, ఈరోజు ఏ పేదవారి ఇండ్లకు పోయిన వారి పేరుపై మూడు సార్లు బిల్లులు మంజూరు అయ్యాయి. లక్షల, కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. రాష్ట్ర విభజన తరువాత తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రజల జీవితాలు బాగుపడతాయని, ఉద్యోగస్తులకు జీతాలు వస్తాయని, రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో, విశ్వాసంతో ప్రజలు ముఖ్యమంత్రిగా పట్టం కట్టారు. ప్రజల రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతోనే గౌరవ ముఖ్యమంత్రి గారు ఎన్నికలలో ఏవైతే హామీ ఇచ్చారో వాటిని తూ.చ.తప్పకుండా అమలు చేయాలనే ఉద్దేశంతో ఒకటొకటిగా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. వాటిలో భాగంగానే ఈ అవినీతి, అక్రమార్జనపై జియోట్యాగింగ్ విధానం అమలుపరచి, వాటిని సరిచేసి, సరికొత్త విధానంలో ముఖ్యమంత్రి గారు ముందుకు వెళుతున్నారు.

వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు మహానేత, అలాంటి పరిపాలన రాష్ట్రానికి రావాలని ప్రతిపక్ష నేత ఎప్పుడూ చెబుతుంటారు. వారి పరిపాలన ఒకసారి గమనిస్తే ప్రజలు భయపడుతున్నారు. వారి పరిపాలనలో అక్రమాలు, అరాచకాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు, దోపిడీలు జరిగాయి.

దాదాపు 120 మంది తెలుగుదేశం నాయకులను, కార్యకర్తలను బలిగొన్నారు. ఆనాడు రాక్షసరాజ్యం, దుర్మార్గపు పరిపాలన జరిగింది. అలాంటి పరిపాలన ప్రజలు కోరుకోలేదు. కనుక ప్రతిపక్ష నాయకుడికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. అదేవిధంగా ఒక అవినీతిపరుడు, అసమర్థుడికి అధికారమిస్తే ఈ రాష్ట్రం ఛిన్నాభిన్నమవుతుందని, కుక్కలు చించిన విస్తరిగా మారుతుందని, వ్యవస్థ అస్తవ్యస్తమవుతుందని ప్రతిపక్ష నాయకుడికి ప్రజలు అధికారమివ్వలేదు. ఆర్థిక శాఖా మంత్రి గారు చెప్పినట్లు, ఒక హౌసింగ్ కమిటీ వేస్తాం. ఈ నిజానిజాలను బట్టబయలు చేస్తాం. వారికి (ప్రతిపక్షసభ్యులనుద్దేశించి) చిత్తశుద్ధి, దమ్ముంటే నిరూపించుకోవాలి. వారు సభలో ఎదుర్కొనలేక, సభలో అడ్డదిడ్డంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదు. సభలో ప్రోటోకాల్ పాటించకపోవడం సరైన పద్ధతి కాదు.

రాష్ట్రంలో అనేక సమస్యలున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో కరవు, రైతుల సమస్యలు, మహిళల సమస్యలున్నాయి. ఏ విషయాలపై అయినా సభలో చర్చించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. చర్చలను ఏ విధంగా తప్పించుకోవాలని ప్రతిపక్షం సిద్ధమయింది. ప్రతిపక్ష నాయకుడు సభలో ఏదో విధంగా అడ్డదిడ్డంగా మాట్లాడి బయటకు వెళుతున్నారు. వాటిని ప్రజలు గమనిస్తున్నారు. ప్రజలు ఇప్పటికే తగిన గుణపాఠం చెప్పారు, దానికి తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది.

శ్రీ వనమాడి వెంకటేశ్వర రావు (కాకినాడ సిటి): అధ్యక్షా, ఈ శాసనసభా సమావేశాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. ప్రతిపక్ష హోదాలో ఉండి, ప్రభుత్వానికి సలహాలు ఇచ్చి, రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఉండాలి. గత శాసనసభలో కూడా నేను ఒకసారి పనిచేశాను, ఇది రెండవసారి. ఈ శాసనసభా సమావేశాలలో ప్రతిపక్ష సభ్యుల తీరు చూస్తుంటే ఈ సమావేశాలు ఇన్ని రోజులు నిర్వహించుకోవాల్సిన అవసరం లేదనిపిస్తుంది. ఎందుకంటే వారు (ప్రతిపక్షసభ్యులనుద్దేశించి) అమూల్యమైన సభా సమయాన్ని వృథా చేస్తున్నారు.

గతంలో శాసనసభ సమావేశాలు ఎక్కువ రోజులు పెట్టడానికి కారణం ఆనాడు కమ్యూనికేషన్ అంతగా అభివృద్ధి చెందలేదు. ముఖ్యమంత్రికి, మంత్రులకు, శాసనసభ్యులకు కమ్యూనికేషన్ ఉండేది కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు ఏ పని చేస్తున్నారో నిమిష నిమిషానికి ప్రజలకు తెలుస్తుంది. అదే విధంగా ప్రభుత్వం ఏం పని చేస్తుందో ప్రతి నిమిషం ప్రజలకు తెలుస్తుంది. ఏయే నియోజకవర్గాలలో ఏయే సమస్యలున్నాయో అనుభవమున్న ముఖ్యమంత్రి గారికి తెలుస్తుంది. 175 శాసనసభ్యుల నియోజకవర్గాలలో ఎలాంటి అభివృద్ధి చేయాలన్నది మా ప్రభుత్వం వద్ద నివేదిక ఉంది. ప్రతిపక్షం వారు చెప్పకపోయినా ప్రభుత్వం అభివృద్ధి చేసే అవకాశాలున్నాయి. ఈ సభా సమయాన్ని ప్రతిపక్షం వారు చాలా వృథా చేస్తున్నారు. ఈ సమావేశాలను ఇన్ని రోజులు నిర్వహించుకోవలసిన అవసరం లేదు. ఈ సమయాన్ని ప్రజల కోసం వినియోగించాలని తెలియజేస్తున్నాను.

సభాసమయాన్ని వృథా చేయవద్దని, అలా చేస్తే రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుందని ప్రతిపక్ష సభ్యులకు మీ ద్వారా మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ : చివరగా శివాజీ గారు.

శ్రీ గౌతు శ్యాంసుందర్ శివాజి (పలాస): అధ్యక్షా, నేను డీటేల్డ్ సబ్జెక్ట్‌లోకి వెళ్ళదలచుకోలేదు. శాసనసభా గౌరవం మరియు సభాపతి గౌరవం గురించి నేను ప్రస్తావించదలిచాను. వారు (ప్రతిపక్షసభ్యులనుద్దేశించి) సభాపతిని పాయింట్‌ఔట్ చేసినప్పుడల్లా సుమోటోగా ఒక తీవ్రమైన చర్య తీసుకోవాలని నేను భావిస్తున్నాను. ఉదాహరణకు కోర్టులో జడ్జి ఇచ్చిన తీర్పును అమలు చేయకపోతే కంటెమ్ట్ ఆఫ్ కోర్ట్ ఎలా ఉంటుందో అలాగే సభలో సభాపతి ఒక నిర్ణయాన్ని ప్రకటించిన తరువాత సభాపతిని వారు (ప్రతిపక్షసభ్యులనుద్దేశించి) నిందించడమో, దూషించడమో చేస్తే దానికి వారిపై చర్య తీసుకునే విధంగా, అవసరమైతే రూల్స్ మార్పు చేసి చర్య చేపట్టవలసిందిగా సూచిస్తున్నాను.

(ఈ సందర్భంగా అధికారపక్ష సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారు తను మాట్లాడడానికి అవకాశమివ్వాలని సభాపతిని కోరసాగారు. అందుకు గౌరవ సభాపతి గారు అవకాశమివ్వలేదు)

మిస్టర్ స్పీకర్ : బుచ్చయ్య చౌదరి గారు దయచేసి కూర్చోండి, ఈ విషయంపై ఇప్పటికే చాలా సమయం ప్రసంగించారు. Please be seated. Please co-operate చివరగా గృహ నిర్మాణ శాఖ మంత్రిగారు ఏమైనా మాట్లాడాలనుకుంటే మాట్లాడండి.

శ్రీమతి కిమిడి మృణాళిని (చీపురుపల్లి): అధ్యక్షా, గత పది సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఒకసారి గమనిస్తే, గృహనిర్మాణ శాఖ వారు 10,98,033 ఇళ్లు మంజూరు చేశారు. 2004-05వ సంవత్సరంలో 1,92,000 ఇళ్లు, 2005-06వ సంవత్సరంలో 2,76,000 ఇళ్లు, 2006-07వ సంవత్సరంలో 12,38,000 ఇళ్లు, 2007-08వ సంవత్సరంలో 15,78,981 ఇళ్లు, 2008-09వ సంవత్సరంలో 19,63,108 ఇళ్లు మంజూరు చేశారు. అంటే 2006-07, 2007-08, 2008-09 సంవత్సరాలలో 49,00,094 ఇళ్లను ఎన్నికల ముందు మంజూరు చేయడం జరిగింది. మిగతా ఐదు సంవత్సరాలకు రెండు లక్షల చొప్పున ఇళ్లు మంజూరు చేయడం జరిగింది. ఈ రెండున్నర సంవత్సరాలలో అవినీతి, అక్రమాలన్నీ కూడా జరిగాయి. రెండున్నర సంవత్సరాల కాలంలో 49 లక్షల ఇళ్లు కట్టడం అనేది చిన్న పని కాదు. గృహనిర్మాణ శాఖలో ఉన్న కార్యక్రమాలు, ఉద్యోగులు, వారి సమర్థతను చూస్తే సంవత్సరానికి లక్ష ఇళ్లు మాత్రమే కట్టగలుగుతారు. ఆ విధంగా చూసుకుంటే రెండున్నర సంవత్సరాల కాలంలో రెండున్నర లేదా మూడు లక్షల ఇండ్లు మాత్రమే నిర్మించగలుగుతారు. కాని ఆనాడు

గృహనిర్మాణ పనులు చాలా విరుద్ధంగా జరిగాయి. నిర్మాణాలు జరిగేటప్పుడు గ్రౌండ్ లెవెల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ వెరిఫై చేసిన తరువాత డిఇఇ కౌంటర్‌సైన్ చేయాలి. బేస్‌మెంట్, బిలో బేస్‌మెంట్, లింటల్, రూఫ్ లెవెల్స్‌లలో పని జరిగిందా లేదా చూసుకొని, స్టేజ్‌వైజ్ బిల్లుల చెల్లింపులు జరగాలి. ఈ పని అంతా వర్క్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఇంజనీర్, డిఇఇ స్థాయిలలో జరగాలి. చివరగా ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ సూపర్‌విజన్‌లో ఫైనల్ బిల్లుల చెల్లింపులు జరగాలి. కానీ ఆనాడు ఈ పద్ధతి ఏమీ జరగలేదు. మండల్ లెవెల్‌లో 'మండల్ హౌసింగ్ ఆఫీసర్స్' అని ఎండీవో, ఎంఆర్‌వో, పంచాయితీ ఆఫీసర్స్ ముగ్గురికి ఆథరైజేషన్ ఇచ్చి, కనీసం ఇళ్ల నిర్మాణాలలో తనిఖీలు, ఇళ్లు కట్టడం పూర్తి అయ్యిందా లేదా అని ధృవీకరించే బాధ్యతను డిఇఇలకు, ఏఈలకు గాని ఇవ్వకుండా, ప్రతి రోజూ సాయంత్రం ముఖ్యమంత్రి గారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇళ్ల నిర్మాణాలకు బిల్లుల చెల్లింపులు ఎంతవరకు అయ్యాయని మాత్రమే ఆ రెండున్నర సంవత్సరాల కాలంలో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు.

…

ఆ విధంగా ఏవిధమైనటువంటి విచారణ, ఇన్స్‌పెక్షన్, లింటెల్ లేదా రూఫ్ స్లాబ్స్ లెవెల్స్‌లలో ఇన్స్‌పెక్షన్ జరగకుండా కేవలం బిల్లులు చెల్లింపులు జరిగాయి. అందులో ఒక సంవత్సరమైతే పూర్తిగా మహిళా సాధికారత సంస్థలు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ద్వారా జరిగింది. దీనిని అంతటినీ ప్రజలందరూ గమనించాలి. ఈ రెండున్నర సంవత్సరాలలోనే అవకతవకలు జరిగాయి. మన రాష్ట్రంలో హుద్‌హుద్ తుపాను ఉత్తరాంధ్ర జిల్లాలలో వచ్చింది. తుపాను ప్రభావిత ప్రాంతంలో ప్రభుత్వం 7,100 ఇళ్లను మంజూరు చేసింది. తుపాను వచ్చినా తట్టుకొని నిలబడేలా ఉండాలని హై స్టాండర్స్‌తో ఇళ్లకు ఎస్టిమేట్ వేయడం జరిగింది. ఆ విధంగా అయితే అర్బన్ ఏరియాలో అయితే రూ.4,00,000 లు, రూరల్ ఏరియాలో అయితే రూ.3,98,000లతో ఇళ్లను శాంక్షన్ చేయడం జరిగింది. దీనికి రూ.3,400 కోట్లను విడుదల చేయడం జరిగింది. 7,100 ఇళ్లలో 6,000 అర్బన్ ఏరియాలో, 1100 రూరల్ ఏరియాలో అని తెలియజేస్తూ విధానపరమైన నిర్ణయం తీసుకొని జియోట్యాగింగ్ విధానం ద్వారా ప్రోసీడ్ అవుతున్నాం. వాటిని ఈ నెలాఖరుకు పూర్తి చేస్తాం. మొదట్లో 50 ఇళ్లు జియోట్యాగింగ్ ద్వారా పూర్తయితే, ఇప్పుడు రోజుకి 10 నుంచి 15 ఇళ్ల స్థాయికి దిగిపోయింది. ఎవరూ కూడా ముందుకు రావడం లేదు. ఈ 10,00,000 గ్యాప్ ఏదైతో ఉందో అందులో థర్డ్ పార్టీ ఎంక్వైరీ చేస్తే నిజానిజాలు బయటికి వస్తాయి. ఆ దిశగా ప్రభుత్వం తప్పకుండా ప్రయత్నం చేస్తుంది.

మిస్టర్ స్పీకర్ః స్వయంగా మంత్రిగారే హౌసింగ్‌లో అక్రమాలు ఉన్నాయని అంగీకరించడం వల్ల, ఈ అక్రమాలపై విచారణ చేయడం కోసం ప్రభుత్వం సభా సంఘాన్ని వేయడానికి ముందుకు రావడం వల్ల ఈ చర్చ ఇంతటితో ముగించి, ఆ సభా సంఘాన్ని వేయాలని ప్రభుత్వానికి సలహా ఇస్తున్నాను. (In response to a clarification sought by the Members) మినిస్టర్ గారు కమిటీ వేసిన తరువాత సమాచారం అంతా సబ్‌మిట్ చేస్తే తరువాత….they enquire and submit the report to the House.

**MR.SPEAKER: Next Question No.711 (34). The question is postponed at the request of the Member.**

**Question No.788 (35), Minister for Municipal Administration.**

**ప్రశ్న నెం.788 (35)**
**సర్వశ్రీ**
**అమ్జత్ బాషా షేక్ బేపారి,**
**పోచిమ రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,**
**రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, ఎం.ఎల్.ఏలు.**

**గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింద సమాచారం తెలియజేస్తారా;**

అ) కడపలో విమానాశ్రయ పనులు చాలాకాలం క్రితమే పూర్తి అయినప్పటికీ, ఇప్పటివరకు నిర్వహణలోకి తీసుకురాని విషయం వాస్తవమేనా ;

ఆ) విమానాశ్రయాన్ని నిర్వహణలోకి తీసుకురావడంలో జాప్యానికి గల కారణాలేమిటి;

ఇ) ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి;

ఈ) ఎప్పటిలోగా విమానాశ్రయాన్ని నిర్వహణలోకి తీసుకురావడమవుతుంది ?

**ముఖ్యమంత్రి గారి తరపున పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి (డా.పి. నారాయణ) :**

అ) అవునండీ,

ఆ) కడప విమానాశ్రయం నుండి విమానాలను నడపడానికి ఎయిర్‌లైనర్స్ నుండి స్పందన అంతగా లేకపోవడమే జాప్యానికి కారణం.

ఇ) ప్రభుత్వం ఎయిర్‌లైన్ నిర్వాహకులతో సంప్రదిస్తున్నది. ప్రస్తుతం టర్బో మెగా ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ కడపకు విమానాలను నడపడానికి ముందుకు వచ్చింది.

ఈ) త్వరలో కార్యకలాపాలను ప్రారంభించడమవుతుంది.

అయితే వారు హైదరాబాదు నుంచి కడప, కడప నుంచి తిరుపతి, తిరుపతి నుంచి హైదరాబాదు, అదేవిధంగా హైదరాబాదు నుంచి ముంబాయి, ముంబాయి నుంచి హైదరాబాదుకి రూటు ఏర్పాటు చేసి, అనుమతినిస్తే ప్రారంభిస్తామన్నారు. దాని కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నాం. అది రాగానే ప్రారంభిస్తాము.

మిస్టర్ స్పీకర్ః అమ్జత్ బాషా గారూ.

శ్రీ అమ్జత్ బాషా షేక్ బేపారి (కడప)ః అధ్యక్షా, వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి కేంద్ర బిందువైన కడప నగరంలో బ్రిటీషు పాలకులు రెండవ ప్రపంచ యుద్ధంలోనే విమానాలలో ఇంధనం నింపటం కోసం అక్కడ ఒక విమానాశ్రయాన్ని నెలకొల్పడం జరిగింది. ఈ విమానాశ్రయానికి ఒక చరిత్ర ఉంది. అప్పట్లో గ్రావెల్ రన్‌వేతో ప్రారంభించడం జరిగింది. దాని తరువాత 1953వ సంవత్సరంలో కాంక్రీటు రన్‌వేను నిర్మించి, ఒక డకోటా అనే విమానాన్ని నడపడం జరిగిందని పెద్దలు చెప్పడం జరిగింది. ఆ రోజుల్లో ఇంగ్లీషు పత్రికలను సరఫరా చేయడానికి ఇవన్నీ కూడా చేయడం జరిగిందని చెప్పారు. 1985వ సంవత్సరం నుంచి 1990వ సంవత్సరం మధ్య కాలంలో 20 మంది కెపాసిటీ గల వాయుదూత్ సర్వీసును హైదరాబాదు నుండి తిరుపతికి వయా కడప మీదుగా నడపడం జరిగింది. కానీ ఆ వాయుదూత్ సర్వీసును నిలిపేసిన తరువాత ఆ విమానాశ్రయం నిరుపయోగంగా ఉండిపోయింది. దానికి 2004వ సంవత్సరంలో స్వర్గీయ డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన తరువాత ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చెయ్యాలని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి పరిశ్రమలు రావాలని, అక్కడి విద్య మరియు వైద్య రంగాలలో అభివృద్ధి జరగాలంటే ఖచ్చితంగా జిల్లా కేంద్రంలో ఒక విమానాశ్రయాన్ని ఏర్పాటు చెయ్యాలనే ఆలోచనతో ఆ రోజులలోనే రూ.80 కోట్ల బడ్జెట్‌తో విమానాశ్రయాన్ని పునఃప్రారంభించడం జరిగింది. కానీ ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు దాని వ్యయం రూ.80 కోట్ల నుంచి రూ.40 కోట్లకు తగ్గించడం జరిగింది. మొదటి ఫేజ్‌లో రూ.22 కోట్లతో 2009వ సంవత్సరంలోనే పనులు పూర్తి కావడం జరిగింది. దాని తరువాత 2012వ సంవత్సరంలో రెండవ ఫేజ్‌లో మిగిలిన పనులను రూ.18 కోట్లతో పూర్తి చేయడం జరిగింది. ఇవన్నీ కూడా 6,000 అడుగుల రన్‌వేతో ATR 72 విమానం దిగడానికి అవకాశాలు కల్పించడం జరిగింది. ఈ విమానంలో 75 మంది ప్రయాణికులు ప్రయాణం చేసే అవకాశం ఉంది. 2012వ సంవత్సరానికే ఈ విమానాశ్రయం పనులన్నీ పూర్తి చేయడం జరిగింది. ఈనాటికి కూడా ఆ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. రాజశేఖర్‌రెడ్డిగారి మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు ఈ జిల్లా అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం జరిగింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం అవుతున్నా కూడా కడపజిల్లా అభివృద్ధికి నోచుకోలేదు. ఎన్నోసార్లు గౌరవ ముఖ్యమంత్రిగారు, కేంద్రమంత్రి

అశోక్‌గజపతిరాజుగారిచే అక్టోబరు 14న విమానాశ్రయాన్ని ప్రారంభిస్తామని పత్రికలలో రావడం జరిగింది. ఈ ప్రారంభోత్సవ నిమిత్తం రూ.2,00,000 ఖర్చు చేయడం జరిగింది. జిల్లా ప్రజలందరూ కూడా ఎంతో సంతోషపడ్డారు. గత 2 సంవత్సరాలలో ప్రారంభానికి నోచుకోని విమానశ్రయం మళ్లీ ప్రారంభిస్తున్నారని ఆనందించారు. కానీ అక్టోబరు 11వ తేదీన రన్‌వే సరిపోని కారణంగా ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించడం లేదని పత్రికలలో ప్రకటనలను ఇచ్చారు. విమానాశ్రయం వస్తే పరిశ్రమలు వచ్చి, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రజలందరూ భావించారు. పత్రికలలో వచ్చిన ప్రకటనలను చూసిన తరువాత ప్రజలందరూ చాలా బాధపడ్డారు. గౌరవ మంత్రి గారికి ఈ సభ ద్వారా విన్నవించేది ఏమిటంటే వైఎస్సార్ కడప జిల్లా అభివృద్ధిలో భాగంగా ఈ విమానాశ్రయాన్ని ఎప్పుడు ప్రారంభిస్తున్నారో సభలో ప్రకటన చేయవలసినదిగా కోరుతున్నాను.

డా.పి.నారాయణ (పురపాలక శాఖా మంత్రి): అధ్యక్షా, 2012వ సంవత్సరం నాటికి పూర్తి చేశామన్నారు. 2014వ సంవత్సరం నాటికి రెండు సంవత్సరాలలో అక్కడ ఏ ఎయిర్‌వేస్ రాలేదు. అయితే ఈ ప్రభుత్వం వచ్చిన 9 నెలలలో ఎయిర్‌వేస్‌వారిని సంప్రదించడం జరిగింది. దీనికి టర్బో మెగా వాళ్లు అంగీకరించారు, కేంద్రప్రభుత్వం కూడా అనుమతి ఇవ్వబోతోంది. వీలైనంత తొందరలో ఆ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తాం.

శ్రీ పోచిమరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (కమలాపురం): అధ్యక్షా, కడప జిల్లా చాలా వెనుకబడిన ప్రాంతం. వెనుకబడిన ప్రాంతంలోని ప్రజలు విమానాలలో తిరిగే పరిస్థితి వారికి లేకపోయినా దాని పక్కన దాదాపు 7,000 ఎకరాలలో పరిశ్రమల కోసం ఎపిఐఐసి acquire చేసి రిజర్వ్ చేసింది.

...

కడప జిల్లాలో దాదాపు 7000ఎకరాలను ఏ.పీ.ఐ.ఐ.సీ. పరిశ్రమలకోసం సేకరించి ఆ స్థలాలను ప్రక్కన పెట్టింది. ఆ 7000 ఎకరాలలో పెద్ద పెద్ద పరిశ్రమలు రావాలన్నా కూడా కడప జిల్లాలో ఎయిర్‌పోర్టు చాలా అవసరం. ఇప్పటికే ఎయిర్‌పోర్టు పూర్తయ్యింది. ఓపెనింగ్ మాత్రమే బ్యాలెన్స్ ఉంది. ఎయిర్‌పోర్టు తొందరగా ఓపెనింగ్ జరిగితే ప్రజలకు Flights అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇదే కాకుండా వైఎస్సార్ జిల్లాకి సంబంధించిన కొన్ని వేల మంది గల్ఫ్ దేశాలకు ఉద్యోగాల కోసం వెళ్లిన వాళ్ళున్నారు. వాళ్లందరికీ కూడా ఈ ఎయిర్‌పోర్టు బాగా ఉపయోగపడుతుంది. వైఎస్సార్ జిల్లాలో ఉన్న కాంట్రాక్టర్లు, అధికారులూ చంద్రబాబు నాయుడు గారిని అడిగితే, ఇది వైఎస్సార్ జిల్లా కదా, వచ్చే సంవత్సరం ఓపెనింగ్ చేసుకుందాములే అని చెప్పారని పేపరులో కూడా వచ్చిన పరిస్థితి ఉంది. (అధికార, ప్రతిపక్ష సభ్యులచే సభకు స్వల్ప అంతరాయం) ఇటువంటి వివక్షత వైఎస్సార్ జిల్లాపై చూపించకుండా, ఈ ఎయిర్‌పోర్టును అతి తొందరలో ఓపెన్ చేస్తే సరిపోతుంది. పూర్తయిన ఎయిర్‌పోర్టును ఎప్పుడు ఓపెన్ చేస్తారో, ఆ తారీఖు చెబితే మేమంతా సంతోషిస్తాము. మా ప్రజలందరూ కూడా దీనిని గురించి ఎదురు చూస్తున్నారు.

మిస్టర్ స్పీకర్: మంత్రి గారూ.

డా.పి.నారాయణ(పురపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి): అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రతి జిల్లాలో ఎయిర్‌పోర్టులు ప్రారంభించాలని చాలా స్పష్టంగా చెప్పారు. Airways వాళ్లు ఎవరూ రానందువల్ల, ఈ 9నెలలలో జరగలేదు. టర్బో వాళ్లని సంప్రదించాం. వాళ్లు కూడా అగీకరించడం జరిగింది. టర్బో వాళ్లు ప్రత్యేకించి కడప నుంచి ముంబయికి రూటు కావాలని అడుగుతున్నారు. అది ప్రొవైడ్ చేస్తే పనులు ప్రారంభిస్తామని, లేకపోతే చేయలేమని చెప్పారు. రెండు రోజుల క్రితమే కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు గారితో మాట్లాడి, దానికి ఏర్పాట్లు కూడా చేశాము. వీలైనంత త్వరలో ప్రారంభిస్తాము. కడప జిల్లాకు ఒక విధంగా, వేరే జిల్లాకు మరొక విధంగా ఈ ప్రభుత్వం చేయదు. 13జిల్లాలను సమానంగా చూస్తామని సభ్యులకు మీ ద్వారా తెలియచేస్తున్నాను.

**MR.SPEAKER: Question No.855 (36) is postponed at the request of the Member.**

**Now Question No. 819 (37), Minister for Municipal Administration.**

**ప్రశ్న నెం. 819(37)** **శ్రీ ఆమంచి కృష్ణమోహన్, ఎం.ఎల్.ఏ.,**

**గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:**

అ) రాష్ట్రంలో డంపింగ్ యార్డ్‌లను కలిగియున్న మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల సంఖ్య ;

ఆ) డంపింగ్ యార్డులను ఏర్పాటు చేస్తున్న విషయంలో న్యాయ వివరాలు ఉత్పన్నమవుతున్న విషయం వాస్తవమేనా;

ఇ) అయితే, అట్టి న్యాయ వివరాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

**గౌరవనీయులైన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, డా.పి. నారాయణ:**

అ) 13 మునిసిపల్ కార్పొరేషన్లకుగానూ, 11 మునిపిపల్ కార్పొరేషన్లు డంపింగ్ యార్డులను కలిగి వున్నాయి. 87 మునిసిపాలిటీలకుగాను, 78 మునిసిపాలి టీలు డంపింగ్ యార్డులను కలిగి ఉన్నాయి.

ఆ) అవునండీ.

ఇ) రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డు ఉద్దేశం నిమిత్తం భూసేకరణ కోసం మరొక స్థలాన్ని ప్రతిపాదించింది. పెండింగులో ఉన్న కేసులను పరిష్కరించటానికి, గౌరవ న్యాయస్థానాలలో కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయటానికి సంబంధిత పట్టణ స్థానిక సంస్థల ద్వారా చర్యను ప్రారంభించడమ వుతుంది.

మిస్టర్ స్పీకర్ః కృష్ణ మోహన్ గారు.

శ్రీ ఆమంచి కృష్ణ మోహన్ (చీరాల)ః అధ్యక్షా, మంత్రిగారు ఇచ్చిన సమాధానంలో 11 మునిసిపాలిటీస్‌లో కోర్టు కేసులు ఉన్నాయని అన్నారు. అందులో చీరాల మునిసిపాలిటీ ఉందా, లేదా అనేది కూడా చెబితే బాగుండేది. ఖచ్చితంగా చీరాల కూడా ఉండే ఉంటుంది. ఎందుకంటే 2007 సంవత్సరంలో UIDSSMT, this comes under JNNURM. Urban Infrastructure Development Scheme for Small and Medium Towns (UIDSSMT) స్కీమ్ క్రింద రూ. 3,87,20,000 లు 2007వ సంవత్సరంలో మే నెలలో మంజూరు అయ్యాయి. ఈ పథకం కింద సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిధులను మొదటగా శ్రీ కొణిజేటి రోశయ్య గారు మాకు కేటాయించారు. 2009వ సంవత్సరం, మే నెలలో పర్చూరు నియోజకవర్గం, మోటుపల్లి గ్రామంలో స్థలం కేటాయించి, టెండర్లు కూడా పిలిచారు. తర్వాత 'వ్యాన్‌పిక్' కొరకు ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఆ స్థలం ఉన్నందున దానిని మళ్లీ మార్చడం జరిగింది.

అధ్యక్షా, మేము కోరేది డంపింగ్‌యార్డు కాదు. ఇది Municipal Solid Waste Management కి సంబంధించిన వ్యవహారం. Solid Waste Management అంటే segregation yard, maturation yard and vermi compost. తర్వాత వచ్చే వృథా నీటిని 100 శాతం ట్రీట్‌చేసి పక్కనే ఉన్న చిన్న సాధారణ సరస్సులో కలుపుతారు. ఇది ఏ ఒక్కరికీ కూడా ఇబ్బందిలేని వ్యవహారం.

అధ్యక్షా, Municipal Solid Waste Management -2000 నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించి, మళ్లీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతిని కోరడం జరిగింది.

Pollution Control Board తోపాటు Ground Water Department కూడా చుట్టుపక్కల గ్రామాలలో పర్యటించి, joint inspection కూడా చేశారు.

అధ్యక్షా, మా చీరాల నియోజకవర్గం సరిహద్దుల గురించి చెప్తాను. తూర్పున బంగాళాఖాతం, ఉత్తరాన ఉన్న సరిహద్దులో ఈపురుపాలెం గ్రామం ఉంది. దానికి ఆనుకుని గుంటూరు జిల్లాకు చెందిన స్టువర్ట్‌పురం గ్రామం ఉంది. పడమర దిక్కున పొలాలు ఉన్నాయి. దక్షిణాన అటవీ భూములున్నాయి. మా నియోజకవర్గం చాలా compactగా ఉంటుంది. తూర్పు నుంచి పడమరకు 8 కిలోమీటర్లు, అదేవిధంగా ఉత్తరాన ఉన్న స్టువర్టుపురం నుంచి దక్షిణాన ఉన్న కలవకుదురు వరకు 18 కిలోమీటర్లు ఉంటుంది. ఈ మా ప్రాంతం ఎక్కువ డెన్సిటీ కలిగిన ప్రాంతం. అంటే తక్కువ ప్రాంతంలో ఎక్కువ జనాభా, సుమారుగా 2,80,000 మంది నివసిస్తారు. ఈవిధంగా compactగా ఉన్నటువంటి ప్రాంతంలో 2010వ సంవత్సరంలో అక్కడున్న గ్రామాలకు గానీ, రెసిడెన్షియల్ హ్యాబిటేషన్స్‌కు గానీ, వాటి పరిసరాలకు గానీ ఎటువంటి డ్యామేజీ లేకుండా చూసి, సముద్రానికి కేవలం 900ల మీటర్ల దూరంలో ఉన్న రామాపురం గ్రామంలో దాదాపు 15 ఎకరాల 60 సెంట్లు ఉన్న ఒక మంచి స్థలాన్ని Municipal Solid Waste Management కొరకు కేటాయించడం జరిగింది. ఈ రామాపురం గ్రామం అక్కాయపాలెం పంచాయతీ కిందకు వస్తుంది. మేము అంతకన్నా దూరంగా వెళ్ళడానికి అవకాశం లేదు. ఎందుకంటే, పడమర వైపుకు వెళ్తే పంటపొలాలు ఉంటాయి. తూర్పు వైపుకి మరో 300 మీటర్లు వరకూ వెళ్తే సి.ఆర్.జెడ్. రెస్ట్రిక్షన్స్ వస్తాయి. ఉత్తరాన గుంటూరు జిల్లా, దక్షిణాన అటవీ భూములున్నాయి కాబట్టి, ఆ వైపులకు అసలే వెళ్ళలేని పరిస్థితి. అందువలన దీనికోసం సుమారు రెండు మూడు నెలల పాటు చర్చించిన తరువాత, ఎవరికీ ఇబ్బంది ఉండదని, ఈ రామాపురం గ్రామాన్ని Municipal Solid Waste Management కొరకు ఎంచుకోవడం జరిగింది.

అధ్యక్షా, ఈ రామాపురం గ్రామంలో దాదాపుగా 170 మంది మత్స్యకారులు నివాసముంటారు. వారందరికీ ఒక కట్టుబాటు ఉంటుంది. ఆ గ్రామానికి కాపులు అనబడే పెద్దలుంటారు. వారితో సంప్రదించి, గ్రామసభను ఏర్పాటు చేసి ఆ మత్స్యకారుల అనుమతి కూడా తీసుకున్నాం. అయితే, ఈ విషయానికి సంబంధంలేని, రామాపురం గ్రామానికి ఒక కిలోమీటర్ దూరంలోనున్న పాపాయపాలెం గ్రామానికి చెందిన కొంతమంది రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ప్రోద్బలంతో ఆనాటి ఆ గ్రామ సర్పంచ్ కోర్టుకు వెళితే, 2011వ సంవత్సరంలో మాకు Pollution Control Board ఇచ్చిన consent for establishment ను కోర్టు రద్దు చేస్తూ, దానిని రీకన్సిడర్ చేయమని మాత్రమే చెప్పింది. దానికి అర్థమేమంటే ఆ విషయంలో ఏదైనా valid reason ఉంటేనే దానిని తిరిగి కన్సిడర్ చేయమని అర్థం. ఇక్కడ విచిత్రమైన విషయమేమంటే valid reason లేనందువల్ల కచ్చితంగా చీరాల మునిసిపాలిటీకి అనుమతి లభించే అవకాశమున్నప్పటికీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాకు అనుమతినివ్వడంలో

తాత్సారం చేస్తోంది. అధ్యక్షా, (ఫోటోలను గౌరవ సభాపతికి చూపిస్తూ ) మీ ద్వారా సంబంధిత మంత్రి గారికి కూడా ఈ ఫోటోలు పంపిస్తాం. (ఫోటోలను గౌరవ సభాపతికి పంపారు) అధ్యక్షా, రూ.3.87 కోట్లలో maturation yard, vermi compost, compound wall వంటి రెండున్నర కోట్ల రూపాయల విలువ (సుమారుగా) గల 80 శాతం పనులు దాదాపుగా పూర్తయ్యాయి.

అధ్యక్షా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కోర్టు ఆదేశాల ప్రకారం అనుమతిని రద్దు చేసింది. కానీ, మరలా అనుమతిని పొందడానికి ఏ విధమైన నిబంధనలు పాటించాలి? అనే విషయమై స్పష్టంగా చెప్పకుండా గత రెండున్నర సంవత్సరాల నుంచి నాన్చుతోంది. అప్పట్లో లోకల్ బాడీస్ లేవు కనుక చుట్టుప్రక్కలున్న గ్రామపంచాయితీలకు సంబంధించిన పెద్దలు సుమారు 50 మందితో, సంబంధిత శాఖాధికారులతో 2013వ సంవత్సరం జనవరి నెలలో జరిగిన ఒక సమావేశానికి హాజరయ్యాం. వారు అడిగిన ప్రతి ప్రశ్నకు కూడా మేము సమాధానం చెప్పాం. మేము లిఖితపూర్వకంగా వివరణలు ఇచ్చినప్పటికీ, మా సమాధానాలకు వారు సంతృప్తి చెందినప్పటికీ, అనుమతిని మాత్రం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు.

MR.SPEAKER: Please conclude.

శ్రీ ఆమంచి కృష్ణమోహన్ (చీరాల)ః అధ్యక్షా, చీరాల మున్సిపాలిటి చాలా compactగా ఉంటుంది. స్వచ్ఛ భారత్ వంటి రకరకాల కార్యక్రమాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున చేపట్టాల్సి వస్తోంది. చీరాలలోని చెత్తని ప్రక్కన ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న కారంచేడు రోడ్డులో వేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆ చెత్తను తగలబెడితే వచ్చే పొగవల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితులుంటున్నాయి. ఇలా చాలా రకాల ఇబ్బందులున్నాయి. ఈ సమస్యను పరిష్కరించే బాధ్యత మునిసిపాలిటీదేనని ఒక ప్రభుత్వ సంస్థ ప్రాపర్‌గా స్పందిస్తూ ఉంటే, ఇటువంటి సమస్యలను పరిష్కరించాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాత్రం మాకేమీ సంబంధం లేదు, మా నిబంధనలు మేము పాటిస్తామనే దృక్పథంలో ఉన్నారు. వాళ్ళు ఏ విషయమూ కూడా స్పష్టంగా చెప్పడం లేదు.

ఇక్కడ ఒక చిన్న విషయం చెప్పాల్సి ఉంది. వాస్తవంగా MSW - 2000 రూల్స్‌లో ఎక్కడా డిస్టెన్స్‌ను స్పెసిఫై చేయలేదు. రెసిడెన్షియల్ హ్యాబిటేషన్స్‌కు 320 మీటర్ల దూరం అని ఉన్నప్పటికీ, వాస్తవ ఫిల్లింగ్ విషయానికి వచ్చేసరికి 500 మీటర్ల పైన దూరం ఉంటోంది. ఇటువంటి వాస్తవాలను కూడా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కోర్టుకు చెప్పలేదు. అధ్యక్షా, ఈ పరిస్థితుల్లో సంబంధిత ఉన్నతాధికారులూ, మంత్రిగారూ తగువిధమైన చర్యలు తీసుకుని, ఈ సమస్యను పరిష్కరించవలసిందిగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: మంత్రిగారూ.

శ్రీ పి.నారాయణ (పురపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి): అధ్యక్షా, సభ్యులు చెప్పినట్లు వీలైనంత తొందరలో లీగల్ ప్రాబ్లమ్స్ ఓవర్‌కమ్ చేసి దానిని స్టార్ట్ చేస్తాము.

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్ (విశాఖపట్నం సౌత్): అధ్యక్షా, విశాఖపట్నం జిల్లాలోని విశాఖపట్నం సౌత్ నియోజకవర్గంలో రెండు కిలోమీటర్ల పరిధిలోనే దాదాపు మూడున్నర లక్షల పాపులేషన్ వుంటారు. పైగా అది పాత నగరం. ఆ నగరం నడిబొడ్డున పది ఎకరాల విస్తీర్ణంలో ఒక ట్రాన్సిట్ డంపింగ్ యార్డు ఉంది. అక్కడ ప్రతి రోజూ దాదాపు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 200 నుంచి 250 టన్నుల చెత్తను అక్కడ డంప్ చేస్తుంటారు. ఆ ప్రాంతంలో అంత జనాభా ఉండటంతోపాటు కింగ్ జార్జ్ హాస్పిటల్, గోషాల్ హాస్పిటల్ లాంటి ప్రముఖ హాస్పిటల్స్ ఉండే ఏరియా అది. మరో వైపున పోర్ట్ మరియు ఇతర పరిశ్రమల పొల్యూషన్ కూడా అక్కడ ఉంటుంది. పైగా అక్కడ డంప్ చేసిన చెత్తను మూడు నాలుగు రోజులైనా అక్కడినుంచి తరలించకపోవటం వలన ఆ ప్రాంతంలోని ప్రజలు అనేక జబ్బుల బారిన పడుతున్నారు. మన హిందూ సాంప్రదాయం ప్రకారం గర్భిణీ స్త్రీలు పురుడు పోసుకోవడానికి పుట్టింటికి రావడం ఆచారమైనప్పటికీ బాలింతలకు, పుట్టే పిల్లలకు జబ్బులు వస్తాయేమోనన్న భయంతో ఆ ప్రాంతాన్ని వదిలి బయట ప్రాంతాలకు వెళ్తున్నారే కానీ అక్కడికి రావడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. అక్కడి డంపింగ్ యార్డును దూర ప్రాంతాలకు తరలించాలని గతంలోనే మునిసిపల్ శాఖా మంత్రి గారికి విన్నవించటం జరిగింది. అక్కడి పౌరులు అనేకసార్లు ధర్నాలు కూడా చేయటం జరిగింది. అయినా దానిపై ఇంతవరకు ఎటువంటి చర్యా తీసుకోలేదు. ఆ ప్రాంతంలో దాదాపు 56 స్లమ్స్ వున్నాయి. అక్కడున్న 56 స్లమ్స్‌లో నివసిస్తున్న ప్రజలకు ఆ పదెకరాల డంపింగ్ యార్డు స్థలంలో జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ కింద ఇళ్ల నిర్మాణం చేపట్టి అక్కడున్న డంపింగ్ యార్డును సుదూర ప్రాంతాలకు తరలించాలని మీద్వారా మునిసిపల్ శాఖా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పి.విష్ణు కుమార్ రాజు (విశాఖపట్నం నార్త్): అధ్యక్షా, గౌరవ సభ్యులు వాసుపల్లి గణేశ్ కుమార్ గారు చెప్పింది వాస్తవం. విశాఖపట్నంలోని చెత్తంతా ఆయన నియోజకవర్గంలోనే వేస్తున్నారు. మంత్రి గారు కూడా చూశారు. ఒకసారి మా ఎమ్మెల్యేలందరినీ కూడా తీసికెళ్లి చూపించారు. సైక్లోన్ తరువాత మంత్రి గారు మా జిల్లాకు రావడం లేదు. మంత్రి గారు మా జిల్లాలో ఎక్కువ టైం స్పెండ్ చెయ్యాలని కోరుతున్నాను. నా నియోజకవర్గానికి సంబంధించి 185 పనులకు గాను ఒక్క పని కూడా పూర్తి కాలేదు. నేను ఎన్నికైన తరువాత రెండు లక్షల రూపాయల ఒక్క పని కూడా పూర్తి కాలేదు. కారణమడిగితే మంత్రి గారు లేరంటున్నారు. అధ్యక్షా, మంత్రి గారిని మీ ద్వారా మా విశాఖట్నం జిల్లా మీద కాన్‌సంట్రేట్ చేయాలని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః రాజు గారూ, మీ దగ్గర పనులు జరగాలంటే మినిస్టర్ గారు అక్కడికి రానవసరం లేదు. హైదరాబాదులోనే శాంక్షన్ చేసి పనులు జరిపిస్తారు.

డా.పి.నారాయణః (పురపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి)ః అధ్యక్షా, ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు సెంట్రల్ గవర్నమెంట్ ఏర్పాటు చేయబోయే గిరిజన విశ్వవిద్యాలయానికి సంబంధించిన స్థల నిర్ణయం చేయటం కోసం ఈ మధ్యనే విశాఖపట్నం, విజయనగరం జిల్లాలలో పర్యటించి రావటం జరిగింది. వాస్తవంగా ఈ రోజున స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు చేపడుతున్నాం. అలాగే రాష్ట్రంలోని 13 జిల్లాలలోనూ సాలిడ్ వేస్ట్ నుంచి పవర్ జనరేషన్ చేయటానికి సంబంధించి డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టులను కాల్‌ఫర్ చేశాము. అవి రాగానే వీలైనంత తొందరలో వాటిని క్లియర్ చేయటం జరుగుతుంది.

**మిస్టర్ స్పీకర్ః ప్రశ్న నెంబరు 851(వరుస సంఖ్య 38)**

**సర్వశ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్,**
**కలిదిండి సూర్య నాగ సన్యాసి రాజు, ఎమ్ఎల్ఏలు.......**

**గౌరవనీయులైన కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః**

అ. పొరుగు సేవల ఏజెన్సీలు ప్రభుత్వానికి ఇఎస్ఐ మరియు పిఎఫ్‌లు చెల్లించకపోవడం వలన పొరుగు సేవల సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్న విషయం ప్రభుత్వం దృష్టికి తేవడమయిందా?

ఆ. అయితే ఆ వివరాలేమిటి?

ఇ. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్య ఏమిటి?

**గౌరవనీయులైన కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ మరియు ఫ్యాక్టరీల శాఖ మంత్రి(శ్రీ కె.అచ్చెన్నాయుడు)ః**

అ. లేదండీ.

ఆ. ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ. ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్ (విశాఖపట్నం సౌత్): అధ్యక్షా, కాంట్రాక్ట్ ఉద్యోగులతో పని చేయించుకొని రిటైర్మెంట్ తరువాత వాళ్లకు ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వడం లేదని, అందువల్ల వాళ్ల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలన్న ఉద్దేశంతో కాంట్రాక్ట్ ఉద్యోగులు/లేబర్ యొక్క ప్రయోజనాలను పరిరక్షించడానికి 1970లో కాంట్రాక్ట్ లేబర్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ యాక్ట్ వచ్చింది. అది చాలా పవర్‌ఫుల్ యాక్ట్. దానికనుగుణంగానే 1971లో కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు ఫ్యాక్టరీల శాఖను కూడా దాని పరిధిలోకి తీసుకురావడం జరిగింది. ఈ విధమైన చట్టాలు, నియమనిబంధనలు తీసుకురావడం యొక్క ప్రధాన లక్ష్యమేమంటే ఆయా సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల, ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించడమే. ఆ తరువాత 1981లో ఔట్‌సోర్సింగ్ విధానం వచ్చింది. 21వ శతాబ్దంలో దాని యొక్క పరిధి మరింతగా విస్తరించి అనేక రకాలైన కార్మికులు, ఉద్యోగులు మరియు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో సహా చాలా మంది దాని పరిధి కిందకు వచ్చారు. అలాగే అనేక రకాలైన పబ్లిక్ సెక్టార్లు, ప్రైవేట్ సెక్టార్లలోని వ్యాపార, వాణిజ్య సంస్థలలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు కూడా దాని పరిధి కిందకు వచ్చారు. అలాగే కొన్ని పెద్ద పెద్ద వాణిజ్య, వ్యాపార సంస్థలు తమ బిజినెస్‌కు సంబంధించిన అనేక కార్యకలాపాలను పీసుల కింద చేసి వాటిని నిర్వహించటానికి వివిధ కాంట్రాక్టు సంస్థలకు అమ్మేయటం లేదా తమ అసెట్స్‌ను ట్రాన్స్‌ఫర్ చేయటం, అలాగే తమ సంస్థలోని వివిధ కార్యకలాపాలకు సంబంధించిన పనులు నిర్వహించటానికి కొన్ని కార్పోరేట్ సెక్టార్స్‌కు లేదా ఆఫ్‌సోర్స్, ఔట్‌సోర్స్ కాంట్రాక్ట్ సంస్థలకు అప్పగించటం జరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే సుమారు 75 లక్షల మంది ఔట్‌సోర్సింగ్ విధానం కింద పని చేస్తున్నారు. అలాంటి వారి ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వ చట్టం కింద ఏర్పడిన ఈఎస్ఐ కార్పోరేషన్ (కార్మిక రాజ్య బీమా సంస్థ) అనేది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పని చేస్తున్నది. ఎక్కడైనా సరే ప్రైవేట్ లేదా ఔట్‌సోర్సింగ్ విధానంలో కనీసం పది మందికంటే ఎక్కువ మంది పని చేస్తున్న చోట తప్పకుండా ఈఎస్ఐ కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చట్టం నిర్దేశిస్తున్నది. అయితే ఈ చట్టం ఈమధ్య కాలంలో సక్రమంగా అమలు కాకపోవడం వలన చాలా మంది ఉద్యోగులకు సరియైన ప్రయోజనాలు లభించటం లేదని మంత్రి గారి దృష్టికి తీసుకొస్తున్నాను. ఒక్కొక్క ఉద్యోగి/కార్మికునికి సంవత్సరానికి కేవలం రూ.120/-ల చొప్పున బీమా సొమ్ము చెల్లించటం ద్వారా ఈఎస్ఐ విధానం కచ్చితంగా అమలు చేయటం జరుగుతుంది. తద్వారా ఉద్యోగుల మరియు వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి అనారోగ్య పరిస్థితులు వచ్చినా, ఎలాంటి జబ్బులు వచ్చినా కార్పోరేట్ ఆసుపత్రులలో రిటైర్ అయిన తరువాత కూడా చికిత్స చేయించుకునే అవకాశముంటుంది. సిక్‌నెస్ బెనిఫిట్స్ కూడా ఉంటాయి. సుమారు 91 రోజులు సిక్ అయితే 70 శాతం వరకు వేజెస్ ఇచ్చే అవకాశముంది. అలాగే మహిళలకు సుమారు మూడు నుంచి నాలుగు నెలల వరకు జీతంతో కూడిన మెటర్నిటీ లీవు ఇవ్వడం జరుగుతుంది. డిజెబిలిటీ

కింద వాళ్లు ఏ వయసు వరకు  పని చేయగలుగుతారో ఆ వయసు వరకు వాళ్లకు 90 శాతం వేతనాలివ్వటం జరుగుతుంది. ఇలాంటి ఎన్నో బహళ ప్రయోజనాలున్న ఈఎస్ఐ పథకాన్ని మనం  సక్రమంగా వాడుకోవటం లేదు.  మన రాష్ట్రంలో ఎక్కడైతే పది మంది లేదా అంతకంటే ఎక్కువ మంది  పని చేస్తుంటారో అలాంటి ప్రతి చోటా అనగా షాపులు, థియేటర్లు, షాపింగ్‌మాల్స్ వాణిజ్య, వ్యాపార సంస్థలు, స్కూళ్లు, కాలేజీలు, ముఖ్యంగా నారాయణ, శ్రీచైతన్య తదితర విద్యాసంస్థలలో సుమారు లక్ష మంది వరకు పని చేస్తుంటారు. కాబట్టి అలాంటి విద్యాసంస్థలు మొదలైన చోట్ల ఈఎస్ఐని కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరముంది. ఆ విధంగా రాష్ట్రంలోని మొత్తం 75 లక్షల నుండి కోటి మంది వరకు ఈఎస్ఐ పరిధిలోకి వచ్చేలా చేసినట్లయితే రాష్ట్ర ప్రభుత్వం మీద, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం మీద ఒత్తిడి తగ్గుతుంది.  అలాగే 20 మంది అంత కంటే ఎక్కువ మంది పని చేస్తున్న చోట ప్రావిడెంట్ ఫండ్ పథకాన్ని అమలు చేయాల్సిన అవసరముంది. దాని వల్ల సంబంధిత ఉద్యోగులకు, కార్మికులకు అనేక ప్రయోజనాలుంటాయి. కాబట్టి రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ వారు ఉద్యోగులకు, కార్మికులకు తప్పనిసరిగా ఈఎస్ఐ మరియు పిఎఫ్ పథకాలు కచ్చితంగా అమలయ్యేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని,  దీనిని ప్రభుత్వం వెంటనే చేపట్టి ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌కు ఈ బాధ్యత అప్పగించి కాంట్రాక్టు కార్మికులను, ఔట్‌సోర్సింగ్ కార్మికులను కాపాడవలసిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

....

శ్రీ కె.అచ్చెన్నాయుడు (టెక్కలి)ః అధ్యక్షా, కార్మికుల భవిష్య నిధి చట్టం మరియు కార్మిక రాజ్య బీమా సంస్థ చట్టం రాష్ట్రంలో అమలు జరుగుతున్నాయి. అయితే ఈ రెండు చట్టాలను కూడా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తుంది. అయినా రాష్ట్ర ప్రభుత్వం దీనికి ప్రత్యేకంగా ఒక సెల్ ఏర్పాటుచేసి రాష్ట్రంలో ఉన్న కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ మీద, ఈఎస్ఐ మీద ఏమైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకు మేం ఒక వ్యవస్థను ఏర్పాటుచేశాం. ఆ వ్యవస్థలకు కార్మికులు తమ సమస్యలను తెలియజేస్తే కేంద్ర ప్రభుత్వాధికారులతో ఎప్పటికప్పుడు మేం సమావేశాలు నిర్వహించి  సమస్యలు పరిష్కరించడానికి అనేక రకాలుగా ప్రయత్నం చేస్తున్నాం. ఈఎస్ఐ ఆసుపత్రి ఉమ్మడి రాష్ట్రంలో 500 పడకలతో ఉంది. దురదృష్టవశాత్తు రాష్ట్ర విభజన జరిగిన తరవాత ఆంధ్రప్రదేశ్‌కు అటువంటి ఆసుపత్రి లేదు. ఇటీవల కేంద్ర కార్మిక శాఖా మంత్రి శ్రీ బండారు దత్తాత్రేయ గారిని కలిసి కోరగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా 500 పడకల ఆసుపత్రిని మంజూరు చేస్తామని చెప్పారు. ఈఎస్ఐ ఆసుపత్రిని విశాఖపట్నంలో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆసుపత్రి నిర్మాణానికి 100 ఎకరాల భూమి అవసరమైనందున అందుకోసం ఇటీవలే విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడాను. స్థలం గుర్తించి వీలైనంత తొందరగా కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తే ఆసుపత్రి నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

అదే విధంగా రాష్ట్రంలోని చాలా ప్రాంతాలలో ఈఎస్ఐ ఆసుపత్రులున్నా వాటికి సరైన భవనాలు లేనందున రోగులకు సరైన వైద్యం అందించలేని పరిస్థితి ఉంది. వాటన్నింటి మీదా దృష్టి పెట్టి వీలైనంత త్వరలో వాటిని పునరుద్ధరించి కార్మికులకు ఆ వైద్యశాలల్లో వైద్యం అందించేందుకు ప్రభుత్వం తప్పనిసరిగా కృషి చేస్తుందని తెలియజేస్తున్నాను. ప్రస్తుత సమావేశాలు పూర్తయిన తరవాత ఈఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్రంలోని కార్మికుల సమస్యలపై చర్చించి పూర్తిస్థాయిలో కార్మికుల శ్రేయస్సు గురించి ఈ ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సభకు మీ ద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ వాసుపల్లి గణేశ్‌కుమార్ (విశాఖపట్నం సౌత్)ః అధ్యక్షా, ఈఎస్ఐ ఆసుపత్రులను మన రాష్ట్రంలో కట్టేంతవరకు, కొన్ని హైదరాబాద్‌లో ఇమేజ్ హాస్పటల్ తదితర కార్పోరేట్ ఆసుపత్రులను గుర్తించి వాటిలో కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. అదే విధంగా ఈపీడీసీఎల్ లాంటి ప్రభుత్వ కంపెనీలలో శాశ్వత ఉద్యోగులు కరెంట్ పోల్స్ ఎక్కరు, అటువంటి విధులను కాంట్రాక్టు కార్మికులతో చేపిస్తారు. పొరపాటున కాంట్రాక్టు కార్మికులు పోల్స్‌పై నుండి కిందపడి మరణిస్తే, గాయపడితే కనీసం వారికి నష్టపరిహారం గానీ, వైద్య ఖర్చులు గానీ అందించడంలేదు. ఉదాహరణకు గ్రేటర్ హైదరాబాదు మునిసిపల్ కార్పోరేషన్‌లో కార్మికులను ఔట్‌సోర్సింగ్‌లో తీసుకుంటున్నారు. ఆ విధంగా పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధిత ఔట్‌సోర్సింగ్ సంస్థలు పీఎఫ్, ఈఎస్ఐ తదితర చెల్లింపులు చేయకపోవడంతో కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నందున ప్రత్యేకంగా ఆడిటర్‌ను నియమించడం జరిగింది. ఆ ఆడిటర్ ఆయా ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు సంస్థ ఈఎస్ఐ, పీఎఫ్ మొత్తం చెల్లిస్తున్నారా, లేదా అని పరిశీలిస్తున్నారు. మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వరంగ సంస్థలు కూడా ఔట్‌సోర్సింగ్ విధానంలో చాలా పెద్ద సంఖ్యలో ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటున్నాయి. వారితో రోజుకు 8 గంటలు పనిచేయించాల్సి ఉండగా వారితో రోజుకు 16 గంటలు కూడా పని చేయిస్తున్నందున ఆయా కార్మికులు, ఉద్యోగులు సరైన విశ్రాంతి లేక రోగాలపాలు అవుతున్నారు. అలాగే వారికి రిటైర్మెంట్ ప్రయోజనాలు ఏమీ అందడం లేదు. వారి ఆరోగ్యపరిస్థితిని దృష్టిలో పెట్టుకొని వారిని ఆదుకొనేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ కోన రఘుపతి (బాపట్ల)ః అధ్యక్షా, పెద్దలు చెప్పినట్లుగా ఈఎస్ఐ, పిఎఫ్ చట్టాలున్నా వాస్తవంలో సరిగా అమలుకావడం లేదు. పి.ఎఫ్‌కు సంబంధించి పది మంది ఉద్యోగులుంటే యజమానులు స్వచ్ఛందంగా నమోదు చేసుకోవచ్చు. 20 మంది ఉద్యోగులకు మించి ఉంటే తప్పనిసరిగా ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కలిగించాలి. వాస్తవంగా చెప్పాలంటే మనం ఇల్లు కట్టుకుంటున్నప్పుడు పనిచేసే కార్మికుడు కూడా ఈ చట్టం కింద కవర్ అవుతారు. ఈ వ్యవస్థలో లోపం ఏమంటే గౌరవ మంత్రి అచ్చెన్నాయుడు గారు చెప్పినట్లు హైదరాబాద్‌లో 500 పడకలతో ఈఎస్ఐ ఆసుపత్రి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా విశాఖపట్నంలో ఈఎస్ఐ ఆసుపత్రి

నిర్మించాలని మంత్రిగారు చెబుతున్నారు. దానితోబాటు ప్రతి జిల్లాలోనూ ఉన్నటువంటి ప్రభుత్వాసుపత్రులను ఈఎస్ఐతో అనుసంధానం చేసి మరిన్ని ఆధునిక వసతులు, సౌకర్యాలు కల్పిస్తే కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చు. ఈఎస్ఐ ద్వారా వచ్చే నిధులను ప్రభుత్వాసుపత్రులకు కేటాయించి వసతులు మెరుగుపరచి కార్మికులకు వైద్యసేవలు అందిస్తే బాగుంటుంది. నా సూచనను మీ ద్వారా గౌరవ మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

శ్రీ కె.సంజీవయ్య (సూళ్లూరుపేట): అధ్యక్షా, సూళ్లూరుపేట నియోజకవర్గంలో మూడు సెజ్‌లలో సుమారు 15వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారి కుటుంబ సభ్యులను కూడా కలిపితే సుమారు 60 వేల మందికి ఈఎస్ఐ ఆసుపత్రుల ద్వారా వైద్యసేవలు అందించే పరిస్థితి ఉంది. దానిని దృష్టిలో పెట్టుకొని దివంగత నేత రాజశేఖరరెడ్డి గారు సూళ్లూరుపేటలో రోగ నిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. దానికి స్థలం కేటాయించారు గానీ భవనాలు నిర్మించక ప్రైవేటు భవనాలలో నిర్వహిస్తున్నారు. అందులో 12 మంది స్పెషలిస్టు డాక్టర్లున్నా ఇరుకు గదులు కావడంతో డాక్టర్లు రాకపోవడంతో రోగులకు వైద్యసేవలు అందుబాటులో లేవు. ఈఎస్ఐ ఆసుపత్రిలో డయాగ్నసిస్ సెంటర్, డిస్పెన్సరీ లేవని మంత్రిగారి దృష్టికి తీసుకొస్తున్నాను. స్థలం ఉన్నందున భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఎం.సుగుణమ్మ (తిరుపతి): గౌరవ సభాధ్యక్షులకు నమస్కారం. తిరుపతిలో ఈఎస్ఐ ఆసుపత్రికి కొత్త భవనాలు నిర్మించారు కానీ ఇంకా ప్రారంభోత్సవం చేయాల్సి ఉంది. చిత్తూరు జిల్లా మొత్తానికి తిరుపతిలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించేందుకు అన్ని స్పెషలిస్టు విభాగాలున్నాయి. కానీ సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలంటే ఆ ఆసుపత్రినుంచి రెఫర్ చేస్తే స్విమ్స్‌లో వైద్యసేవలు అందించేందుకు పరిశీలించాల్సిందిగా కోరుతున్నాను. వెంటనే తిరుపతిలోని ఆసుపత్రిని ప్రారంభించి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్యసేవలు అందించాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పి.జి.వి.ఆర్.నాయుడు (విశాఖపట్నం వెస్ట్): అధ్యక్షా, విశాఖపట్నంలో పారిశ్రామికవాడ ఆవిర్భవించిన తొలి రోజులలో విశాఖ పోర్టు ట్రస్టుకు చెందిన భూమిలో ఈఎస్ఐ ఆసుపత్రిని 50 సంవత్సరాల క్రితం స్థాపించారు. కానీ తరవాత ఆ ఆసుపత్రిని విస్తరించలేదు. ఆ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. గత సంవత్సరం సంభవించిన హుద్‌హుద్ తుపానువలన ఆసుపత్రి భవనాలు చాలా పాతవి కావడంతో ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, లేబొరేటరీలు బాగా దెబ్బతిని రోగులకు ఆరుబయట వైద్యం అందించాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ విషయం మంత్రిగారి దృష్టికి కూడా వచ్చింది కాబట్టి ఒకసారి సందర్శించమని కోరుతున్నాను. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఈఎస్ఐ ఆసుపత్రిని విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్నందుకు చాలా సంతోషం. విశాఖపట్నంలో ఈఎస్ఐ ఆసుపత్రి

నిర్మాణానికి వంద ఎకరాల స్థలం సూచించమని కలెక్టర్‌ను కోరామని మంత్రిగారు చెప్పారు. పరిశ్రమలకు దగ్గరగా ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటుచేస్తే కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఉపయోగకరంగా ఉంటుంది. కాబట్టి పోర్టు ట్రస్టు ఆవరణలోనే ఆసుపత్రిని ఏర్పాటుచేస్తే బాగుంటుందని విశాఖ పోర్టు ట్రస్ట్ చైర్మన్ గారు కూడా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. ఈఎస్ఐ ఆసుపత్రిని అక్కడనుంచి తరలించాలనే ప్రతిపాదన ఉందని విశాఖ ప్రజలలో ఆందోళన ఉంది కాబట్టి ఆ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకొని అక్కడే ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుచేస్తే బాగుంటుంది.

...

ఈఎస్ఐ హాస్పిటల్ తరలింపు ప్రతిపాదన ఉందనే ఆందోళన కూడా విశాఖ ప్రజల్లో ఉంది. కాబట్టి దానిని తరలించి బయట ఎక్కడో కట్టేదాని కంటే అదే ప్రాంతంలో నిర్మాణం చేయాలని కోరుతున్నాను. ప్రస్తుతం వైద్యసేవలన్నింటికీ కూడా వాళ్లు కార్పోరేట్ హాస్పిటల్స్‌కు రిఫర్ చేయడం జరుగుతోంది. విశాఖ నగరంలోనే ఒక భవనాన్ని అద్దెకు తీసుకోవడం జరిగింది గానీ ప్రస్తుతం సేవలు అందించడానికి కూడా ఆ భవనం అందుబాటులోకి రాలేదు. దానిపైన కూడా చర్యలు తీసుకోవలసిందిగా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీకె.అచ్చెన్నాయుడు(టెక్కలి): అధ్యక్షా, ఈ సందర్భంగా సభ్యులందరినీ కోరుతున్నాను. మీ పరిధిలో ఇఎస్ఐ హాస్పిటల్ ఉండి ప్రైవేటు భవనాల్లో నడుపుతున్న పరిస్థితి ఉంటే మీరు కలెక్టర్లతో మాట్లాడి రెండెకరాల స్థలం వెంటనే మీరు ప్రభుత్వానికిస్తే భవనాలు కట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సభ్యులందరికీ తెలియచేస్తున్నాను. గౌరవ సభ్యులు నాయుడు గారు చెప్పినట్లుగా ఏదైతే పోర్టు ట్రస్టు భూమిని లీజుకి తీసుకుని ఆరోజు ఇ.ఎస్.ఐ హాస్పిటల్ కట్టామో ఆ పీరియడ్ కూడా మొన్ననే పూర్తయింది. దానిని ఎక్స్‌టెండ్ చేయమని మరలా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాం. అది కూడా వీలైనంత తొందరగా చేస్తామని తెలియచేస్తున్నాను. సభ్యులు చెప్పిన విధంగా ఒక ఇ.ఎస్.ఐ.హాస్పిటల్‌లోనే కార్మికులకు వైద్య సేవలు అందించడం కంటే ప్రతీ ప్రాంతంలో మన ప్రభుత్వ హాస్పిటల్స్ ఉన్నాయి, కార్పోరేట్ హాస్పిటల్స్ ఉన్నాయి కాబట్టి ఏ ఒక్క కార్మికుడికి గానీ, కార్మికుడి కుటుంబానికి గానీ ఎక్కడ వైద్యం అందుబాటులో ఉంటే అక్కడ వైద్యం చేయించుకునే అవకాశం కల్పిస్తే బాగుంటుందని చాలా మంది సభ్యులు చెప్పారు. ఇది మంచి సలహా. మొన్ననే కేంద్ర మంత్రి దత్తాత్రేయ గారితో మాట్లాడితే ఆయన కూడా మొన్ననే కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక నిర్ణయం తీసుకున్నారు. కార్మికులు కేవలం ఇ.ఎస్.ఐ.హాస్పిటల్స్‌లో కాకుండా కార్పోరేట్ హాస్పిటల్స్‌లో గానీ, పెద్ద పెద్ద ప్రభుత్వ ఆసుపత్రులలో గానీ వైద్యం చేయించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని ఈ సభ ద్వారా కార్మిక సోదరులందరికీ కూడా తెలియచేస్తున్నాను. గత కొంత కాలంగా ఏదైతే కార్మిక శాఖ హైదరాబాద్‌కు సంబంధించిన వ్యక్తుల చేతుల్లో ఉండటం వలన మన ప్రాంతాలన్నీ బాగా వెనుకబడ్డాయి. ఈ మధ్య కాలంలో ఏయే ప్రాంతాల్లో హాస్పిటల్స్ ఉన్నాయి, ఎక్కడ వైద్యులు లేరు, ఎక్కడ కార్మికులకు సమస్యలున్నాయి. కార్మికులకు ప్రభుత్వం నుంచి అన్ని సహాయ

సహకారాలూ అందించాలని పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాం. మీరు కూడా ఇప్పుడు చెప్పిన సభ్యులే కాకుండా ఇంకా చాలా మందికి మాట్లాడే అవకాశం రాలేదు. సూళ్లూరుపేట శాసన సభ్యులు ఇంతకు ముందే నాకు చెప్పారు. దానిని కూడా ఈ బడ్జెట్‌లో పెట్టి తప్పనిసరిగా ప్రాంతాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా ఏ సభ్యులు ఏ సమస్యని మా దృష్టికి తీసుకు వచ్చినా సరే తప్పనిసరిగా కార్మిక శ్రేయస్సు గురించి పూర్తిగా సహకరిస్తామని మీద్వారా సభ్యులందరికీ తెలియచేస్తున్నాను.

**మిస్టర్ స్పీకర్‌: ప్రశ్న నెం. 39(870) శ్రీ గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎం.ఎల్.ఏ.**

**గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా ;**

అ) హంద్రీనీవా సుజల స్రవంతి రెండవ దశ క్రింద రాయచోటి నియోజక వర్గ పరిధిలోని గ్రామాలకు ఎప్పటిలోగా సాగునీటిని సరఫరా చేయడమవుతుంది ;

ఆ) ఇప్పటివరకు ఖర్చు చేసిన మరియు ఇంకా ఖర్చు చేయవలసిన మొత్తం ఎంత ;

ఇ) ఇప్పటివరకు సేకరించిన భూ విస్తీర్ణం ఎంత; మిగిలిన భూమిని ఎప్పటిలోగా సేకరించడమవుతుంది?

**జలవనరుల శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు):**

అ) ప్రభుత్వం ఎచ్ఆర్‌హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు రెండవ దశను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టింది. 2016, జూన్ చివరి నాటికి ఆ ప్రాజెక్టును పూర్తి చేయాలని కార్యక్రమాన్ని రూపొందించింది. పనిని పూర్తి చేసిన మీదట, రాయచోటి నియోజక వర్గంలోని గ్రామాలకు నీటిని సరఫరా చేయడమవుతుంది.

ఆ) ఎవిఆర్ హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు రెండవ దశపై ఖర్చు చేసిన వ్యయం ఈ క్రింది విధంగా వుంది.

1. ఎల్‌ఏ & ఇతర వాటితో సహా ఖర్చు చేసిన మొత్తం పైకం రూ.3,910.00 కోట్లు
2. పనులపై ఖర్చు చేసిన మొత్తం రూ.2,893.00 కోట్లు
3. ఇంకా ఖర్చు చేయవలసిన మొత్తం రూ.1,216.00 కోట్లు.

ఇ) ఎవిఆర్ హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు రెండవ దశలో ఇప్పటి వరకు సేకరించిన భూమి మరియు సేకరించాల్సినట్టి మిగిలిన భూవిస్తీర్ణం ఈ క్రింది విధంగా ఉంది.

| | | | |
|---|---|---|---|
| ఎ) | అవసరమైన మొత్తం భూమి | ః | 33,253.00 ఎకరాలు |
| బి) | సేకరించిన భూమి | ః | 27,772.00 ఎకరాలు |
| సి) | సేకరించాల్సినట్టి మిగిలిన భూమి | ః | 5,481.00 ఎకరాలు |

మిగిలిన భూమిని 2015, జూన్ చివరి నాటికి సేకరించడమవుతుంది.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి (రాయచోటి)ః అధ్యక్షా, రాయలసీమ ఒక దుర్భిక్ష ప్రాంతమైతే, హంద్రీనీవా ప్రవహించే ప్రాంతం చాలా తీవ్రమైన దుర్భిక్ష ప్రాంతం. ఈ ప్రాజెక్టు ఎక్కడైతే ప్రవహిస్తుందో ఆ ప్రాంతాలన్నీ కూడా దాదాపుగా మన భారతదేశంలోనే అత్యంత తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాలు. జైసల్మేర్ తరువాత అత్యంత తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాలు. ఈ ప్రాంతాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఆ ప్రాంతాలలో కూడా పచ్చదనం చూడాలనే ఉద్దేశంతో ఎన్‌టి రామారావు గారు హంద్రీనీవా సుజల స్రవంతి అని నామకరణం చేశారు. తరువాత ఉన్న ప్రభుత్వం మొత్తం మీద ఈ ప్రాజెక్టు పైన రూ.13 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. తరువాత ఈ ప్రాజెక్టుని దివంగత నాయకులు డా.రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత ఏదో రకంగా ఆ ప్రాంతంలో పూర్తి చేసి ఆ రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో మొదటి, రెండవ ఫేజుల కింద రూ.6,850 కోట్లతో ఈ ప్రాజెక్టుని ప్రారంభించడం జరిగింది. ఇందుకు గాను 2004-2009 సంవత్సరాల మధ్య కాలంలో దాదాపుగా రూ.4000 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. తరువాత 2009-2014 సంవత్సరాల మధ్య కాలంలో రూ.1800 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది.

మంత్రిగారిని నేను ముఖ్యంగా ప్రశ్నించేదేమంటే ఇల్లంతా ఒకరు కట్టేసుకున్నారు, మీరు కిటికీలు పెట్టేసి ఇల్లంతా మాదే అని మీరు చేస్తున్న చందం చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. మొత్తం ప్రాజెక్టుని తీవ్ర దుర్భిక్షం ఉన్న ఆ ప్రాంతంలో అంత ఖర్చు పెట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ఎక్కడా 5 శాతం కంటే ఎక్కువగా ఉండకూడదని రూల్స్ పెట్టి 22 శాతం మాదిరిగా జీఓలు ఇవ్వకుండా చాలా భాగం పూర్తి చేయడంతో పాటు ఆ ప్రాజెక్టుకు ఏదో రకంగా నీళ్లివ్వాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రాజెక్టు కాబట్టి జీడిపల్లి వరకు మొదటి విడతలో అయిపోయింది. కాబట్టి జీడిపల్లి నుంచి నడింపల్లి రిజర్వాయర్ వరకు దాదాపుగా 330 కిలోమీటర్లు మెయిన్ కెనాల్ ఉంది. ఈ మెయిన్ కెనాల్ కూడా దాదాపుగా 70 శాతం పూర్తైంది. కానీ ఈ మధ్యన కొత్త కొత్త వాదనలు వినిపిస్తున్నాయి. మా వాదన ఏమిటంటే ఏ ప్రాంతానికైనా నీళ్లివ్వాలి. కానీ అందులో భాగంగా మెయిన్ కెనాల్‌ని నిర్లక్ష్యం చేసి అటూ, ఇటూ తరలించుకుపోతే దీని ఉద్దేశం మారిపోతుందని మంత్రిగారికి తెలియచేయడంతోబాటు ఏదైతే మెయిన్ కెనాల్ 330 కిలోమీటర్లుందో దీనికి ప్రాధాన్యతనిచ్చి ముందు దానిని పూర్తి చేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. కొత్తగా కొంత మంది మాకు ఈ ప్రాంతంలో నీళ్లివ్వాలి, కెనాల్స్ మీద తిరుగుదాం రండని మంత్రిని ఒకాయన వెంటబెట్టుకు పోవడం, ఆయన అక్కడకు వెళ్లి

మీకు మూడు నెలల్లో నీళ్లిస్తామని హామీలివ్వడం చూస్తే ఆశ్చర్యకరంగా ఉంది. 330 కిలోమీటర్ల మెయిన్ కెనాల్‌ని దృష్టిలో పెట్టుకోకుండా ఈ బ్రాంచ్ కెనాల్స్ ఏవైతే ఉన్నాయో మడకశిర బ్రాంచ్ కెనాల్‌కి దాదాపుగా 17 లిఫ్టులు వస్తాయి. పుంగనూరు బ్రాంచ్‌కెనాల్‌కు దాదాపుగా 16 లిఫ్టులు వస్తాయి. అవికూడా ఆ ప్రాంతంలో ముఖ్యమే. కానీ గ్రావిటీతో ఏవైతే 300 కిలోమీటర్లు వెంటనే అయ్యే ప్రాంతం ఉందో దానిని టేకప్ చేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. బ్రాంచ్ కెనాల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వొద్దని చెప్పడం లేదు. కానీ ఎక్కడా లిఫ్టులు లేకుండా గ్రావిటీతో మెయిన్ కెనాల్ పూర్తి చేస్తే తరువాత బ్రాంచ్ కెనాల్స్‌కు ఇవ్వడానికి బాగుంటుంది అని మంత్రి గారిని కోరుతున్నాను.

చాలా మంది అనంతపురం చాలా దుర్భిక్ష ప్రాంతం, ఇంకేదీ లేదని అంటుంటే రాయచోటి ప్రాంత ప్రజా ప్రతినిధిగా చాలా బాధ కలుగుతున్నది. రాయచోటి ఏ రకమైన దుర్భిక్ష ప్రాంతమంటే కనీసం హార్టికల్చర్ కూడా అక్కడ లేదు. ఏవిధమైన పంట పొలాలూ పండించుకునే పరిస్థితి లేదు. 1600 అడుగులు బోర్లు వేస్తే గానీ నీరు పడని పరిస్థితి ఉంది. అందువల్ల ఈ ప్రాజెక్టుకి నీళ్లిచ్చి ఆదుకోవాలని కోరుతున్నాను. మెయిన్ కెనాల్‌కి గ్రావిటీతో వచ్చే విధంగా ప్రాధాన్యతనిస్తే త్వరగా పూర్తవుతుంది. దాదాపుగా రూ.800 కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. అది ఈ బడ్జెట్‌లో కేటాయిస్తారని కోరుకుంటున్నాను. ఆ ప్రాజెక్టు కింద చాలా తక్కువ గ్రామాలు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఉన్నాయి. వాటికి ఇంత వరకూ ఎలాంటి గైడ్‌లైన్సు ఇవ్వలేదని అక్కడ ఎస్‌డీసీలు చెబుతున్నారు. వాళ్లకు కూడా త్వరగా ఆదేశాలివ్వాలి. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ ప్రాజెక్టుకి ముందరగా రాయచోటి నియోజక వర్గంలో వెలిగండ్ల ప్రాజెక్టు ఒకటుంది. ఆ వెలిగండ్ల ప్రాజెక్టుకి పైన అనేక ప్రాజెక్టులు కట్టడంతో 4 టిఎంసీలతో నిర్మించిన ఆ ప్రాజెక్టుకి నీళ్లు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడింది. దివంగత నాయకులు డా.రాజశేఖర్ రెడ్డి గారు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ ప్రాజెక్టు ప్రారంభించిన మరుసటి రోజే అక్కడ ప్రజలకు మాటిచ్చిన ప్రకారం జీఓ నెం.95 ని విడుదల చేశారు. ఆ జీఓ ఉద్దేశం ఏమిటంటే హంద్రీనీవా కేవలం ఒక అర కిలోమీటరు ముందుగా వెళుతుంది కాబట్టి అక్కడ నుంచి ఒక లింకు కెనాల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పి ఆ లింకు కెనాల్‌కి నిధులు మంజూరు చేయాలని జీఓను కూడా ఇవ్వడం జరిగింది. అది జీడిపల్లి నుంచి గ్రావిటీతో వస్తుంది కాబట్టి దానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి గారిని రిక్వెస్ట్ చేస్తున్నాను. నీళ్లిస్తే ఈరోజున డెడ్ స్టోరేజీతో ఉన్న వాటర్‌తోనే దేశంలోనే అత్యంత ఎక్కువ దుర్భిక్షంగా ఉన్న రాయచోటికి నీళ్లివ్వగలుగుతాం. మూడు టిఎంసిలు ఆ ప్రాజెక్టుకు ఇచ్చి గ్రావిటీతో వచ్చే మెయిన్ కెనాల్‌ను త్వరగా పూర్తి చేయాలని మీ ద్వారా కోరుతున్నాను. 2016, జూన్ అంటున్నారు కాబట్టి దానికి ప్రణాళిక రూపొందించుకుని ఆ టైము మారకుండా ఖచ్చితంగా ఆ ప్రాంతానికి ఆ ప్రాజెక్టు పూర్తయ్యేలా చర్యలు చేపట్టి ఆ లింకు కెనాల్‌ను కూడా త్వరగా పూర్తి చేయాలని మీద్వారా కోరుతున్నాను.

…

డా. దేశాయ్ తిప్పారెడ్డి (మదనపల్లి): అధ్యక్షా, మదనపల్లి చాలా తీవ్ర దుర్భిక్ష ప్రాంతం. మదనపల్లికి సెకండ్ స్టేజ్ హంద్రీ నీవాలో భాగంగా రాయచోటికి నీరు ఇచ్చే సందర్భంలో మాకు పుంగనూరు, మదనపల్లి బ్రాంచ్ కెనాల్స్ కూడా అత్యంత అవసరమైన అంశం. అక్కడ త్రాగు నీరు కూడా లేని పరిస్థితి ఉంది. బోర్లు వేయాలంటే పదమూడు, పద్నాలుగు వందల అడుగులు పోయినా కూడా నీళ్లు పడని పరిస్థితులు ఉన్నాయి. ఇట్లాంటి తీవ్ర దుర్భిక్షంలో రాయచోటికి ఆ బ్రాంచ్ కెనాల్స్ ద్వారా గ్రావిటీతో నీరు వస్తే సంతోషం. అదే ఈక్వల్ టైమ్‌లోనే మాకు కూడా మదనపల్లి బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేయాలి. అది అక్కడ పూర్తి కావాలంటే ముందుగా అక్కడ సమ్మర్ స్టోరేజీ ట్యాంకు చేపట్టాల్సిన అవసరముంది. కాని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు ఇంత వరకు ల్యాండ్ అక్విజిషన్ జరగలేదు. అదే విధంగా అక్కడ 2.2 కిలో మీటర్ల టన్నెల్ ఉంది. ఆ టన్నెల్ నిర్మాణానికి కూడా ఎవరూ ముందుకు రాలేదు. కాబట్టి ఆ టన్నెల్‌ను పూర్తి చేసి, ఆ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను కూడా పూర్తి చేసి మా ప్రాంతానికి కూడా అతి త్వరలో, వారన్నట్లు 2016, జూన్ డెడ్ లైన్ అంటున్నారు, ఆ లోపు పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కి, మదనపల్లికి నీళ్లు ఇస్తే బాగుంటుందని, దాని మీద సత్వర చర్యలు తీసుకోమని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

డా.పెద్దిరెడ్డిగారి రామచంద్రారెడ్డి (పుంగనూరు): అధ్యక్షా, పుంగనూరు మా నియోజకవర్గ హెడ్ క్వార్టర్ మునిసిపాలిటీ. ఆ మునిసిపాలిటీలో ఎనిమిది రోజులకు ఒక రోజు త్రాగు నీరు ఇస్తున్నాము. దాదాపు 1500 అడుగుల నుంచి 1800 అడుగుల వరకు బోర్లు వేస్తే కూడా నీళ్లు వస్తాయనే నమ్మకం లేదు. ఒక వేళ వచ్చినా రెండు మూడు నెలల కంటే మించి ఉంటాయనే నమ్మకం లేదు. మరి అక్కడ హంద్రీనీవాతో నింపడానికి వీలుగా ఒక సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును దాదాపు రూ.33 కోట్లతో మూడు సంవత్సరాల క్రితం నిర్మించడం జరిగింది. కానీ హంద్రీనీవా పూర్తి కాలేదు కాబట్టి ఆ సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ పూర్తయినప్పటికీ నీరిచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అందుచేత తొందరగా హంద్రీనీవాని పూర్తి చేయాలని నేను మంత్రి గారికి విన్నవిస్తున్నాను. మంత్రిగారు కూడా చాలా సుముఖంగా ఉన్నారు. నేను ఎట్లాగైనా ఈ సంవత్సరంలో దీనిని పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా వారు మా జిల్లాకు వచ్చినప్పుడు కూడా పత్రికా ముఖంగా స్టేట్‌మెంట్లు ఇవ్వడం జరిగింది. మరి అక్కడ ఉన్న ఫారెస్ట్ క్లియరెన్స్‌లన్నీ తొందరగా తీసుకొని చిత్తూరు జిల్లాకు నీరిచ్చే విధంగా చేస్తే, ఈ ప్రాజెక్టు క్రింద దాదాపు 6 లక్షల 11 వేల ఎకరాలు ఉన్నది. లక్ష ఎకరాలకు పైగా మాకు చిత్తూరు జిల్లాకు సాగు నీరు రావడమే కాకుండా పుంగనూరు, పలమనేరు, మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాలకు త్రాగునీటి ఇబ్బంది కూడా లేకుండా పోతుంది. దానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాల్సిందిగా నేను గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీమతి గౌరు చరిత రెడ్డి (పాణ్యం): అధ్యక్షా, మాకు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా ప్యాకేజీ 23 క్రింద మెయిన్ కెనాల్ అంతా పూర్తయిపోయింది. కానీ అక్కడ ఫీల్డ్ చానెల్స్‌ని ఏర్పాటు

చేయాలి. మా ప్రక్క నుండే నీళ్లు వెళుతున్నాయి, కానీ మా పొలాలకు ఒక్క ఎకరానికి కూడా నీళ్లు రాని పరిస్థితి ఉంది. దీని వల్ల రైతులు చాలా ఆందోళన చెందుతున్నారు. అవి మైనర్ వర్కులే అధ్యక్షా. ఆ వర్కుల నిమిత్తం ఒక కోటి రూపాయలను శాంక్షన్ చేసినట్లయితే వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుంది. కాబట్టి తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను. రైతులు కూడా పొలాలను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. అంతేగాక మేము ఒక్కటే కోరుతున్నాము, త్వరగా ఫీల్డ్ ఛానెల్స్‌ని ఏర్పాటు చేసి మా ప్రాంత రైతులను ఆదుకోవాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పి. శ్రీనివాసులురెడ్డి (కోవూరు): అధ్యక్షా, తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరేదేమంటే, మా నెల్లూరు జిల్లాలో ఆ రోజు నేను శాసనసభ్యుడిగా ఉండి, పూర్తి డెల్టా ప్రాంతమైన మా ప్రాంతానికి సంబంధించిన సంఘం బ్యారేజీ పనులను ప్రారంభించాము. కానీ అర్థాంతరంగా ఆ పనులు ఆగిపోయి ఉన్నాయి. అలాగే నెల్లూరు బ్యారేజీ పనులు కూడా అసంపూర్తిగా ఆగిపోయాయి. దానికి సంబంధించి గౌరవ మంత్రి గారు కూడా మా జిల్లాలో పర్యటించి అక్కడి పనులను సమీక్షిస్తున్నారు. కాబట్టి త్వరితగతిన ఆ పనులను పూర్తి చేసి మా డెల్టా రైతాంగాన్ని ఆదుకోవాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి.శంకర్ (తంబళ్లపల్లి): నమస్కారం అధ్యక్షా. మాది తంబళ్లపల్లి నియోజకవర్గం, అది రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ బాగా వెనుకబడిన ప్రాంతం. మా తంబళ్లపల్లి నియోజకవర్గంలో సుమారు ఆరు మండలాలు ఉన్నాయి. ఎక్కువ శాతం రైతులు ఉండే ప్రాంతం మా తంబళ్లపల్లి నియోజకవర్గం. త్రాగునీటి కొరకు దాదాపు 1500 అడుగులు బోర్లు వేసినా నీళ్లు పడే పరిస్థితి లేదు. ఒక వేళ ఎక్కడైనా నీళ్లు పడినా 15 రోజులు లేక నెల రోజుల లోపు నిలిచిపోతున్నాయి. త్రాగునీటికే చాలా ఇబ్బంది ఉంది. దాదాపు 40 ఏళ్ల చరిత్రలో ఒక పెత్తందారీ వ్యవస్థతో నలిగిపోయి ఈ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి విషయంలో వెనుకబడి ఉంది. మాకు సాగునీరు, త్రాగునీటికి ఏకైక మార్గం హంద్రీనీవా ప్రాజెక్టు ఒక్కటే. గౌరవ మంత్రి గారు ఈ మధ్యనే హార్స్‌లీహిల్స్‌కి వచ్చారు. ఆ రోజు ఎట్టిపరిస్థితుల్లో సంవత్సరం లోపు తంబళ్లపల్లి నియోజకవర్గానికి, మదనపల్లికి, పుంగనూరుకు నీళ్లు ఇస్తామని అధికారులు చెప్పడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు తంబళ్లపల్లి నియోజక వర్గానికి మూడు నెలల వ్యవధిలో రెండు సార్లు వచ్చారు. ముఖ్యంగా ఈ హంద్రీనీవా పైన ఎట్టిపరిస్థితుల్లోనూ ఒక సంవత్సరంలోపు తంబళ్లపల్లి నియోజకవర్గానికి నీళ్లు ఇస్తామని వారు ప్రకటించడం జరిగింది. గౌరవ మంత్రి గారిని, ముఖ్యమంత్రి గారిని అభ్యర్థించేది ఒక్కటే, ఆరు మండలాల్లో కూడా పెద్ద చెరువులు ఏవైతే ఉన్నాయో, అన్ని చెరువులకూ అనుసంధానం చేయాలి. ఎక్కువ సాగుకి అన్ని విధాలా నీళ్లు వచ్చే ప్రయత్నం చేయాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాము. ఎందుకంటే, రాష్ట్రంలోనే తంబళ్లపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. త్రాగడానికి నీళ్లు లేవు, రైతులందరూ

బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు వలసపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలు పాడుపడిన ప్రాంతాలుగా మారిపోయి, ఎక్కడ ఏ గ్రామానికి వెళ్లినా జనసంచారం లేకుండా పోతోంది. అందుకే గౌరవ మంత్రి గారిని కోరేదేమంటే ఎక్కువగా చెరువులకు, కాలువలకు అనుసంధానం చేసి, మా ఆరు మండలాలలకు నీరు అందించాలని కోరుతూ ఈ అవకాశం ఇచ్చిన తమరికి ధన్యవాదాలను తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం): అధ్యక్షా, స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి మానస పుత్రిక హంద్రీనీవా ఎత్తిపోతల పథకం. మీరు (గౌరవ సభాపతి) ఇరిగేషన్ శాఖా మంత్రిగా, కె.ఇ.కృష్ణమూర్తి గారు, గోపాలకృష్ణారెడ్డి గారు కూడా అప్పుడు ఉన్నారు. ఆ రోజు ఆ మహానుభావుడు ఆ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు, తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి మహానుభావుడు, ఇంజనీరు డా.శివరామ కృష్ణయ్య గారు పథక రచన చేసి ఈ కార్యక్రమాన్ని ముందు పెట్టినప్పుడు, రామారావు గారు Assured Water, నికర జలాల సంగతిని చెప్పండి. హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగుగంగ అని చెప్పి మమ్మల్ని ఈ విధంగా చేస్తున్నారని ఆ మహానుభావుడు సెక్రటేరియట్‌కు వెళ్లి ఆయన కారుకు అడ్డంగా కూర్చున్నారు. ఆ రోజు ముఖ్యమంత్రిగా ఆయన చాలా బాధపడ్డారు. ఆ రోజున తమరు(గౌరవ సభాపతి కూడా ఉన్నారు) రోడ్డు మీద ఆయనకు నిరసన తెలియజేశారు. ఆ మహానుభావుడు ఇంటికి వెళ్లి నికర జలాల సంగతి ఏమిటి, Assured Water సంగతి ఏమిటని చాలా పెద్ద పెద్ద పదాలను వాడారు. ఆ మహానుభావుడు ఇంజనీర్ గారు ఒకే ఒక్క మాట అన్నాడు 'Water is Assured' జలాలు నికరం అన్నాడు. ఎందుకంటే assured water అంటే నేనో, మీరో, మంత్రులో, ముఖ్యమంత్రులో, ప్రధాన మంత్రులో చెప్పే మాట కాదు. బచావత్ ట్రైబ్యునల్ చెప్పాలి. 2004 తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అయిదేళ్లు పరిపాలన చేసింది. ఆ సమయంలో ఉన్న ముఖ్యమంత్రులు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ముందు ప్రభుత్వాల వాదనలు వినిపించి హంద్రీనీవాకి 40 టిఎంసీలు వాటర్ కావాలి, గాలేరు నగరికి 40 టిఎంసీలు కావాలని వాదనలు వినిపించి ఉన్నట్లయితే ఈరోజు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ముందు మన నిఖర జలాలు వచ్చి ఉండేవి. కానీ ఇవాళ రెండూ కూడా ఆల్మట్టి డ్యామ్ ఎత్తు 524 మీటర్లకు పెంచారు. ఆ జడ్జిమెంటు కూడా ఏదైతే ఎస్ఎల్‌పి పిటీషన్ ద్వారా సుప్రీం కోర్టులో ఆగి ఉందో, ఒక ప్రక్క మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు కూడా ఆ పిటిషన్‌లో నుంచి తొందరగా బయటపడి నోటిఫై చేసుకొని ఆల్మట్టి ఎత్తు పెంచాలనే ప్రయత్నం కూడా చేస్తున్నారు.

...

అధ్యక్షా, గౌరవ సభ్యులు ఇందాక అడిగిన అంశానికి సంబంధించి చెప్పవలసింది ఉంది. నేను ఈమధ్యే రాయలసీమ ప్రాంతంలోని నాలుగు జిల్లాలను సందర్శించడం జరిగింది. అత్యంత బాధాకరంగా, దయనీయంగా రాయలసీమ ప్రాంతంలో పరిస్థితి నెలకొని ఉంది. 1500 అడుగుల లోతు వరకు బోర్లు వేస్తే కూడా నీరు పడనటువంటి పరిస్థితి ఉంది. గత పది సంవత్సరాలుగా గ్రామాల్లోని చెరువులకు నీరు అందనటువంటి పరిస్థితి కూడా ఉంది. ఎంత

బాధాకరమంటే, ఘోరాతిఘోరంగా గ్రామాల్లో తాగునీటికి ప్రజానీకం గానీ, పశువులు గానీ పడుతున్న ఇబ్బందుల్లో జూన్ 8వ తేదిన నూతనంగా ప్రభుత్వం ఏర్పడి మంత్రివర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం అయిన తరువాత గౌరవ ముఖ్యమంత్రి గారిచ్చిన ఆదేశాల ప్రకారం మేం గ్రామాల్లోని చెరువులు, కుంటలు, కాలవల మీదకు వెళ్లి అవసరమైతే రెండు కాదు, ఐదు మోటర్లు వేసైనా సరే గ్రామాలకు తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్లడం జరిగింది. మేం వెళ్లి రెండో మోటర్ వేసిన కారణంగా కాలువలన్నీ బ్రీచ్ అయినాయి. మూడవ మోటర్ వేస్తే ఎక్కడిక్కడ కాలువలన్నీ తెగిపోయాయి. ఆ కారణంగా వేసిన కాలువలన్నీ తెగిపోయాయి. అయినా పట్టుదలగా నెలరోజులుగా కాలువలకు అంతరాయాలు, ఇబ్బందులు కల్గినప్పటికీ నీటిపారుదల శాఖ ఇంజనీర్లను, అధికారులను కాలువలపైనే ఉంచి నాలుగు, ఐదు మోటర్లను కాలువలపై ఏర్పాటు చేసిన కారణంగానే ఈ సంవత్సరం కర్నూలు జిల్లాకు 5.30 టి.ఎం.సి.ల నీటిని, అనంతపురం జిల్లాకు 11.50 టి.ఎం.సి.ల నీటిని తీసుకువెళ్లడం వల్ల ఆయా జిల్లాలో మొత్తం 22 వేల బోర్లు రీచార్జ్ అయ్యాయి. అదే విధంగా వై.ఎస్.ఆర్. కడప జిల్లాలోని పులివెందుల నియోజకవర్గం నుంచి రైతులు వచ్చి గౌరవ ముఖ్యమంత్రి గారిని కలిసిన సందర్భంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్న అంశం ప్రస్తావనకు వచ్చింది.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి (రాయచోటి): హంద్రీ-నీవా సుజల స్రవంతి గురించి చెప్పండి మంత్రి గారూ..

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం): శ్రీకాంత్ రెడ్డి గారూ, మీకంటే నేను పట్టుదలగా ఉన్నాను.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి): రాయచోటికి నీళ్లు ఎప్పుడిస్తారు?

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం): ఇస్తాం. రాయచోటి పట్టణానికి నీళ్లిచ్చి అదే నియోజకవర్గంలో ప్రజానీకం చేత పూలు వేయించుకుంటాను, రాయచోటికి వస్తాను, ప్రజానీకానికి నీళ్లిస్తాను.

అధ్యక్షా, వై.ఎస్.ఆర్. కడప జిల్లాలోని పులివెందుల నియోజకవర్గం నుంచి రైతులు గౌరవ ముఖ్యమంత్రి గారి వద్దకు వచ్చి నీళ్లడిగారు. సాగునీటికి కరువై వందల కోట్ల రూపాయల విలువైన చీని చెట్లు ఎండిపోతున్నాయని రైతులు చెప్పడం జరిగింది. ఆ సందర్భంగా శాసనపరిషత్ వైస్ చైర్మన్ గారైన శ్రీ సతీష్ కుమార్ రెడ్డి గారు మరియు బి.టెక్. రవి గార్ల తరపున కూడా రైతులు గౌరవ ముఖ్యమంత్రి గారి వద్దకు వచ్చారు.

అనంతపురం జిల్లా రైతులకు నచ్చజెప్పి, వాళ్లు ఇబ్బందులు పడుతున్నా సరే, కడప జిల్లాలోని పులివెందుల నియోజకవర్గాన్ని కాపాడాలనే ఉద్దేశంతో నీటిని తీసుకువెళ్లి చీని చెట్లను

బతికించే ప్రయత్నం చేస్తే తద్వారా వందల కోట్ల రూపాయల విలువచేసే చీని చెట్లతో పాటు వివిధ పండ్ల తోటలు బతికాయి. నేను ఆ సందర్భంగా పులివెందులకు వెళ్లడం జరిగింది. పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం, లింగాల మండలాల్లోని ప్రజానీకం మాపైన పూలేసి, హారతి పట్టడం జరిగింది. కేవలం ఒక టి.ఎం.సి. నీరిస్తేనే బ్రహ్మాండంగా హారతులు పట్టారు.

అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారి చొరవతో ఈ సంవత్సరం అత్యధిక ప్రాధాన్యతా క్రమంలో హంద్రీ- నీవా, గాలేరు- నగరి, తోటపల్లి, పట్టిసీమ, వెలిగొండ మరియు వంశధార ప్రాజెక్టులను పెట్టడం జరిగింది. ప్రస్తుత బడ్జెట్ నందు ఆయా ప్రాజెక్టుల నిర్మాణ పనులకు గాను కేటాయింపులు కూడా భారీగా చేయడం జరుగుతుందనే విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పడం జరిగింది. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఇంజనీర్లు, నీతో సహా కాలువలపైనే ఉండండని మమ్మల్ని గౌరవ ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.

ఈ సందర్భంగా గౌరవ సభ్యులు శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి గారితో సహా సభకు మీ ద్వారా తెలియజేస్తున్నాను. ప్రతి పదిహేను రోజులకొకసారి హంద్రీ- నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు సంబంధించిన పర్యటనకు వస్తాను. కాలువలకు సంబంధించిన నిర్మాణ పనులను 2015-16 ఈ రెండు సంవత్సరాల కాలంలో పూర్తి చేయడం జరుగుతుంది. హంద్రీ- నీవా ప్రాజెక్టుకు సంబంధించిన ల్యాండ్ అక్విజిషన్ గానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయడం జరుగుతుంది. సత్వరమే మెయిన్ కెనాల్ పనులను పూర్తిచేయాల్సిన ఆవశ్యకత ఉంది. త్వరితగతిన మెయిన్ కెనాల్ పనులను పూర్తి చేసినట్లైతే, ఆటోమెటిక్‌గా బ్రాంచ్ కెనాల్స్ క్రింద ఉన్నటువంటి బోర్స్ రీచార్జ్ అవుతాయి. కాబట్టి, గౌరవ సభ్యులు ప్రస్తావించిన చెరువులనన్నింటినీ పునరుద్ధరించడం జరుగుతుంది. ఈ పార్టీ, ఆ పార్టీ అనేది ప్రధానం కాదు గానీ, మానవత్వంతో ముందుకుపోవడం జరుగుతుంది. ప్రభుత్వం చూపిస్తోన్న చొరవ కారణంగానే ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో బోర్లు రీచార్జ్ అవుతున్నాయి. చెరువులను కాపాడాల్సిన బాధ్యత, చెరువుల్లో నీటిని నింపాల్సిన అవసరం ఉంది. అదే విధంగా ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన భూ సేకరణలో గానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో గానీ సత్వర నిర్ణయాలు తీసుకోవడం కూడా జరుగుతుందని ఈ సందర్భంగా నేను సభకు తెలియజేస్తున్నాను. అటవీ, పర్యావరణ శాఖకు సంబంధించిన అనుమతులు గానీ, రెవెన్యూ శాఖకు సంబంధించిన అనుమతులు కూడా త్వరితగతిన పొందడం జరుగుతుంది. ఎందుకంటే రెండు శాఖలకు సంబంధించిన ఇద్దరు మంత్రులు (మా అన్నలిద్దరు శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి గారు మరియు శ్రీ కె.ఈ.కృష్ణమూర్తి గారు) కూడా రాయలసీమ ప్రాంతానికి చెందినవారే. గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం నుంచి వచ్చారు. రాయలసీమ ప్రాంతానికి సాగునీటిని, తాగునీటిని అందించేందుకు అత్యంత ప్రాధాన్యతనివ్వడం జరుగుతుంది.

అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ఒక విషయం స్పష్టంగా చెప్పడం జరిగింది. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికంటే ముందుగా వై.ఎస్.ఆర్.కడప జిల్లాలోని పులివెందులకు నీటిని తీసుకువెళ్లే కార్యక్రమాన్ని చేపట్టమని గౌరవ ముఖ్యమంత్రి గారు మాకు ఆదేశాలిచ్చారు. తప్పకుండా ఈ సంవత్సరం గాలేరు- నగరి సుజల స్రవంతి క్రింద గండికోట రిజర్వాయర్‌కు నీటిని తీసుకువెళ్లడం జరుగుతుంది. అదే విధంగా హంద్రీ-నీవా సుజల స్రవంతి క్రింద ఫేజ్ -1 నందు ఏవైతే లోపాలు, పాపాలున్నాయో వాటిని సరిదిద్దుతాను మరియు ఫేజ్ -2 నందు గౌరవ సభ్యులు, శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి గారు ప్రస్తావించిన అంశాలన్నీ కూడా పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మెయిన్ కెనాల్‌కు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, మొన్నీమధ్యే నాతోపాటుగా గౌరవ సభ్యులు, శ్రీ నందమూరి బాలకృష్ణ గారు కూడా జీడిపల్లి నుంచి గొల్లపల్లి వరకు కాలువ పైకి వచ్చారు. ఆ సందర్భంగా లోపాలన్నీ మా దృష్టికి వచ్చాయి. శాసనసభ ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసిన తరువాత గాలేరు- నగరి సుజల స్రవంతి పైన, హంద్రీ- నీవా సుజల స్రవంతికి సంబంధించిన పనులపైన అత్యంత ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన ప్రాజెక్టు పనులను పూర్తిచేసేందుకుగాను ప్రభుత్వం ముందుకెళ్తుందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను. ఎందుకంటే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేయడానికి నాలుగేళ్లు పడుతుంది. కాబట్టి కృష్ణా జలాలను మనం ఇవాళ ఆదా చేసుకున్నట్లైతే ఆ నీళ్లను హంద్రీ- నీవా సుజల స్రవంతికి, గాలేరు- నగరి సుజల స్రవంతికి ఇవ్వొచ్చు. అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ఏడు నెలల కాలంలో పూర్తి చేసి గోదావరి జలాలను కృష్ణానదికి తీసుకువస్తాం. తద్వారా ఆ నీటిని శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీ- నీవాకు, గాలేరు- నగరికి ఇచ్చినట్లైతే రాయలసీమ ప్రాంత ప్రజానీకం పడుతున్న కష్టాలు కొంతైనా తీరగలవని ప్రభుత్వం భావిస్తోంది. కాబట్టి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా ప్రత్యేక చొరవ చూపిస్తున్నారనే విషయాన్ని తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

శ్రీ గుమ్మనూర్ జయరామ్ (ఆలూరు): అధ్యక్షా, కర్నూలు జిల్లాలోని ఆలూరు నియోజకవర్గ పరిధిలోని దేవనకొండ మండలం క్రింద దాదాపు 50 వేల ఎకరాలకు హంద్రీ- నీవా సుజల స్రవంతి నుంచి నీరు అందే అవకాశం ఉంది. మండలంలోని పందికోన రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తిచేసినట్లైతే తద్వారా సుమారు 50 వేల ఎకరాల భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉంది. అదే విధంగా మండలంలో తాగునీటి సమస్య కూడా చాలా తీవ్రంగా ఉంది. రిజర్వాయర్ పనులు పూర్తి చేసినట్లైతే తాగునీటి సమస్య కూడా పరిష్కారం అవుతుంది. ఎ.వి.సి. కెనాల్‌కు తుంగభద్ర నుంచి వచ్చే నీళ్ల వల్ల 15,000 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, ప్రస్తుతం కనీసం 500 ఎకరాలకు కూడా నీరు అందనటువంటి పరిస్థితి నెలకొంది. ఎ.వి.సి. కెనాల్‌కు హంద్రీ- నీవా సుజల స్రవంతి నీళ్లను అందించేందుకుగాను గౌరవ నీటిపారుదల శాఖ మంత్రి గారు చొరవ తీసుకున్నారు. కెనాల్‌కు సంబంధించిన 15వ నెంబర్

కిలో మీటర్ దగ్గర 0.60 టి.ఎం.సి. నీళ్లు నిలబడే విధంగా ఒక తూము ఏర్పాటుచేసినట్లైతే 15,000 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. తద్వారా పందికోన రిజర్వాయర్‌కు కూడా నీటిని తరలించినట్లైతే ప్రజానీకానికి తాగునీటిని, సాగునీటిని అందించేందుకు అవకాశం ఉంటుందనే విషయాన్ని తమరి ద్వారా గౌరవ మంత్రి గారి దృష్టికి తీసుకవస్తున్నాను. కాబట్టి, అంశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి (రాయచోటి): అధ్యక్షా, పదిహేను రోజులకొకసారి గౌరవ మంత్రి గారు రాయలసీమ ప్రాంతాన్ని పర్యటిస్తానని చెబుతున్నారు. పదిహేను రోజులకొకసారి కాదు, వారానికి ఒకసారి రాయలసీమ ప్రాంత పర్యటనకు వచ్చినా మాకు సంతోషమే. ముందే నేను ఒక విషయం గురించి చెప్పాను. "ఇల్లంతా పూర్తయిపోయింది గానీ కిటికీలు పెట్టి ఇల్లు మాదని అంటున్నారని" నేను ఇందాక చెప్పాను. మాకు సంతోషమే. ఆ క్రెడిట్ తీసుకునేందుకు ప్రయత్నిస్తే సంతోషమే. ఇప్పుడు కిటికీలు పెట్టవలసిందే. కిటికీలు పెట్టి ఇల్లు మాకే కావాలనుకోవడం కూడా శుభ పరిణామమే. కానీ, ఈ సందర్భంగా ఒక అంశం గురించి చెప్పాల్సి ఉంది. assured water అనే ఒక అంశాన్ని గౌరవ మంత్రి గారు వారి ప్రసంగంలో చెప్పడం జరిగింది. 2004వ సంవత్సరంలో ఆనాటి గౌరవ ముఖ్యమంత్రి గారైన డా.వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నప్పటికే ట్రైబ్యునల్ ఏర్పాటు కావడమనేది జరిగింది. నన్ను గౌరవించి మంత్రి పదవి ఇచ్చినారు, నేను మంత్రి పదవిలో సంతోషంగా ఉన్నానని చెప్పుకునే ప్రయత్నాన్ని శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు గారు చేసినారు తప్పితే 1994వ సంవత్సరం నుండి 2004వ సంవత్సరం వరకు 30% ప్రాజెక్టు పనులను పూర్తిచేసినట్లైతే ఈరోజున అస్యూర్ వాటర్ వచ్చే అవకాశం ఉండేది. ఆ అస్యూర్ వాటర్ రాకపోవడానికి గల కారణం వీళ్లే అనే మాటను సభలో ప్రస్తావించడం లేదు. ఆల్మట్టి డ్యామ్ కూడా వారి ప్రభుత్వ హయాంలోనే నిర్మించబడింది. తద్వారా ఏ రకంగా రాయలసీమ ప్రాంతానికి వారి హయాంలో అన్యాయం జరిగిందనే విషయాలను ప్రస్తావించకుండా ఏదో మాట్లాడుతున్నారు.

అధ్యక్షా, మా నాయకుడు రాజశేఖరరెడ్డి గారు రాయలసీమకు సంబంధించిన నీటి విషయంలో కారుకు అడ్డుపడ్డారు. అందుకు కారణం దుర్భిక్ష ప్రాంతమైన రాయలసీమకు నీళ్లివ్వమని కారుకు అడ్డుపడ్డారు గానీ వేరే ఉద్దేశంతో కాదు. అదే విధంగా మేం కారు పైన చెప్పులు విసిరేయలేదనే అంశాన్ని కూడా గౌరవ మంత్రి గారు దృష్టిలో ఉంచుకోవాలి. వాళ్ల నాయకుడికి ఏ రకమైన గౌరవం ఇచ్చారో ఒకసారి ఆలోచించండి. ఆ విషయాన్ని మరచిపోతే ఎట్లా?

అధ్యక్షా, మేం ఈ సందర్భంగా ఒకటే గౌరవ మంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను. హంద్రీ- నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిస్తానని చెప్పడం సంతోషదాయకమే.

నిర్మాణ పనులకు సంబంధించిన సమీక్షను పదిహేను రోజులకొకసారి రివ్యూ రూపంలో చేస్తానని చెప్పడం కూడా సంతోషదాయకమే. అదే విధంగా లింక్ కెనాల్‌కు 3 టి.ఎం.సి.ల నీటిని వెలిగల్లు ప్రాజెక్టుకు ఇవ్వండి. గ్రావిటీకి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వమని మా పార్టీ తరపున ప్రభుత్వాన్ని గట్టిగా అడుగుతున్నాం. ఆ అంశాల వరకు గౌరవ మంత్రి గారు గట్టిగా ప్రయత్నం చేసి సత్వర చర్యలు చేపట్టవల్సిందిగా తమరిద్వారా కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం): అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగినట్టుగా ఒక్క వెలిగల్లు ప్రాజెక్టే కాదు. గౌరవ సభ్యులు చెరువులు, బ్రాంచ్ కెనాల్స్ గురించి ప్రస్తావించారు. అన్ని పనులను సత్వరమే పూర్తిచేస్తాం. అధ్యక్షా, శ్రీకాంత్ రెడ్డి గారు ఒక సమస్య గురించి సభ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు గాను నేను సంబంధిత సమాచారాన్ని చదివి వినిపించదలిచాను.

**Before the Krishna Water Dispute Tribunal, New Delhi, Interlocutory Application No. 1 of 2005.**

The States of Karnataka, Andhra Pradesh and Maharastra were party to the I.A. కృష్ణా వాటర్ ట్రైబ్యునల్ చైర్మన్ గారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన సమాచారాన్ని సభ ముందు చదివి వినిపిస్తున్నాను.

"Memo of statement on behalf of the State of Andhra Pradesh. It is submitted that the following five projects have been planned by the State of Andhra Pradesh against the availability of surplus water of River Krishna. 1. Velugonda, 2. Handri-neeva Sujala Sravanti, 3. Galeru Nagari Sujala Sravanti, 4. Kalvakurti Lift Irrigation, and 5. Nettempadu Lift Irrigation. The State of Andhra Pradesh shall not claim any right to such surplus water by reason only of the use or the proposed use thereof in the said projects including any right to the continued use of such water because communities have grown up relying on such use. All such water will be available for equivalent allocations to the parties by this Hon'ble Tribunal in such manner as this Hon'ble Tribunal deems fit".

(Principal Secretary, Irrigation and CADA Department, Government of Andhra Pradesh, Hyderabad" అని సంతకం చేసి Hon'ble Chairman of Krishna Water Dispute Tribunal, New Delhi వారికి పంపించడం జరిగింది).

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి (రాయచోటి): మెమో నందు ఏ తేది ఉందో చెప్పండి.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు (మైలవరం): అధ్యక్షా, ఏ మాత్రం కూడా హక్కులు కోరబోమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ముందు ఇచ్చిన కాగితం ఇది.

(కాగితం గౌరవ సభాపతి గారికి చూపించారు). ఈ పాపాలన్నీ వారి హయాంలో వీళ్లు చేసి, మళ్లీ మాపైన ఎదురుదాడి చేస్తున్నారు.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి(రాయచోటి): అధ్యక్షా, ఒక నిమిషం అవకాశం ఇవ్వండి.

మిస్టర్ స్పీకర్: శ్రీకాంత్ రెడ్డి గారూ, మాట్లాడండి.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి (రాయచోటి): అధ్యక్షా, గౌరవ మంత్రి గారు సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. అంటే గౌరవ మంత్రి గారు ప్రాజెక్టుల పైన స్టడీ చేస్తారనే విషయాన్ని ఒక రకంగా మాట్లాడితే, మేం ఒప్పుకోవడం కూడా దురదృష్టకరమే అవుతుంది. ఆనాడు రాష్ట్ర ప్రభుత్వం ఆ రకమైన స్టేట్‌మెంట్ ఎందుకు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌కు ఇవ్వాల్సి వచ్చిందంటే, 2005వ సంవత్సరంలో హంద్రీ- నీవా, గాలేరు- నగరి, వెలిగొండ, కల్వకుర్తి, బీమా వంటి ప్రాజెక్టులన్నీ కూడా కరువు ఉన్నటువంటి ప్రాంతాల్లో ఉన్నాయి. కరువు ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందించాలనే ఉద్దేశంతో స్వర్గీయ రాజశేఖరరెడ్డి గారు ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకుంటే అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వీళ్లు ప్రాజెక్టుల నిర్మాణానికి అడ్డుపడ్డారు. మీరు అక్కడ ప్రాజెక్టు కట్టడానికి వీలులేదనే నెపంతో వీళ్లు ఆనాడు అడ్డుపడ్డారు. ఆ సందర్భంలో ప్రభుత్వం తరఫున ఒక స్టేట్‌మెంట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

...

1994-2004 వరకు వీరు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకపోవడం దురదృష్టకరమైతే, ఆ కాలంలో ప్రాజెక్టులు కట్టకూడదు అంటూ దురదృష్టవశాత్తు ట్రైబ్యునల్ సూచించింది. కానీ ఈ ప్రాజెక్టుల నిర్మాణం ఆగిపోతే ఇబ్బందులు ఏర్పడతాయని ప్రాజెక్టులను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఆ లేఖను ఇవ్వడం జరిగింది. గౌరవ మంత్రి గారు వారి మనసులో మాటను చెబితే చాలా సంతోషంగా ఉంటుంది. ఆ విషయం చెప్పకుండా బురద చల్లే మాటలు చెప్పడం దురదృష్టకరం. అప్పట్లో కర్నాటక ప్రభుత్వం సుప్రీంకోర్టుకు నియమించిన న్యాయవాదులకు వీరు సరైన కౌంటర్ ఇచ్చుకోలేక ఆనాటి ఓ.ఎస్ లకు ఫెల్యూర్ అయిపోయారు. ట్రైబ్యునల్‌ముందు సరైన వాదనలు వినిపించలేకపోయారు.

( ఈ సందర్భంలో నీటిపారుదల శాఖా మంత్రి శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు తమ స్థానం నుండి లేచి నిలుచున్నారు. )

ట్రైబ్యునల్‌ముందు సరైన వాదనలు వినిపించకపోగా, ట్రైబ్యునల్ ఏర్పాటైన తరువాత విధిలేని పరిస్థితుల్లో, ప్రాజెక్టులను పూర్తి చేయాలనే సదుద్దేశంతో నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయంపై బురదజల్లే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమో మనస్ఫూర్తిగా చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు(మైలవరం): అధ్యక్షా, గ్రామీణ ప్రాంతాలైన పల్లెల్లో మనం చూస్తుంటాం మనకు తెలుసు. మన పొలానికి ఎగువున ఉన్న రైతు ఉన్న తూముకన్నా మరికొంత తూము సైజు పెంచితే మన పొలానికి నీళ్లు రావు. ఆతూము సైజు పెంపుదలపై సామాన్య రైతు కూడా ఊరకే ఉండడు. పెంపుదలను అడ్డుకునేందుకు తనవెంట కర్రను తీసుకెళుతాడు. ఇంకేమైనా చేస్తాడు. ఆ ఎగువ రైతుపై దెబ్బలాడతాడు. మన రాష్ట్రానికి ఎగువున ఉన్న కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు అక్రమ కట్టడాలు కడుతూ ఉంటే మనం అడ్డుకోవాలి, ఆపుకోవాలి. అలా కాకుండా మీరు ప్రాజెక్టులు కట్టుకోండి మేము జలయజ్ఞం చేసుకుంటాం అంటూ ఇలాంటి లేఖలు ఇవ్వడం వలన మనం ఉరి వేసుకొనే పరిస్థితి వచ్చింది. ఏది ఏమైనా సుప్రీంకోర్టు ముందు ఎస్ఎల్పీ పెండింగ్‌లో ఉంది. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు నాలుగు రాష్ట్రాలు వాదనలు వినిపిస్తున్నాయి. కర్నాటక, మహారాష్ట్ర ఇది మీ రెండు రాష్ట్రాలకు సంబంధించిన గొడవ, మేము వెళ్లిపోతాం నోటిఫై చేయమని సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తున్నాయి. ఏదేమైనాసరే, హంద్రీనీవా, గాలేరు నగరి, రాయలసీమకు ప్రాణాధారం. కచ్చితంగా పట్టిసీమ ప్రాజెక్టును ఏడు నెలల్లో పూర్తి చేస్తాం. ఆమేరకు రాయలసీమలో హంద్రీనీవా, గాలేరునగరి ప్రాజెక్టులు పూర్తిచేసి రాయలసీమను కాపాడుకుంటామని తెలియజేస్తున్నాను.

**MR. SPEAKER: Question No. 743 (10), Minister for Rural Development and Housing.**

ప్రశ్న నెం.743 (10) శ్రీ గొనుగుంట్ల సూర్యనారాయణ – ఎమ్మెల్యే.

గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా?

(అ) 2004 నుండి 2014 వరకు రాష్ట్రంలో జిల్లాల వారీగా మంజూరు చేసి, పూర్తి చేసిన పక్కా గృహాల సంఖ్య ఎంత?

(ఆ) కొందరు అనర్హులైన వ్యక్తులకు పక్కా గృహాలు మంజూరు అయిన విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

(ఇ) సదరు గృహాల నిర్మాణంలో జరిగిన అక్రమాలపై సిఐడి దర్యాప్తు జరిపి, నివేదికను సమర్పించిన విషయం వాస్తవమేనా?

(ఈ) అయినచో, అందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలెవ్వి?

**గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి (డా. కిమిడి మృణాళిని ):**

అ) 2004-14 సంవత్సరాల మధ్య కాలంలో మంజూరు చేసి, పూర్తి చేసిన గృహాల సంఖ్య జిల్లాల వారీగా ఈ క్రింది విధంగా ఉంది.

| జిల్లా | మంజూరు చేసినవి | పూర్తి చేసినవి |
|---|---|---|
| శ్రీకాకుళం | 334804 | 223185 |
| విజయనగరం | 393208 | 269327 |
| విశాఖపట్టణం | 411968 | 309288 |
| తూర్పు గోదావరి | 475168 | 369760 |
| పశ్చిమ గోదావరి | 328714 | 238557 |
| కృష్ణా | 266302 | 189217 |
| గుంటూరు | 323371 | 247815 |
| ప్రకాశం | 279012 | 207532 |
| నెల్లూరు | 322013 | 192181 |
| చిత్తూరు | 474617 | 336391 |
| కడప | 368990 | 276668 |
| అనంతపురం | 499718 | 362593 |
| కర్నూలు | 492883 | 341781 |
| మొత్తం | 4970768 | 3564295 |

ఆ) అవునండీ.

ఇ) లేదండీ.

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

(ఈ సందర్భంలో ప్రతిపక్ష నాయకులు శ్రీ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడేందుకు మైకు ఇవ్వాల్సిందిగా కోరుతూ తమ స్థానం నుండి లేచి నిలుచున్నారు. ఆయనకు మైకు యివ్వబడింది.)

శ్రీ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి (పులివెందుల): అధ్యక్షా, మంత్రిగారు గొప్ప కథ చెప్పారు. వాస్తవాలు వక్రీకరించడం ఎలా చేయగలుగుతారన్నది చంద్రబాబునాయుడుగారి దగ్గర నుండి బాగా ట్యూషన్ తీసుకున్నారు. నిజాలు కూడా కొంచెం నోట్ చేసుకోండి మంత్రిగారు.. మంత్రిగారు మాట్లాడుతూ, 2005వ సంవత్సరం రాజశేఖరరెడ్డి గారి హయాంలో బచావత్ ట్రైబ్యునల్‌కు ఇచ్చిన కాపీనీ చదివి వినిపించారు. చంద్రబాబునాయుడుగారి 9సంవత్సరాల కాలంలో ఎన్‌డీఏ ప్రభుత్వంలో చక్రం త్రిప్పుతున్న కాలంలోనే, ఆనాటి ప్రభుత్వంలో నలుగురు మంత్రులు పనిచేస్తున్న కాలంలోనే, దేవగౌడ గారు ప్రధానమంత్రిగా కొనసాగుతున్న కాలంలోనే, ఆల్మట్టి ప్రాజెక్టును మొదలు పెట్టడమే కాదు, రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి అయ్యేనాటికి పూర్తి కూడా అయిపోయేవి. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును పెంచడమే కాదు, పూర్తిచేశారు. అటువంటి పరిస్థితుల్లో నికర జలాలమీద మనకున్న అధికారం, నికర జలాల నుండి మన కేటాయింపులు అన్నీ సరిదిద్ది ఉన్న పరిస్థితుల్లో నిఖర జలాలపై మనకు కేటాయింపులు లేవు, కాబట్టి లేనప్పటికీ రాయలసీమ ప్రాంతం, ఆ తరువాత నెల్లూరు, ప్రకాశం వరకున్న ఆరు జిల్లాలకు అన్యాయం జరుగుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనైనా అన్యాయాన్ని కాపాడాలనే ఆలోచన ఆయనలో ఉండేది. చంద్రబాబునాయుడుగారి హయాంలో ఇదే గాలేరు-నగరి, ఇదే హంద్రీ నీవ, ఇదే వెలుగొండ ప్రాజెక్టులు కట్టి ఉంటే, అసలు బచావో ట్రైబ్యునల్ ద్వారా ఖచ్చితంగా మనకు నిఖర జలాలపై వాటా కూడా దక్కేది.

(ఈ దశలో ప్రతిపక్ష పార్టీ సభ్యులు షేం.. షేం.. అన్నారు. )

చంద్రబాబునాయుడుగారి తొమ్మిది సంవత్సరాల కాలంలో ఖర్చు చేసింది రూ.17కోట్లు. హంద్రీనీవాకు ఖర్చు చేసింది రూ.13కోట్లు. వెలిగొండ ప్రాజెక్టుకు ఖర్చు చేసింది కేవలం రూ.13కోట్లు. అంటే మీరు ఇచ్చిన ఆ కేటాయింపులు ఆశాఖ ఉద్యోగస్తులకు సంబంధించిన జీతాలు, కార్యాలయాలు నడపడానికి కూడా సరిపోలేదు. అటువంటి కేటాయింపులతో ప్రాజెక్టులు పూర్తి కాకపోతే రాయలసీమను, ప్రకాశం, నెల్లూరు వరకున్న ఆరు జిల్లాలు పూర్తిగా నాశనమైపోతాయని చెప్పి ఆ దివంగతనేత ప్రియతమ నాయకులు రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత, మీరు రూ.13కోట్లు కేటాయించిన ఇదే హంద్రీనీవా ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన తీసుకొన్నారు. రూ.6,800కోట్లు అవసరం కాగా, రూ.5,800కోట్లు ఖర్చు చేశారు. దాదాపు 85శాతం పూర్తయ్యింది. కేవలం మరో రూ.1,000కోట్లు ఖర్చు చేస్తే ఆ ప్రాజెక్టు పూర్తవుతుంది. ఆ గొప్పతనం దివంగతనేత, ప్రియతమ నాయకులు రాజశేఖరరెడ్డి గారిదని చెప్పుకోడానికి గర్వపడుతున్నాం.

( ఈ దశలో అధికారపక్షం నుండి అంతరాయం. )

మిస్టర్ స్పీకర్ ః ప్లీజ్.. కంక్లూడ్..

శ్రీ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి (పులివెందుల)ః అదేవిధంగా గాలేరు-నగరి ప్రాజెక్టుకు సంబంధించి, తొమ్మిది సంవత్సరాల మీ పరిపాలనలో కేవలం రూ.17కోట్ల రూపాయలు కేటాయింపులు చేయగా, ఆ దివంగత నేత ప్రియతమ నాయకుడు రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత ఆ ప్రాజెక్టులపై రూ. 4,600కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. మరో రూ.260కోట్లు ఖర్చు చేస్తే పూర్తయ్యే పరిస్థితి ఉంది. అంటే 75-80 శాతం వరకు పూర్తయ్యాయి. మిగిలింది హంద్రీనీవాలో 10-12శాతం, గాలేరు నగరిలో 20-25శాతం, ఇవి కాకుండా వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి చూస్తే ఇవే లెక్కలు కనిపిస్తాయి. ఆ దివంగతనేత ప్రియతమ నాయకుడు రాజశేఖరరెడ్డి గారి హయాం నుండి ఇప్పటి వరకు రూ.3,000కోట్ల రూపాయలు ఖర్చయ్యింది.

మిస్టర్ స్పీకర్ ః ( బెల్ ) ప్లీజ్.. కంక్లూడ్..

శ్రీ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి (పులివెందుల)ః పూర్తి చేసేందుకు కావల్సింది రూ.4,500కోట్లు కాగా, ఖర్చుచేసింది రూ. రూ.3,000కోట్లు. మీ హయాంలో 9సంవత్సరాల కాలంలో ఖర్చు చేసింది. రూ.13కోట్లు దానికి మరో రూ.1500కోట్లు ఖర్చుచేస్తే ఆ ప్రాజెక్టు పూర్తవుతుంది.

మిస్టర్ స్పీకర్ః (బెల్ ) ప్లీజ్.. కంక్లూడ్.. ఓకే.. మినిష్టర్ గారు..

శ్రీ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి (పులివెందుల)ః ఇవి వాస్తవాలైతే, మీరు ఈరోజు చేస్తుందేమంటే ఇంతకు మునుపు శ్రీకాంత్‌రెడ్డిగారు చెప్పినట్లు ఇల్లు మొత్తం కట్టేసిన తరువాత కిటికీలు పెట్టి...

(ఈదశలో మైక్ కట్ చేయబడింది. )

మిస్టర్ స్పీకర్ ః మినిస్టర్ గారు..

(ఈ సందర్భంలో నీటిపారుదలశాఖా మంత్రి శ్రీ దేవినేనిఉమామహేశ్వరరావు గారు మాట్లాడేందుకు తమ స్థానం నుండి లేచారు.)

(ప్రతిపక్ష నాయకునికి మాట్లాడేందుకు మైక్‌ను కొనసాగించాల్సిందిగా గౌరవ సభాపతిని కోరుతూ ప్రతిపక్ష సభ్యులందరూ తమ తమ స్థానాలు నుండి లేచి నిలుచున్నారు.. )

...

(ప్రతిపక్ష సభ్యులు కొంతమంది పోడియం వద్దకు వచ్చి స్పీకర్‌గారి ఏకపక్ష వైఖరి నశించాలి, వాస్తవాలను మరుగుపరుస్తున్న మంత్రి, ప్రతిపక్ష నాయకుడు మాట్లాడటానికి మైకు ఇవ్వాలని నినాదాలు చేశారు)

MR. SPEAKER: Minister గారు, Please be brief.

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

(ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి) సమయం అయిపోతుంది, దయచేసి కూర్చోండి. Please go back to your seats. You are repeating. You have completed your subject. మినిష్టరు గారూ మట్లాడండి.

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు(మైలవరం): అధ్యక్షా, మొబిలైజేషన్ అడ్వాన్సులలో తిన్న డబ్బులు తిరిగి వెనక్కి ఇవ్వాల్సి వస్తుందోనని వై.ఎస్. ప్రభుత్వం ఆ లేఖ ఇచ్చింది.

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

MR. SPEAKER: Please be seated. No.

శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు(మైలవరం): తిన్న మొబిలైజేషన్ అడ్వాన్సులన్నీ కూడా ఎక్కడ కక్కాల్సి వస్తుందోనని అవన్నీ కూడా...

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్: మంత్రిగారు మళ్లీ రిపీట్ చేస్తున్నారు, వినండి. టైం లేదు. ఇప్పుడు హౌస్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉంది. దయచేసి కూర్చోమనండి, దయచేసి కూర్చోండి.

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు(మైలవరం): అధ్యక్షా, ఆ లేఖ ఇచ్చి, రాయలసీమలో హంద్రీనీవా గాని, గాలేరు-నగరి గాని, ఆ ప్రాజెక్టులకు నికర జలాలు రాకుండా, డబ్బులు రాకుండా చేశారు. ఇవాళ ఆ లేఖ ఇవ్వకుండా ఉన్నట్లయితే హంద్రీనీవాకు, గాలేరు-నగరిలకు నికర జలాలు వచ్చి ఉండేవి.

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్: ఇది అసెంబ్లీ క్వశ్చన్ దయచేసి కూర్చోండి. Please go back to your seats.

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు(మైలవరం): అధ్యక్షా, గండికోట ప్రాజెక్టు.. గాలేరు-నగరికి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. హంద్రీనీవా ఎత్తిపోతలను కూడా స్వయంగా గౌరవ ముఖ్యమంత్రిగారే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తే, వీళ్లు పనులు పూర్తి చేయకుండా జలయజ్ఞంలో ఇష్టారాజ్యంగా డబ్బులు దోచుకున్నారు. ఇవాళ వాళ్లు ఏవిధంగా మాట్లాడుతున్నారంటే ఎక్కువ కేటాయింపులు చేసింది ఆ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కాదు,

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరు మీద డబ్బులను ఇష్టారాజ్యంగా తిన్నారు. సక్రమంగా ఆ డబ్బులను ఖర్చు చేసి ఉంటే, ఈరోజు ఆ ప్రాజెక్టులు పూర్తై ఉండేవి. కాలువలు తవ్వేటప్పుడు కూడా ఏమాత్రం కూడా కాలువలు పూర్తి చేయాలని గానీ, కాలువలు క్వాలిటీతో పనిచేయాలని గానీ వీళ్లు పని చేయలేదు. జలయజ్ఞం పేరు మీద ధనయజ్ఞం చేసి...

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్: నో, దయచేసి కూర్చోండి. Please go back your seats.

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు(మైలవరం): అధ్యక్షా, వీళ్లు ఇవాళ చాలా కథలు చెబుతున్నారు. ఈరోజు జగన్మోహన్‌రెడ్డిగారు బాగా, చాలా చక్కగా అభినయం చేసి చెబుతున్నారు. ఎట్టి పరిస్థితిలో గాలేరు-నగరిని, హంద్రీనీవా ఎత్తిపోతల పథకాన్ని కూడా పూర్తి చేస్తాం.

(పోడియం దగ్గరున్న ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

**MR. SPEAKER: All the papers included in the agenda are deemed to have been laid on the Table.**

**PAPERS LAID :**

1. "A copy in each of 13th and 14th Annual Reports of Southern Power Distribution Company of Andhra Pradesh Limited for the years 2012-2013 and 2013-2014 as required under Section 619 - A(3) of the Companies Act, 1956".

2. "A copy in each of 13th and 14th Annual Reports of Eastern Power Distribution Company of Andhra Pradesh Limited for the years 2012-2013 and 2013-2014 as required under Section 619 - A(3) of the Companies Act, 1956."

I have an announcement to make.

**ANNOUNCEMENT**

I am to announce to the House that copies of the Budget Speech in English and Telugu are circulated in the House for the Budget Year 2015-2016 will be presented to the House by the Minister for Finance.

Members are requested to collect the rest of the Budget publications from the Members Service counter soon after the Budget is presented.

Now, the House is adjourned for 15 minutes for tea break.

(The House then adjourned at 11.43 a.m.)

* * *

(స్వల్ప విరామానంతరం సభ మధ్యాహ్నం గం.12.15 నిమిషాలకు పునఃప్రారంభమైంది, గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

MR.SPEAKER: Now, the presentation of Annual Financial Statement for the year 2015-2016 by the Minister for Finance.

## 12వ తేదీ మార్చి, 2015న గౌరవనీయులైన ఆర్థికశాఖామాత్యులు శ్రీ యనమల రామకృష్ణుడుగారు చేసిన బడ్జెట్ ప్రసంగం

**అధ్యక్షా!**

తమ అనుమతితో 2015-16 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ సమర్పించనున్నాను.

నా బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించేముందు భారతరత్న డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారి మాటలను తమకు గుర్తుచేస్తున్నాను.

> ***నేను కలలు గంటున్న ఆదర్శసమాజం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల మీద ఆధారపడి ఉంటాయి. ఆ ఆదర్శసమాజం గతిశీలకంగా ఉండాలి. సమాజంలో ఒక భాగంలో సంభవిస్తున్న పరివర్తన తక్కిన అన్ని విభాగాలకూ ప్రసరించాలి.***

2015-16 సంవత్సరానికి నేను సమర్పిస్తున్న బడ్జెట్ అటువంటి సమానత్వాన్నీ, గతిశీలత్వాన్నీ, సమగ్రతనీ సాధించే దిశగా వేస్తున్న ముందడుగుగా విన్నవించుకుంటున్నాను.

2. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇది రెండవ బడ్జెట్. గత బడ్జెట్ సమర్పిస్తున్నప్పుడు నేను విన్నవించిన విధంగా రాష్ట్ర విభజనకు ముందుకాలమంతా పాలనావ్యవస్థ కుంటుబడడం, స్పష్టమైన దిశానిర్దేశం లేకపోవడం, అభివృద్ధి గురించిన ప్రణాళికలు లేకపోవడం గౌరవ సభ్యులకు తెలిసిన విషయమే. గత కొన్నేళ్ళుగా నిరంతర ఆందోళనతో, సమ్మెలతో పౌరజీవనం అతలాకుతలమైన తర్వాత రాష్ట్రం విభజించబడ్డ తీరుతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా తయారయ్యింది. అంతేకాక రాష్ట్రవిభజన వల్ల ప్రస్తుత ప్రభుత్వం ఎటువంటి దురదృష్టకర పరిస్థితిని తలదాల్చవలసి వచ్చిందో, వివిధ రకాల సమస్యలనూ, సంక్లిష్టతలను ఎదుర్కొనవలసి వచ్చిందో కూడా నేను గతంలో గౌరవ సభ్యుల దృష్టికి తీసుకువచ్చాను.

3. ఈ సందర్భంగా నేను గతంలో విన్నవించిన కొన్ని అంశాలను పునరుక్తమైనా, మరొకసారి ప్రస్తావిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పొందుపరచబడ్డ అవకాశాలు మొక్కుబడిగా చూపించినవే తప్ప, రాష్ట్ర విభజన వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కోల్పోవలసిన అవకాశాలను ఏ విధంగానూ పూరించగలిగినవి కావు. కొత్త రాష్ట్రానికి అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలు, ఆదాయకల్పన, వైద్యవిద్యా సంస్థలు, పరిశోధన మరియు శిక్షణ సదుపాయాలు, మౌలిక సామాజిక సదుపాయాలు కొత్త రాష్ట్రం మనుగడకు ఏమాత్రం సరిపోవు. కొత్త రాష్ట్రం యొక్క రాజధానిని కూడా నిర్ణయించకుండా రాష్ట్రాన్ని విభజించాలని తీసుకున్న నిర్ణయం బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా చెప్పవచ్చు.

4. ఇంకొక అంశాన్ని కూడా మరొకసారి తమకు విన్నవించుకుంటున్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1995–96లో శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో చేపట్టిన రెండవదశ సంస్కరణలు దాదాపు ఒక దశాబ్ద కాలంపాటు దారిద్ర్యనిర్మూలన కార్యక్రమాల ద్వారా, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో కొనసాగి రాష్ట్రంలో మరిన్ని ఆర్థిక సంస్కరణల అమలు కోసం కృషి చేశాయి. 90ల మధ్యకాలంలో సమాచార విప్లవం పర్యవసానంగా భూమి, జలసంపద, అటవీ సంపదల భాగస్వామ్య నిర్వహణలో గొప్ప పురోగతి సాధ్యమయింది. అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక బృందాలు, డ్వాక్రా సంఘాలు సాధించిన విజయం ప్రపంచ వ్యాప్తంగా మార్మోగడమే కాక, వారు సాధించిన సామాజిక గతిశీలత, సాధికారికత, సామర్థ్య కల్పన దారిద్ర్య నిర్మూలన వ్యూహంలో ప్రధానపాత్ర పోషించింది. ఈ వ్యూహాలు ఆర్థిక సంస్కరణ రంగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గొప్ప పేరును తీసుకురావడమే కాక, దేశంలోనూ, బయటా కూడా ఎన్నో ఆశలు రేకెత్తించాయి.

5. అయితే నేను గతంలో తమకు వివరించిన విధంగా ఒకప్పుడు చేపట్టిన ఈ బృహత్తర ఉద్యమం 2004 తరువాత ప్రభుత్వం నుండి తగినంత సహాయం లభించకపోవడంతో నెమ్మదిగా వన్నె తగ్గడం మొదలయింది. 2001లో మానవ అభివృద్ధి సూచికల ప్రకారం అఖిల భారతస్థాయిలో 10వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం 2008 నాటికి 15వ స్థానానికి పడిపోయింది.

6. ప్రణాళికేతర ఆదాయానికి సంబంధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మిగులు ఆదాయ రాష్ట్రంగా ఉండేదని నేను గతంలో మీకు విన్నవించాను. కానీ దురదృష్టవశాత్తూ రాష్ట్ర విభజన వల్ల శేషాంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రణాళికేతర రంగంలో పెద్ద రెవిన్యూ లోటును సంతరించుకున్న రాష్ట్రమయింది. రాష్ట్ర ఆర్థికపరిస్థితి మీద రాష్ట్ర విభజన తీవ్ర ప్రభావాన్ని చూపించిన విషయం గౌరవసభ్యులకు తెలిసిందే. కాబట్టి, ఒక సక్రమమైన అంచనాతో ప్రణాళికను రూపొందించుకోవడానికి అవసరమైన వనరులు రాష్ట్రానికి లేకుండా పోయాయని చెప్పక తప్పదు. 14వ ఆర్థికసంఘం సిఫారసుల మేరకు రాగల కేటాయింపుల్ని, 2015–16 కేంద్ర బడ్జెట్ ప్రకారం మనకు రానున్న వనరుల్ని దృష్టిలో పెట్టుకున్న తర్వాత కూడా రాష్ట్రం రెవిన్యూ

లోటుతో సతమతమవుతున్నది. ఈ రెవిన్యూ లోటు 14వ ఆర్థిక సంఘం కేటాయింపులు అందగల చివరి సంవత్సరం దాకా ఇట్లానే కొనసాగనున్నది. రెవిన్యూ వ్యయాన్ని సమకూర్చుకోవడం కోసం మనం మరిన్ని రుణాలు చేపట్టవలసిన అవసరం ఉన్నందువల్ల మన రుణభారం, ఆర్థికలోటు రానున్న కాలంలో మరింత పెరగనున్నాయి. మనం నూతన రాజధాని నిర్మించుకోవడం కోసం రూ.1,00,213 కోట్ల ఆర్థిక సహాయం, తక్కిన కీలక సదుపాయాల కల్పన కోసం రూ.41,253 కోట్ల ఆర్థిక సహాయం అందించవలసిందిగా 14వ ఆర్థిక సంఘాన్ని కోరాం. కానీ 14వ ఆర్థిక సంఘం మనకు రెవిన్యూ లోటు గ్రాంటుగా రూ.22,113 కోట్లు, విపత్తు నిర్వహణ కింద రూ.1823 కోట్లు కేటాయించింది. పట్టణ స్థానిక సంస్థల కోసం మనం ప్రతిపాదించిన రూ.29,805 కోట్లకు గాను రూ.3,636 కోట్లు, గ్రామీణ స్థానిక సంస్థల కోసం ప్రతిపాదించిన రూ.18,633 కోట్లకు గాను రూ.8,654 కోట్లు మాత్రమే కేటాయించింది.

7. ఈ ఏడాది ప్రకృతి కూడా మన పట్ల కనికరం చూపలేదు. రాష్ట్రాన్ని హుద్‌హుద్ తుపాను అంతలాకుతలం చేసింది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం హుద్‌హుద్ తుపాను వల్ల వాటిల్లిన నష్టం 11 బిలియన్ యుఎస్ డాలర్లుగా అంచనా వేయబడింది. వర్షపాతం 36 శాతం తక్కువ ఉండడంతో రాష్ట్రంలో అధిక భాగంలో కరువు ప్రకటించక తప్పలేదు. ఇవేకాక, మరెన్నో సమస్యలూ, సవాళ్ళూ నవ్యాంధ్రప్రదేశ్ ఎదుట మోహరించి ఉన్నాయి.

## దిశానిర్దేశం:

8. అయితే మన రాష్ట్రాన్ని ఒక స్వర్ణాంధ్రప్రదేశ్‌గా, నవ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే మన ప్రభుత్వ ఆశయానికి ఈ అడ్డంకులు అవరోధం కావు. మన ప్రభుత్వం తన మొదటి సంవత్సర కాలంలోనే రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే కార్యాచరణ ప్రణాళిక ప్రకారం సకాలంలోనే ఎన్నో ముఖ్య చర్యలు చేపట్టింది. ఆ ఆశయాలకూ, లక్ష్యాలకూ అనుగుణంగా ప్రభుత్వం చేపడుతున్న కొన్ని ముఖ్య అభివృద్ధి వ్యూహాలను తమ ద్వారా సభ దృష్టికి తీసుకొస్తున్నాను.

## జీరో బేస్డ్ బడ్జెట్ రూపకల్పన

9. 2015-16 సంవత్సరానికి ఈ బడ్జెట్‌ను ప్రతిపాదించడానికి ముందు ప్రభుత్వం చాలా సుదీర్ఘమైన కసరత్తు చేసింది. మారుతున్న కాలానికీ, ప్రజల ఆకాంక్షలకూ తగ్గట్టుగా పథకాలు సమర్థవంతంగా ఉన్నాయా లేదా, వాటి అవసరం ఉందా లేదా సవివరంగా సమీక్షించింది. కొన్నిచోట్ల పథకాలకు అవసరమైన మార్పులు చేసింది. బడ్జెట్ నుంచి ఆశించిన ఫలితాలు రాబట్టడానికీ, ప్రజల అవసరాలు ప్రతిబింబిస్తూ నిర్దిష్ట లక్ష్యాలు సాధించడానికి ఈ సమీక్ష ఉపయోగపడింది. ఇందుకోసం 07-01-2015న విజయవాడలో ప్రీ-బడ్జెట్ వర్క్‌షాప్ నిర్వహించడం జరిగింది. ఈ ఫిబ్రవరిలో సంబంధిత శాఖలన్నిటితోనూ చర్చించడం జరిగింది. ఆ చర్చల్లో భాగంగా ప్రస్తుతమున్న సిబ్బంది ఖాళీలను సమీక్షిస్తూ, కార్యక్రమాలు చేపట్టడానికి

అవసరమైన సిబ్బంది గురించిన అంచనాలు రావడం కూడా జరిగింది. ఈ విధంగా చేయడం వల్ల బడ్జెట్‌కు స్పష్టత, నిర్దుష్టత చేకూరి కేటాయింపులకు ఒక సార్థకత సాధ్యపడింది.

10. ఈ సందర్భంగా గౌరవ సభ్యుల దృష్టికి ఒక ఆసక్తికరమైన సంగతి తీసుకొస్తున్నాను. 1990-91 నుంచి బడ్జెట్ పుస్తకాలలోని అంకెలను వేలలో చూపించడం జరుగుతున్నది. అంతకుముందు వందల్లోనూ, అంతకన్నా ముందు రూపాయిల్లోనూ కూడా చూపించేవారు. అయితే ప్రస్తుతం ఉన్నటువంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకున్నట్లయితే బడ్జెట్ పుస్తకాల్లో వేలల్లో చూపిస్తున్న ఈ అంకెలు కలిగిస్తున్న ఇబ్బంది మీకు తెలియంది కాదు. అందుకని 2015-16 సంవత్సరం నుంచి బడ్జెట్ పుస్తకాల్లోని అంకెలు లక్షల్లో చూపించబోతున్నాము.

**పరిమితమైన వనరులు, ఆచరణాత్మక బడ్జెట్**

11. రాష్ట్రవిభజన వల్ల శేషాంధ్రప్రదేశ్ తీవ్రమైన వనరుల పరిమితితో సతమతమవుతున్న విషయం గౌరవ సభ్యులకు తెలిసిందే. పన్నుల ద్వారానూ, ఇతరత్రానూ మనకు సమకూరే ఆదాయం మన జీతభత్యాలు, పెన్షన్లు, ఇతర ఖర్చులకు బొటాబొటిగా సరిపోయేదిగా ఉంది. పన్నుల ద్వారా కాకుండా ఇతరత్రా మనకు లభించగల ఆదాయవనరులు చాలా పరిమితం. రాష్ట్ర విభజన వల్ల శేషాంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలను పధ్నాల్గవ ఆర్థికసంఘం పట్టించుకోలేదు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఏ ప్రాతిపదికన నిధుల కేటాయింపుకు సిఫారసు చేసిందో ఆ ప్రాతిపదికనే మన రాష్ట్రానికి కూడా వర్తింపచేసింది. పధ్నాల్గవ ఆర్థిక సంఘం సిఫారసుల వల్ల భారతప్రభుత్వం రాష్ట్ర ప్రణాళికకు అందించే కొన్ని కేంద్ర పథకాలను ఎత్తివేయనున్నది. మరికొన్ని పథకాలలో కేంద్రం అందించగల వాటా తగ్గిపోనున్నది. ఇందువల్ల రాష్ట్ర ప్రభుత్వం మీద మరింత అదనపు ఆర్థికభారం పడబోతున్నది. ప్రస్తుత సంవత్సరంలో భారత ప్రభుత్వం నుండి రాష్ట్రానికి అందిన నిధులు, 2015-16 సంవత్సరానికి గాను కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి రాగల నిధులు మనం ఆశించినట్లుగా లేవు. ఈ ఇబ్బందులన్నిటివల్లా మేము 2014-15 సంవత్సరంతో పోలిస్తే చాలా కొద్దిపాటి పెరుగుదలతో మాత్రమే ఈ ఏడాది బడ్జెట్‌ను ప్రతిపాదించవలసి వస్తున్నది. ఇక్కడ ఒక విషయం గమనించాలి. 14వ ఆర్థిక సంఘం నివేదిక ప్రకారం, 2015-16 సంవత్సరానికి పన్ను రాబడి జి.యస్.డి.పి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 7.98 శాతం, తెలంగాణ రాష్ట్రానికి 9.99 శాతం. 2019-20 సంవత్సరానికి ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 8.41 శాతం గాను, తెలంగాణ రాష్ట్రానికి 10.26 శాతంగా పరిణమించనుంది. ఒక విధంగా ఇది వాస్తవికమైన, ఆచరణాత్మకమైన బడ్జెట్ అని నేను గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. ఈ కేటాయింపులు చేపట్టడంలో మేము అణగారిన వర్గాలకు, వ్యవసాయ, సాగునీటి, సాంఘిక, భౌతిక మౌలిక సదుపాయాలకు తగు కేటాయింపులు చేస్తున్నాము. అంతేకాదు, క్యాపిటల్ ఔట్‌లెట్స్‌కు సంబంధించి గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కేటాయింపులు పెరిగాయని కూడా తమకు విన్నవించుకుంటున్నాం. బడ్జెట్ పరిమాణం గత ఏడాది ఒక రూ.1,11,823 కోట్లు కాగా ఈ ఏడాది రూ.1,13,048 కోట్లు. అనగా 1.1 శాతం

పెరుగుదల. ప్రణాళిక బడ్జెట్ గత ఏడాది రూ.26,672 కోట్లు కాగా, ఈ ఏడాది రూ.34,412 కోట్లు అనగా 29.02 శాతం పెరిగింది. అలాగే క్యాపిటల్ బడ్జెట్ రూ.7,069 కోట్ల నుండి రూ.9,818 కోట్లకు అనగా 38.88 శాతం పెరగడం గమనార్హం. ప్రణాళికేతర వ్యయాన్ని రూ.85,151 కోట్ల నుండి రూ.78,626 కోట్లకు అలాగే ప్రణాళికేతర రెవెన్యూ వ్యయాన్ని రూ.78,976 కోట్ల నుండి రూ.73,223 కోట్లకు తగ్గించాము.

12. అయినప్పటికీ మేము ఈ ఒడిదుడుకులకు చలించకుండానే ముందుకు పోవాలని నిశ్చయించుకున్నాం. ప్రజల మీద అదనపు పన్నుల భారం మోపకుండా పన్నుల కన్నా ఇతరత్రా రూపేణా రాగల ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు అన్వేషిస్తున్నాం. ఈ విషయాన్ని అధ్యయనం చేయటానికి ఇప్పటికే నిపుణుల్ని నియమించాము. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఎక్సైజ్ విధానం ద్వారా అదనపు వనరులు సమకూరే అవకాశాలను పరిశీలిస్తున్నాం. స్థిరాస్తుల కల్పనపై మనం చేస్తున్న వ్యయాన్ని మరింత ఉత్పాదకంగా చేపట్టడం కోసం ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం కూడా మొదలు పెట్టాం. రాష్ట్రవిభజన సమయంలోనూ, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోనూ చేసిన వాగ్దానాలను భారత ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేసేటట్టుగా ప్రయత్నిస్తాం. ఇటువంటి ప్రయత్నాలు చేయడం ద్వారా మేము 2015-16 సంవత్సరకాలంలో అదనపు వనరులను కూడగట్టగలమనీ, ఇప్పటికే ప్రకటించిన పథకాలకు కేటాయింపులు పెంచడానికీ, అవసరమైన చోట కొత్త పథకాలు చేపట్టడానికి కూడా ప్రయత్నిస్తాము.

## ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడం

13. రానున్న కాలంలో రాష్ట్రం అభివృద్ధిలో ఉన్నతగతిని సాధించడానికి కంకణం కట్టుకున్నది. అభివృద్ధిని సుసాధ్యం చేయడానికి ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ప్రధాన నిర్ణయాల వల్ల ప్రస్తుతం మనముందున్న ముందస్తు అంచనాల ప్రకారం 2014-15లో రాష్ట్రం 7.21 శాతం అభివృద్ధిని నమోదు చేసింది.

14. ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ప్రధానరంగాలు మూడూ కూడా అంటే వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాలు 2014-15లో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడటం ఎంతో ప్రోత్సాహకరమైన విషయం. రాష్ట్రంలో అభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా ఉన్న సేవారంగం 8.48 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. వ్యవసాయం 5.90 శాతం, పరిశ్రమలు 5.25 శాతం వృద్ధి చూపించాయి. మరింత అభివృద్ధికి అవకాశమున్న మత్స్య రంగం 17.3 శాతం దాకా వృద్ధి చూపించింది. రాష్ట్ర విభజన పిమ్మట, జి.యస్.డి.పి. సమకూర్చే ప్రధాన రంగాల వాటాలలో గణనీయంగా మార్పు వచ్చింది. వ్యవసాయరంగం వాటా 22.96 శాతం నుండి 27.59

శాతానికి పెరిగింది. పారిశ్రామిక రంగం వాటా 24.33 శాతం నుండి 20.62 శాతానికి తగ్గింది. సేవారంగం వాటా స్వల్పంగా 52.72 శాతం నుండి 51.79 శాతం తగ్గింది.

15. తలసరి ఆదాయం క్రమంగా పెరుగుతూండడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ఒక ముఖ్యమైన అంశం. ప్రజలకు మరింత మెరుగైన జీవన ప్రమాణాలను సాధించే క్రమంలో ప్రజల తలసరి ఆదాయం మరింత పెరిగే విధంగా అన్ని వర్గాలవారూ అభివృద్ధి చెందేవిధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అభివృద్ధికి సంబంధించి మనం చేపట్టవలసిన కార్యక్రమాలు అన్నిటినీ పూర్తి చేయగలిగితే 2014–15లో రూ.90,517 గా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తలసరి ఆదాయం 2018–19 నాటికి రెట్టింపు కాగలదు.

16. ఆర్థిక వ్యవస్థ శీఘ్రపురోగతి వల్ల రాష్ట్రంలో మధ్యతరగతి పరిమాణం పెరుగుతున్నది. మధ్యతరగతి కుటుంబాల ఆకాంక్షలు ఉన్నతంగా ఉంటాయి. వారు శ్రేష్ఠమైన సేవలు కోరుకుంటారు. శ్రేష్ఠజీవితాన్ని అభిలషిస్తారు. వారి ఆకాంక్షలకు తగ్గట్టుగా ప్రభుత్వం సేవల నాణ్యతను మెరుగుపరచడానికి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకోనున్నది.

## విజన్ 2029

17. దారిద్ర్యాన్ని నిర్మూలించడం, ఆర్థిక, సామాజిక, అసమానతలను తగ్గించడం, ఆరోగ్యప్రదమైన సంతోషమయ సమాజానికి దారి చూపడం మన ప్రధాన లక్ష్యం. 2020 నాటికి దేశంలో అత్యున్నత పురోగతిని సాధించబోయే మొదటి మూడు రాష్ట్రాల్లోనూ ఒకటిగా, 2029 నాటికి దేశంలోనే అభివృద్ధి క్రమంలో మొట్టమొదటి రాష్ట్రంగా మన రాష్ట్రాన్ని నిలపాలని మేము కోరుకుంటున్నాం. ఈ క్రాంతదర్శనంలో భాగంగా మేము విజన్–2029 పత్రరచనకు పూనుకున్నాం. విజన్ 2029 రాష్ట్రాభివృద్ధికి ఒక దిశానిర్దేశాన్ని అందిస్తుంది. అభివృద్ధి చెందాల్సిన రంగాల మీద దృష్టిపెడుతుంది. 2050 నాటికి ప్రపంచంలోనే పెట్టుబడులు పెట్టడానికి ఒక అత్యుత్తమ గమ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎదగనున్నది.

## పురోగతి లక్ష్యాల విస్తరణ – రెండంకెల వృద్ధి రేటు సాధన

18. వృద్ధిరేటు రెండంకెలకు చేరడం కోసం ఆర్థికాభివృద్ధి నిలకడగా కొనసాగడం కోసం అమలు పరచవలసిన వ్యూహాల మీద ప్రభుత్వం దృష్టి పెడుతున్నది. నిలకడగా అభివృద్ధిని ఆశించిన స్థాయిలో నడపడానికి 40 కీలక అభివృద్ధి శక్తుల్ని గుర్తించడం జరిగింది. అభివృద్ధి పురోగతిని త్రైమాసిక పద్ధతిలో సమీక్షించడానికి ప్రయత్నాలు చేపట్టడం జరిగింది. శీఘ్ర ఆర్థిక పురోగతి వల్ల రాష్ట్ర ఆదాయం కూడా పెరిగి, తద్వారా ఆర్థికవ్యవస్థ మరింత పురోగతి చెందడానికి దోహదపడే రంగాలకు బలం చేకూరుతుంది.

## అభివృద్ధి వాహకాలు

19. సూర్యోదయ ఆంధ్రప్రదేశ్‌ను సాధించాలన్న ఆలోచనకు అనుగుణంగా మన ప్రభుత్వం 7మిషన్‌లను, 5ప్రచార ఉద్యమాలను, 5గ్రిడ్లనూ ప్రారంభించింది. తద్వారా అభివృద్ధిని శీఘ్రతరం చేయాలనీ, ప్రజల సంక్షేమాన్ని సాధించాలనీ, ముఖ్యంగా అణగారిన వర్గాలకు వెలుగు చూపించాలనీ భావిస్తున్నది. సూక్ష్మ ప్రణాళికనూ, విధాన నిర్ణయాన్ని మరింత ప్రయోజనకరంగా నిర్వహించడం కోసం ప్రభుత్వం మండలస్థాయి స్థూల ఉత్పత్తి నివేదికలను క్రోడీకరించడానికి పూనుకున్నది. ఈ కసరత్తు తూర్పుగోదావరి, అనంతపురం జిల్లాలలో జయప్రదంగా పూర్తయింది. తక్కిన జిల్లాలలో కూడా చేపట్టబడనుంది.

**7 మిషన్‌లు**

20. మౌలిక సామాజిక ఆర్థిక సదుపాయాలను కల్పించడం, సంస్థాగత మానవ సామర్థ్యాలను పెంపొందించడం, గుర్తించిన రంగాలలో అభివృద్ధికి ఆస్కారమున్న క్షేత్రాలకు దృష్టి పెట్టడం, వనరులను సమర్థవంతంగా వాడుకోగల శక్తిని మెరుగుపర్చుకోవడం మిషన్ ఆధారిత వ్యూహం తాలూకు ముఖ్య ఉద్దేశాలు.

21. ఆ దృష్టితో 7 మిషన్‌లకు రూపకల్పన చేయటం జరిగింది. అవి ప్రాథమిక రంగం మిషన్, సామాజిక సాధికారికత మిషన్, విజ్ఞానం–నైపుణ్యకల్పన మిషన్, పట్టణాభివృద్ధి మిషన్, పారిశ్రామిక మిషన్, మౌలికసదుపాయాల మిషన్ మరియు సేవారంగ మిషన్. ఈ మిషన్‌లు ఇందుకు సంబంధించిన వారందరి భాగస్వామ్యంతో ఒక నవీన అభివృద్ధి దృక్పథాన్ని సుసాధ్యం చేస్తాయి. ఇందులో భాగంగా మిషన్ వ్యూహాల రచనలో ప్రభుత్వం ఇంటర్నేషనల్ క్రాప్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సెమీ ఆరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిసాట్), బాబా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) వంటి అంతర్జాతీయ ప్రఖ్యాతి చెందిన సంస్థల సేవలను వినియోగించుకుంటున్నది.

**ఐదు ప్రచార ఉద్యమాలు**

22. ఏడు మిషన్‌ల ద్వారా సాధించాలనుకున్న లక్ష్యాలను సుసాధ్యం చేసే ఉద్దేశంతో ప్రభుత్వం ఐదు ప్రచార ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. అవి 'పేదరికంపై గెలుపు', 'పొలం పిలుస్తోంది', 'బడి పిలుస్తోంది', 'నీరు–చెట్టు' మరియు 'స్వచ్ఛ ఆంధ్ర'.

**ఐదు గ్రిడ్‌లు**

23. ప్రతి కుటుంబానికీ మౌలిక సదుపాయాలను అనుసంధానం చెయ్యాలన్న దూరదృష్టితో ప్రభుత్వం ఐదు గ్రిడ్లను నెలకొల్పనున్నది. అవి 'నీటి సరఫరా గ్రిడ్', 'రహదారి గ్రిడ్', 'విద్యుచ్ఛక్తి గ్రిడ్', 'సహజవాయువు గ్రిడ్' మరియు 'ఫైబర్ ఆప్టిక్ గ్రిడ్'.

ముఖ్య కార్యక్రమాల నిర్వహణకు సంస్థాగత ఏర్పాట్లు.

### రైతు సాధికార సంస్థ

24. రైతుల సాధికారికత కోసం ఉద్దేశింపబడ్డ అన్ని కార్యక్రమాలకూ, పథకాలకూ, ప్రయత్నాలకు ఒక సమగ్ర సంస్థాగత ఏర్పాటుగా ప్రభుత్వం రైతు సాధికార సంస్థ (ఫార్మర్స్ ఎంపవర్‌మెంట్ కార్పొరేషన్)ను ఏర్పాటు చేయాలని (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) నిర్ణయించింది. ఈ కార్పొరేషన్ రైతు సంక్షేమం, అభివృద్ధి, సామర్థ్య కల్పన, రుణసదుపాయం, ఆర్థిక పరమైన మద్దతు, తదితర కార్యక్రమాలన్నిటి మీదా దృష్టి పెడుతుంది.

### ఆంధ్రప్రదేశ్ మహిళా సాధికార సంస్థ

25. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో దారిద్ర్య నిర్మూలనకు సంబంధించిన అన్ని కార్యక్రమాలకూ, పథకాలకూ, ప్రయత్నాలకూ ఒక సమగ్ర సంస్థాగత ఏర్పాటుగా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ మహిళా సాధికారసంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సామాజిక చైతన్యం, సామాజిక స్థాయిలో సంస్థాగత ప్రయత్నాలు బలోపేతం చేయటం, సామర్థ్యాల కల్పన, రుణసదుపాయం అందుబాటులోకి తీసుకురావటం, రుణాలు, నైపుణ్యాలు, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ లీకేజి, వేల్యూ ఎడిషన్, ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్యాసౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలన్నిటి మీదా ఈ సంస్థ దృష్టి పెడుతుంది.

### ఆర్థికాభివృద్ధి బోర్డు

26. రాష్ట్రాన్ని సత్వరమే అభివృద్ధి చేయడంకోసం వివిధ కార్యక్రమాల మధ్య సమన్వయం సాధించడం కోసం, తక్కిన రాష్ట్రాలతో పోటీపడగలిగేటట్లుగా రాష్ట్రాన్ని రూపొందించడానికి వీలుగా దీర్ఘకాల ఆస్తులమీదా పెట్టుబడులు పెట్టడం కోసం అదనపు వనరులను సమీకరించడం కోసం ఒక ప్రాధికార సంస్థగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగింది. అభివృద్ధిలో భాగస్వాములైన అన్ని ప్రభుత్వ శాఖల తరఫునా ఈ బోర్డు ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటేషన్ ఫండ్‌నీ, ప్రాజెక్టు డెవలప్‌మెంట్ ఫండ్‌నీ, వయబులిటీ గేప్ ఫండ్‌నీ నిర్వహిస్తుంది.

### మిషన్ ప్రాతిపదికన బడ్జెట్ రూపకల్పన

27. మిషన్ ఆధారిత వ్యూహాలు ఆకాంక్షిస్తున్న లక్ష్యాలకు అనుగుణంగా 2015-16 బడ్జెట్‌ను రూపకల్పన చేయటం జరిగింది.

### జన్మభూమి మా ఊరూ

28. తొలివిడత జన్మభూమి కార్యక్రమాలు సాధించిన ఫలితాల స్ఫూర్తితో ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గ్రామీణ పంచాయతీలలోనూ, మున్సిపల్‌ల వార్డులలోనూ కొన్ని కీలకరంగాలపై

దృష్టి సారిస్తూ 'జన్మభూమి మా ఊరూ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) ఆ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క గ్రామ పంచాయతికి, మున్సిపల్ వార్డుకూ సూక్ష్మ ప్రణాళిక రూపొందించబడుతుంది. ఆ సూక్ష్మప్రణాళికలో భాగంగా భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలన్నీ ప్రాథమిక రంగాల మిషన్, సామాజిక సాధికారికత మిషన్, విజ్ఞాన–నైపుణ్యాల మిషన్, పట్టణాభివృద్ధి మిషన్‌లు ఆశిస్తున్న లక్ష్యాలకు అనుగుణంగా ఉంటాయి.

## స్మార్ట్ విలేజ్/స్మార్ట్ వార్డు

29. స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించడంలో భాగంగా మరింత సమర్ధవంతంగా, సత్వరంగా అభివృద్ధి పొందడానికి అనువైన భాగస్వామ్యాల్ని కూడగట్టడంకోసం, ప్రజల జీవనప్రమాణాల్ని పెంపొందించడం కోసం ప్రభుత్వం 2015 జనవరి 18న 'స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ సాధనకై స్మార్ట్ విలేజ్/స్మార్ట్ వార్డ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో తొలిదశలో 20అభివృద్ధి సూచికల మీద దృష్టిపెట్టడం జరుగుతుంది. ఒక నిర్దిష్టకాలవ్యవధిలో రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయితీలను, మున్సిపల్ వార్డులనూ సమగ్రంగా అభివృద్ధి పరచడం ఈ కార్యక్రమం ఉద్దేశం.

## ప్రాధాన్యతల నిర్ధారణ:

30. తన పాదయాత్రలో భాగంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబునాయుడు గారు దాదాపు 3,000 కి.మీ.ల (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) మేరకు పర్యటించి ప్రజలను ముఖాముఖి కలుసుకుని, వారితో మమేకమై వారి సమస్యలను లోతుగా అర్థం చేసుకున్న సంగతి మీకు తెలుసు. ఆ అవగాహన ప్రాతిపదికగా మా పార్టీ మానిఫెస్టో రూపొందించడం జరిగింది. ఆ మానిఫెస్టోలో మేం ప్రజలకు చేసిన వాగ్దానాలను ఇప్పుడు ప్రభుత్వ పథకాలుగా రూపకల్పన చేయడం జరుగుతున్నది. రాష్ట్రాన్ని దారిద్ర్యరహిత సమాజంగా రూపొందించడం, (ప్రతిపక్ష సభ్యుల స్థానం నుండి తుస్..తుస్... అంటూ నిరసన వ్యక్తంచేయబడింది) ప్రజలందరికీ సమానంగా అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడం మా లక్ష్యం. ఈ సందర్భంగా నాకు జార్జ్ బెర్నార్డ్ షా వాక్యాలు గుర్తొస్తున్నాయి.

> *అతి పెద్ద దుర్మార్గం, అత్యంత హేయమైన నేరం పేదరికం, కాబట్టి మన ప్రథమ కర్తవ్యం దారిద్ర్యరహిత సమాజమే. ఆ కర్తవ్యం కోసం తక్కిన కర్తవ్యాలన్నీ కూడా పక్కనపెట్టి తీరాలి.*

31. ప్రజలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చాలన్న నిబద్ధతతో మా ప్రభుత్వం పేదప్రజల పక్షాన నిలబడుతూ, వారికి ప్రయోజనం కలిగించే విధంగా ఎన్నో కార్యక్రమాలు రూపొందించింది. పేదలకు కిలో రూ.1చొప్పున తల ఒక్కింటికి 5కిలోల బియ్యం, అన్న అమృతహస్తం, నీరు–చెట్టు,

బడి పిలుస్తోంది, పొలం పిలుస్తోంది, ఎన్టీఆర్ భరోసా, ఎన్టీఆర్ ఆరోగ్యసేవ, రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, (ట్రెజరీ బెంచెస్‌చే హర్షధ్వానాలు) గిరిపుత్రిక కల్యాణ పథకం, మా ఇంటి మహాలక్ష్మి, ఆంధ్ర యువశక్తి, గోరుముద్దలు వంటి ఎన్నో పథకాలను అమలుచేస్తున్నది.

32. అలాగే మేము అర్హులైన విద్యార్థులందరికీ పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలను అందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేపడుతున్నాము. పాఠశాల విద్యకు బడ్జెట్ కేటాయింపులను మొత్తం బడ్జెట్‌లో 11.26శాతం నుండి (ట్రెజరీ బెంచెస్‌చే హర్షధ్వానాలు) 13.24శాతానికి పెంచుతున్నాము. మోడల్ క్లస్టర్ పాఠశాలలను నెలకొల్పాలనీ, దశలవారీగా సంక్షేమ హాస్టల్‌లను గురుకుల పాఠశాలలుగా అభివృద్ధి పరచాలనీ ప్రభుత్వం ఆలోచిస్తున్నది. మిలీనియం డెవలప్‌మెంట్ లక్ష్యాలకు అనుగుణంగా మాతాశిశు మరణాలను తగ్గించడం కోసం, ప్రాథమిక ఉన్నతస్థాయి ఆరోగ్యసేవలను మరింతగా అందుబాటులోకి తీసుకురావడంకోసం, సురక్షిత మాతృత్వం కోసం వైద్య, ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులను మొత్తం బడ్జెట్‌లో ప్రస్తుతమున్న 3.92 శాతం నుండి 5.07 శాతానికి పెంచుతున్నాము.

33. ప్రభుత్వం ఒక రాష్ట్రస్థాయి ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్చర్‌ను నిర్మిస్తూ, రాష్ట్రానికి కొత్తగా ఒక డేటా కేంద్రాన్ని కూడా నెలకొల్పే పెద్ద ప్రయత్నాన్ని చేపట్టింది. అర్హులైనవారికి ప్రయోజనాలు అందించే క్రమంలో అవినీతిరహిత, పారదర్శక పాలనా వ్యవస్థను నెలకొల్పడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అటువంటి సుపరిపాలనను తీసుకువచ్చే క్రమంలో ఈ-గవర్నెన్స్ ఒక ముఖ్యమైన ప్రయత్నం, ఉపకారవేతనాలు, పెన్షన్లు, పౌరపంపిణీ సేవలు, ఇతర వ్యక్తిగత సదుపాయాలు సకాలంలో అర్హులైన వారికి చేరడానికి సహకరించే విధంగా ఆధార్‌తో అనుసంధానం చేసే క్రమంలో రాష్ట్రం ఎంతో ముందంజలో ఉంది. ఇప్పటికే ప్రారంభించబడ్డ పాలన సంస్థల పరంపర పరిపాలనలో పారదర్శకతనూ, స్పష్టతనూ మెరుగు పర్చనుంది. పౌరుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగవలసిన అవసరాన్ని తగ్గించడమే కాక, ప్రభుత్వ వ్యవహారాల్లో అవినీతిని తగ్గించేవిధంగా ఉంటుంది. ఈ చర్యలన్నిటివల్లా, సేవల నిర్వహణలోని ఆటంకాలు తొలగి మరింత మెరుగైన వ్యవస్థ ఏరడనుంది.

34. వాణిజ్యపన్నుల శాఖలో ఈ-ట్రాకింగ్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. బ్లాక్‌మార్కెటింగ్‌నూ, వనరుల దుర్వినియోగాన్నీ అరికట్టడం కోసం పౌరసరఫరా శాఖలో స్మార్ట్ కార్డ్ వ్యవస్థను నెలకొల్పడం జరిగింది. ప్రస్తుతం సంక్షేమశాఖల్లో ఉన్న ఈ-పాస్ విధానాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, వసతిగృహాల్లో ఉన్న విద్యార్థుల హాజరు, చదువు, ఆరోగ్య పరిస్థితులు కూడా ఎప్పటికప్పుడు పరిశీలించే విధంగా తగిన వ్యవస్థను రూపొందించడం జరుగుతుంది. కాంప్రహెన్సివ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సిఎఫ్ఎమ్ఎస్), ఈ-పేమెంట్స్ నగదు పంపిణీ అధికారుల సంఖ్యను కుదించడం వంటి సంస్కరణల వల్ల ఆర్థికశాఖ కార్యక్రమాలు మరింత సరళీకృతం, పారదర్శకం, పౌరసన్నిహితం కానున్నాయి.

35. నిరుద్యోగ యువతకు నైపుణ్యాల కల్పన, శిక్షణ మరియు ఉపాధి కోసం అవకాశాలు అందించబడుతున్నాయి. ఒక నిజమైన సంక్షేమ చర్యగా ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని సమకూర్చనున్నది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు మరియు ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

36. చిన్నతరహా కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు, ప్రభుత్వం మహిళా స్వయం సహాయక బృందాలకు మరింత సహకారం అందించనున్నది.

37. కార్పొరేట్ రంగం నెరవేర్చవలసిన సామాజిక బాధ్యతలో భాగంగా వారినుండి వనరుల్ని సమీకరించి ప్రభుత్వం క్రీడా సదుపాయాల కల్పనలను మెరుగుపర్చాలని భావిస్తున్నది. అదే విధంగా ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులతోపాటు, పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో పెట్టుబడులను సమకూర్చాలని కూడా ప్రయత్నిస్తున్నది.

38. ప్రజలకు అందవలసిన అత్యవసర సేవలను మరింత సమర్ధవంతంగా అమలు చేయాలన్న ఉద్దేశంతో మెడికల్, పారామెడికల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, పోలీసు, హోంగార్డు ఉద్యోగాలలో ఖాళీల భర్తీని ప్రభుత్వం చేపట్టనున్నది.

39. ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం పైన మనస్సు పెట్టిందని నేనీ సందర్భంగా ఈ గౌరవసభకు విన్నవించుకుంటున్నాను. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికున్న ఈ స్నేహశీలతకు అనుగుణంగానే ప్రభుత్వం ఇటీవలనే 10వ వేతన సవరణ సంఘం వారు సిఫార్సు చేసిన దానికన్నా ఎంతో మిన్నగా ఉద్యోగులకు 43శాతం ఫిట్‌మెంట్ (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) సదుపాయాన్ని ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రం గడ్డు పరిస్థితిలో ఉన్నప్పటికీ, రాష్ట్ర విభజన వల్ల ఒక దురదృష్టకర పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికి ప్రభుత్వం ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించి ఈ కీలకవిధాన నిర్ణయాన్ని తీసుకోటానికి ఎంతమాత్రం వెనకాడలేదు. ప్రభుత్వోద్యోగులు ఈ అంశాన్ని గమనిస్తారనీ, వారు మరింత దీక్షతో, ఉత్సాహంతో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తారని మేం నమ్ముతున్నాం. వారి జీతభత్యాల మీద వ్యయపరుస్తున్న ప్రతి ఒక్క రూపాయి రాష్ట్ర పురోగతిని మదుపుగా మారగలదని మేం ఆశిస్తున్నాం.

**సంఘటిత అభివృద్ధి,అసమానతల తగ్గింపు**

40. రాష్ట్రాన్ని అభివృద్ధి క్రమంలో నడిపించే క్రమంలో భాగంగా ప్రభుత్వం ఆ అభివృద్ధి నలుగురినీ కలుపుకుపోయేది కావాలని కోరుకుంటున్నది. అభివృద్ధి ఫలాలు నలుగురికీ అందుబాటులోకి రానిదే బీదలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలు, వికలాంగులు మరియు స్త్రీలకు మరింత మెరుగైన జీవనోపాధి అవకాశాలు లభ్యం కానిదే అభివృద్ధికి అర్థం లేదు.

41. అభివృద్ధి నలుగురినీ కూడగట్టుకునే సంఘటితాభివృద్ధి కాగలగినప్పుడు, అసమానతలు తగ్గించబడినప్పుడు, సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఉన్న అభివృద్ధి వ్యత్యాసాలు పూరించబడతాయి.

42. ఇటువంటి సంఘటితాభివృద్ధిని సాధించడానికీ, ఆ విధంగా సాధించిన అభివృద్ధిని నిలకడగా నిలుపుకోవడానికీ మా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల ఉపప్రణాళికా, గిరిజన ఉపప్రణాళికా చట్టం 2013ను ఎంతో శ్రద్ధతో అమలుచేస్తున్నది. అందులో భాగంగా ఈ ఏడాది షెడ్యూల్డు కులాల అభివృద్ధికి రూ.5,878కోట్లు, షెడ్యూల్డు తెగల అభివృద్ధికి రూ.1,904 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ కేటాయింపు మొత్తం రాష్ట్ర ప్రణాళికలో 22.61శాతం. షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగల అభివృద్ధికి ఏర్పాటైన రాష్ట్రమండలి 2014 డిసెంబరులో సమావేశమై, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కోసం అమలు జరుగుతున్న వివిధ కార్యక్రమాలను సమీక్షించింది. ఆయా వర్గాల వారికి గుణాత్మక విద్యను అందించడం కోసం, నైపుణ్యాల కల్పన, ఉపాధి కల్పన కోసం, నలుగురితో పోటీపడగల ఉన్నత విద్యను అందించడం కోసం విదేశాలలో కూడా విద్యావకాశాలు కల్పించడం కోసం అలాగే ఆయా వర్గాలు పరిశ్రమలు స్థాపించడం కోసం ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయవలసిందిగా నోడల్ శాఖలను రాష్ట్రమండలి ఆదేశించింది.

43. షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళిక తరహాలోనే వెనుకబడిన తరగతులకు కూడా ఒక సమగ్ర ఉపప్రణాళికను అమలు పరచడం కోసం ప్రభుత్వం నిర్ణయించిందనీ, ఈ బడ్జెట్‌లో అందుకు తగిన విధంగా కేటాయింపులు చేసిందనీ (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) మీకు తెలియజేస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది.

44. రాయలసీమలోని నాలుగు జిల్లాలలో, ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలలో వెనకబడ్డ ప్రాంతాలను అభివృద్ధి చేయడం కోసం జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున భారతప్రభుత్వం రూ.350 కోట్ల ప్రత్యేక అభివృద్ధి సహాయాన్ని అందజేసింది.

**రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 2013-14**

45. రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు సంబంధించిన ముఖ్య అంశాలను క్లుప్తంగా వివరిస్తాను. ప్రస్తుత ధరల ప్రకారం 2013-14 సంవత్సరానికి మొదటి సవరించిన అంచనాల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.4,64,183 కోట్లు కాగా, 2014-15 సంవత్సరానికి ముందస్తు అంచనా ప్రకారం 12.03శాతం వృద్ధిని సూచిస్తూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.5,20,030కోట్లుగా అంచనా వేయబడింది. స్థిర (2004-05) ధరల ప్రకారం 2013-14 సంవత్సరానికి రాష్ట్రస్థూల ఉత్పత్తి రూ.2,46,724కోట్లు కాగా 2014-15కు 7.21శాతం వృద్ధిని సూచిస్తూ రూ.2,64,521 కోట్లుగా అంచనా వేయబడింది. స్థిర ధరల ప్రకారం వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాలు

2014–15 సంవత్సరంలో వరుసగా 5.90శాతం, 5.25శాతం, 8.48శాతం వృద్ధిరేటును సాధించాయి.

46. ప్రస్తుత ధరల ప్రకారం 2013–14 సంవత్సరానికి తలసరి ఆదాయం ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.81,397 కాగా 2014–15 కు 11.21 శాతం వృద్ధిని సూచిస్తూ రూ.90,517గా అంచనా వేయడం అయినది. స్థిర (2004–05) ధరల ప్రకారం తలసరి ఆదాయం 2013–14కు రూ.42,170 కాగా 2014–15కు 6.31 శాతం వృద్ధిని సూచిస్తూ రూ.44,831 కి పెరిగింది.

47. ఇప్పుడు నేను రంగాల వారీగా ప్రతిపాదనలు వివరిస్తాను.

**వ్యవసాయం**

48. రాష్ట్రప్రభుత్వం ముందున్న కార్యాచరణలో వ్యవసాయరంగం అన్నింటికన్నా ముందుంది. వ్యవసాయరంగాన్ని గతిశీలకంగానూ, అభివృద్ధిరంగంగానూ మార్చాలని ఆశిస్తున్నాం. మన రాష్ట్ర జనాభాలో అధికశాతం ఇప్పటికీ జీవనోపాధి కోసం వ్యవసాయం మీదనే ఆధారపడినందువల్ల రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ సంబంధిత రంగాల వాటా 27.59 శాతంగా ఉంది. అయితే దురదృష్టవశాత్తు వరుసగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు, ఖర్చుల పెరుగుదల, గిట్టుబాటుధర రాకపోవడం వంటి కారణాల వల్ల రాష్ట్రంలో వ్యవసాయం తీవ్రసంక్షోభంలో ఉంది. ఈ సంక్షోభం ఏ స్థాయికి చేరిందంటే పరిస్థితుల ప్రభావానికి తట్టుకోలేక ఎందరో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉన్నారు. ఈ విధంగా గూడుకట్టుకున్న నైరాశ్యాన్ని, సంక్షోభాన్ని ఎదుర్కోవడం కోసం రైతు జనావళికి చేయూతనందించడం కోసం చరిత్రలో ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా రైతు రుణాలను మాఫీ చేయడం కోసం మేము ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకున్నాం. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) రైతులు బ్యాంకుల నుండి, సహకార సంఘాల నుండీ తీసుకున్న వివిధ రుణాలు,బంగారం తాకట్టుపెట్టి తీసుకున్న రుణాలతో సహా కుటుబానికి రూ.1.50 లక్షల వరకు రుణమాఫీ అందిస్తున్నాము. ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం కొట్టుమిట్టాడుతున్నప్పటికీ రుణమాఫీ పథకం కింద మొదటిదశలో రైతు సాధికారసంస్థకు రూ.5,000 కోట్లు విడుదల చేశాము. రెండవదశ కార్యక్రమం రూపకల్పన పూర్తవుతున్నది. పండ్లతోటలు పెంచుకున్న రైతులకు ఎకరాకు రూ.10,000చొప్పున నష్టపరిహారం అందించబడుతుంది. 'పొలం పిలుస్తోంది', 'చంద్రన్న రైతుక్షేత్రం' వంటి వినూత్న పథకాల ద్వారా వ్యవసాయరంగాన్ని ఆర్థికంగా లాభసాటిరంగంగా మార్చడానికి తగిన ప్రయత్నాలు చేపడుతున్నాం. పరిశోధన, విస్తరణలను బలోపేతం చేయడానికి 6,354 మంది మల్టీపర్పస్ విస్తరణ అధికారుల (ఎంపిఈవోస్) సేవలు వినియోగించబడుతున్నాయి. తన పాదయాత్రలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు గారు రైతులు పడుతున్న కష్టాలను చూసి చలించిపోయారు. రైతులు

ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలను పరిష్కరించే క్రమంలో మేము అమలుచేస్తున్న ఈ బహుముఖీన వ్యూహం ఆ అనుభవాల నుండి రూపుదిద్దుకున్నదే. వ్యవసాయం, ఇతర రంగాల అభివృద్ధికి వివిధ శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలను సమీకరించడం, సమన్వయించడం ఈ వ్యూహంలో ప్రధాన భాగం. అటువంటి సమన్వయాన్ని సాధించే దిశగా ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నాం. వ్యవసాయం, అగ్రిప్రాసెసింగ్, మార్కెటింగ్, గిడ్డంగులు, పశుసంవర్ధక శాఖ, పాడిపరిశ్రమ, మత్స్యశాఖల గౌరవమాత్యులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుగారు సమగ్ర వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

**సాగునీటి రంగం**

49. రాష్ట్రానికి గోదావరి, కృష్ణా, పెన్నా, నాగావళి, వంశధార, అనే ఐదు నదులు వరదానంగా లభించాయి. ఈ ఐందింటి కింద భారీ, మధ్య, చిన్నతరహా సాగునీటి పారుదల కింద 101 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది.

50. రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు ఆవశ్యకతను గుర్తించి భారతప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఒక జాతీయస్థాయి ప్రాజెక్టుగా ప్రకటించింది. అంతేకాక, సాగునీటి ప్రయోజనాల కోసం ఈ ప్రాజెక్టు అభివృద్ధి, నియంత్రణ మొత్తం కేంద్రప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంటుందని ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధికారులు సభ్యులుగా భారత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు అధారిటి (పిపిఎ)ను ఏర్పరచింది. ప్రాజెక్టుకు సంబంధించిన అటవీ, పర్యావరణ అనుమతుల మంజూరుతోపాటు, పునరావాస కార్యక్రమాలను కూడా ఈ అధారిటి పర్యవేక్షిస్తుంది. ఈ ప్రాజెక్టు 2018 మార్చి నాటికి పూర్తి కావలసి ఉంది.

51. దేశంలో నదుల అనుసంధానానికి సంబంధించిన మొదటి పథకం కూడా ఇదే. ఈ పథకం కింద 80 టిఎంసిల గోదావరి జలాలను కృష్ణానదితో అనుసంధానం చేసి తద్వారా 7లక్షల ఎకరాలకు సాగునీరు అందించనుంది. విశాఖపట్నం నగర పారిశ్రామిక, మంచినీటి అవసరాలకుగాను 23.44 టిఎంసిల నీటిని అందించడంతోపాటు, 960 మెగావాట్ల విద్యుత్తును కూడా ఉత్పత్తి చేయనుంది.

52. ఈ పథకం పూర్తి కావటానికి మరొక మూడు, నాలుగేళ్ళు పట్టనున్నందున పశ్చిమగోదావరి జిల్లాలోని పట్టిసీమ గ్రామం వద్ద ఒక ఎత్తిపోతల పథకం చేపట్టనున్నాం. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) ఈ పథకం ద్వారా 80 టిఎంసిల గోదావరి జలాలను కృష్ణానదికి అనుసంధానం చేయనున్నాము. ప్రస్తుతం వృథాగా ప్రవహించి పోతున్న ఈ జలాలను ఈ విధంగా వినియోగించడం ద్వారా ప్రజల తాగునీటి అవసరాలు, పారిశ్రామిక అవసరాలు తక్షణం తీరనున్నాయి. (ప్రతిపక్ష సభ్యులచే స్వల్ప అంతరాయం)

53. చిన్నతరహా నీటిపారుదల రంగంలో నాబార్డు సహకారం, ఏఐబిపి, ఏపిఐఎల్ఐపి, ఆర్ఆర్ఆర్, గిరిజన ఉపప్రణాళిక, షెడ్యూల్డు కులాల ఉపప్రణాళికల కింద కొత్త ఆయకట్టు కల్పించడం కోసం ప్రస్తుతం వివిధ పథకాల కింద ఉన్న 25లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం కోసం కృషి జరుగుతున్నది.

54. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 1,116 పథకాల కింద 7లక్షల ఎకరాల ఆయకట్టును పరిరక్షిస్తున్నది. నాబార్డ్, ఎఐబిపి, మరియు రాష్ట్ర ప్రణాళికా నిధుల కింద రూ.640 కోట్ల అంచనా వ్యయంతో 1.39 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు కల్పన కోసం 92 పథకాలు నిర్మాణంలో ఉన్నాయి.

55. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.5,258 కోట్లు ప్రతిపాదించనైనది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

**సంఘటిత అభివృద్ధి, దారిద్ర్య నిర్మూలన**

56. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల జనాభా 84.45 లక్షలు. రాష్ట్రం మొత్తం జనాభాలో వారిది 17.1 శాతం. ఒక బహుముఖీన అభివృద్ధి వ్యూహం ద్వారా షెడ్యూల్డ్ కులాల జనాభాకు సాధికారికత సమకూర్చేదిశగా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

57. ఈ వ్యూహంలో షెడ్యూల్డ్ కులాల బాలబాలికల విద్యాభివృద్ధికి చేయూతనందించడం ప్రధాన కార్యక్రమం. 1450 వసతిగృహాలలో నివసిస్తున్న 1.45లక్షల మంది విద్యార్థులకు నివాస, భోజన, విద్యా సదుపాయాలకు ప్రభుత్వం పూర్తి తోడ్పాటును అందిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 177 గురుకుల పాఠశాలల ద్వారా 1,24,000 మంది విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తున్నది. ఈ సంస్థ పాఠశాలలు రాష్ట్రస్థాయి పరిపాలకంగా కన్నా మిన్నగా వరుసగా ఉన్నత ఫలితాలను సాధిస్తున్నది. షెడ్యుల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగుతులు అల్పసంఖ్యాక వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ గురుకుల పాఠశాలలను సాధిస్తున్న ఫలితాల్ని దృష్టిలో పెట్టుకుని మేము సంక్షేమశాఖల వసతి గృహాలన్నిటినీ దశలవారీగా గురుకుల పాఠశాలలుగా మార్చడానికి నిశ్చయించాం. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) వీరి సంక్షేమం కొరకు అమలవుతున్న మరొక ముఖ్య కార్యక్రమం విద్యార్థులకు ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ ఉపకారవేతనాల మంజూరు.

58. షెడ్యూల్డ్ కులాలకు చెందిన పేద విద్యార్థులకు విదేశాలలో ఉన్నతవిద్యను అభ్యసించడానికి వీలుగా అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి సహాయపడుతుంది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) ఎన్టీఆర్ విద్యోన్నతి పేరిట 2015-16 నుంచి అమలు జరుగనున్న కొత్తపథకం కింద ప్రతిభావంతులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరు కావటానికి ఉత్తమ కోచింగ్ సంస్థల ద్వారా శిక్షణ ఇవ్వబడుతుంది.

59. షెడ్యూల్డ్ కులాల సాధికారికత దిశగా మరొక ముఖ్యమైన చర్య షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టడానికి వీలుగా ఆర్థికసహాయం అందించడం. ఈ ఆర్థికసహాయం ఏ.పి.షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సొసైటీ లిమిటెడ్ ద్వారా యూనిట్ కాస్ట్‌లో 60 శాతం మేరకు సబ్సిడీ రూపంలో అందించడం జరుగుతుంది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

60. షెడ్యూల్డ్ కులాల సాధికారికతకు చేపట్టిన మూడో ముఖ్యమైన చర్య షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళికను అమలు పరచడం, సాధారణ ప్రజనీకానికి, షెడ్యూల్డ్ కులాలకూ మధ్య అభివృద్ధిలో ఉన్న వ్యత్యాసాలను పూరించే దిశగా వ్యక్తులకూ, కుటుంబాలకూ, జనావాసాలకూ ప్రత్యక్షంగానూ, నిర్దిష్టంగానూ లాభించే వివిధ కార్యక్రమాలను సంబంధిత శాఖలు రూపొందించి అమలు చేసేవిధంగా షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళికను అమలు చేయడం జరుగుతున్నది.

61. ఇందుకు గాను 2015-16 బడ్జెట్ అంచానాల్లో రూ.2,123 కోట్లు ప్రతిపాదించనైనది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

**గిరిజన సంక్షేమం**

62. రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగల జనాభా 27.39లక్షలు. వీరు రాష్ట్రజనాభాలో 5.53 శాతం ఉన్నారు. మొత్తం 34 గిరిజన తెగలు ఉండగా వారిలో 6 తెగలను ప్రత్యేకంగా బలహీన గిరిజన తెగలు (పిటిజిలు)గా గుర్తించడం జరిగింది.

63. షెడ్యూల్డ్ తెగలకు సంబంధించి ఆర్థికపరమైన, విద్యాపరమైన సమానతతోపాటు మానవ వనరుల అభివృద్ధి మీద దృష్టి పెట్టి వారి సత్వర అభివృద్ధి సాధించడం కోసం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళిక చట్టాన్ని పటిష్టంగా అమలుచేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

64. గిరిజన ప్రాంతాల్లో షెడ్యూల్డ్ తెగల విద్యాభివృద్ధి ప్రభుత్వం నిర్దేశించుకున్న ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. 1,50,346 మంది విద్యార్థులకు హాస్టళ్ళు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలను, ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి, ఎన్టీఆర్ విద్యోన్నతి వంటి పథకాలను అమలు చేయడం ద్వారా గిరిజన సంక్షేమశాఖ బడ్జెట్‌లో దాదాపు 79 శాతం విద్యాకార్యక్రమాలకే కేటాయించడం జరిగింది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

65. సామాజిక సాధికారికత మిషన్‌ను అమలు చేయడంలో భాగంగా గిరిజన యువతకు ఉద్యోగవకాశాలు మెరుగుపర్చడం కోసం వారికి తగిన నైపుణ్యాల కల్పన మీద ప్రభుత్వం దృష్టి పెట్టింది. వివిధ జీవనోపాధి అవకాశాలకూ స్వయం ఉపాధికీ సహకరించే విధంగా ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి యూనిట్ కాస్ట్‌లో 60 శాతం, లేదా లక్ష రూపాయలు, ఏది తక్కువ అయితే ఆ మేరకు ప్రభుత్వం ఆర్థికసహాయం కూడా అందిస్తున్నది.

66. షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా 2015-16లో కొన్ని నూతన కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టనుంది. వసతి గృహాలను గురుకుల పాఠశాలలుగా మార్చడం, తాగునీరు, ఇతర సదుపాయాల కల్పన, గిరిజన యువతులకు వివాహ సందర్భంగా రూ.50,000 మేరకు ఆర్థికసహాయం అందించే గిరిపుత్రికా కల్యాణ పథకం, చివరి మెట్టు వరకు అన్ని కార్యక్రమాలను ఆన్‌లైన్ ద్వారా సమీక్షించి, తద్వారా పారదర్శకతను పెంపొందించడం వంటివి అటువంటి కొన్ని కొత్త పథకాలు.

67. ఇందుకు గాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.993 కోట్లు ప్రతిపాదించనైనది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

**వెనుకబడిన తరగతుల సంక్షేమం**

68. వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థుల కోసం రాష్ట్రంలో 177 బాలుర వసతి గృహాలు, 172 బాలికల వసతి గృహాలు పనిచేస్తున్నాయి. వీటిలో 16,863 మంది బాలురు, 14,478 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. వెనుకబడిన తరగుతుల విద్యార్థులు ఉన్నతవిద్యను అభ్యసించడానికి వీలుగా ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలోనూ బాలురకోసం, బాలికల కోసం ఒక్కొక్క హాస్టల్ చొప్పున నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది.

69. పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాల పథకంలో భాగంలో అర్హులైన బి.సి.విద్యార్థులందరికీ ఉపకార వేతనాలు, ట్యూషన్ ఫీజు చెల్లించబడుతున్నాయి. అర్హులైన ఇబిసి విద్యార్థులకు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించబడుతున్నది. వెనుకబడిన తరగతులకు చెందిన విద్యావంతులయిన నిరుద్యోగ యువత వివిధ పోటీపరీక్షల్లో తక్కిన వారితో దీటుగా పోటీ పడడానికి రాష్ట్రంలో13 బిసి స్టడీ సర్కిళ్ళ ద్వారా ఉచిత శిక్షణ అందజేయబడుతున్నది.

70. బిసి విద్యార్థుల కోసం మహాత్మ జ్యోతిబా ఫూలే బిసి గురుకుల పాఠశాలలు 31 నడుస్తున్నాయి. వాటిలో 17 బాలుర కోసం, 14 బాలికల కోసం నడుస్తున్నాయి. వీటిలో 11,435 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

71. అంతేకాక వెనుకబడిన తరగతుల కోసం ఒక సమగ్ర ఉపప్రణాళిక రూపకల్పనకు చర్యలు మొదలు పెట్టామని సంతోషంగా తెలియజేస్తున్నాను. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు) రానున్న కాలంలో ఈ ఉపప్రణాళిక మరింత సమగ్రతను సంతరించుకోనున్నది. దీని ద్వారా నేతపనివారు, మత్స్యకారులు, వడ్డెరలు, చేతివృత్తులవారు, గొర్రెల కాపరులు మరియు ఇతర వెనుకబడిన తరగతుల వారు లబ్ది పొందనున్నారు. ఆదరణ పథకం ద్వారా వెనుకబడిన తరగతులకు ఆర్థికసహాయం అందజేయబడుతుంది. ప్రస్తుతం నిర్వీర్యంగా ఉన్న వివిధ వెనుకబడిన తరగతుల సహకార సమాఖ్యలను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోనున్నాం. కాపుల

సంక్షేమం కోసం రూ.100కోట్లు, బ్రాహ్మణుల సంక్షేమం కోసం రూ.35కోట్లు కేటాయించడం జరిగింది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

72. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.3,231 కోట్లు ప్రతిపాదించడమైనది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

**మైనారిటీల సంక్షేమం**

73. ఆర్థికాభివృద్ధిలో మైనారిటీ వర్గాలకు సముచిత వాటా కల్పించడం, ప్రస్తుతం నడుస్తున్న పథకాల ద్వారా, కొత్త పథకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధి పథకాలకూ, ఆర్థికాభివృద్ధి పథకాలకూ మెరుగైన రుణసదుపాయం కల్పించడం, కేంద్ర-రాష్ట్ర సంస్థల్లో ఉద్యోగాలు పొందడం కోసం అవసరమైన నైపుణ్యాలు కల్పించడం, సాంకేతిక శిక్షణ కల్పించడం ఈ శాఖ ముఖ్యోద్దేశాలు. ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ ఉపకారవేతనాల మంజూరు, బ్యాంకుల ద్వారా అందజేసే రుణాలకు సబ్సిడీ మంజూరు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల నిర్వహణ, పోటీపరీక్షలకు శిక్షణ ఈ శాఖ చేపడుతున్న ముఖ్య కార్యక్రమాలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీల సంక్షేమం వారు బ్యాంకు రుణాలకు జతగా యూనిట్ కాస్ట్‌లో లక్ష రూపాయల మేరకు, లేదా 50 శాతం మేరకు ఏది తక్కువయితే ఆ మేరకు సబ్సిడీ అందజేస్తున్నారు. దుకాన్-మకాన్, షాదీఖానా, రోష్నీ అనే పథకాలు అమలుజేయబడనున్నాయి. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.

74. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.379 కోట్లు ప్రతిపాదించనైనది. (ప్రతిపక్ష సభ్యులు శ్రీ జలీల్ ఖాన్ 'ఇంత అన్యాయం ఏమిటి సార్' అన్నారు)

**స్త్రీ-శిశు సంక్షేమం**

75. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో 41,982 అంగన్‌వాడీ కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో 4,248 కేంద్రాలు, గిరిజన ప్రాంతాల్లో 2,169 కేంద్రాలు పని చేస్తున్నాయి. ఇవికాక 6,839 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కూడా పనిచేస్తున్నాయి. సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్), సమగ్ర శిశు సంరక్షణ పథకం (ఐసిపిఎస్) ఈ శాఖ ముఖ్య కార్యక్రమాలు. పౌష్టికాహార పథకం కింద ఆరేళ్ల లోపు వయసు గల దాదాపు 26.45 లక్షల మంది శిశువులు, 8.56 లక్షల మంది గర్భిణీ స్త్రీలు, బాలింతలు లబ్ధి పొందుతున్నారు.

76. రాష్ట్రంలో అధిక శాతం మాతా శిశుమరణాలు సంభవిస్తున్నట్టుగా గుర్తించిన 104 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోని గర్భిణీస్త్రీలకు, బాలింతలకూ రోజువారీ క్యాలరీ అవసరాల్లో 50 శాతం మేరకు, ప్రొటీన్లు, కాల్షియం అవసరాల్లో 40 శాతం మేరకు తీర్చడం కోసం

ప్రభుత్వం 'అన్న అమృత హస్తం' పథకాన్ని ప్రవేశపెట్టింది. (ట్రెజరీ బెంచెస్‌చే చప్పట్లు) ఈ పథకం కింద 3.54 లక్షల మంది స్త్రీలకు రూ.104 కోట్ల వ్యయంతో లబ్ధి చేకూర్చడం జరుగుతుంది. స్త్రీలకు, శిశువులకు సంబంధించిన సంరక్షణ, సాధికారికత చర్యలను అమలుపర్చడానికి కూడా ప్రభుత్వం మరెన్నో పథకాలు అవలుచేస్తున్నది.

77. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.1080 కోట్లు ప్రతిపాదించడమైనది.

## వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమం

78. వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమ శాఖ విభిన్న సామర్థ్యాలు కల్గిన బాలబాలికల కోసం 20 హాస్టళ్లు, 2 నిలయాలు, 6 గురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్నది. అటువంటి బాలబాలికలకు ప్రీ-మెట్రిక్ మరియు పోస్ట్-మెట్రిక్ ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నది. ఆర్థిక పునరావాసం, వివాహాలకు ప్రత్యేక అవార్డులతోపాటు, విద్యార్థులకు ప్రత్యేక బోధన సామగ్రి పంపిణీ కూడా శాఖ చేపడుతున్నది.

79. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ. 45 కోట్లు ప్రతిపాదించడమైనది.

## చేనేత మరియు జౌళి

80. కోటయ్య కమిటీ సిఫారసుల ప్రకారం నేతమగ్గాలు, మరమగ్గాల మీద పనిచేస్తున్న నేత పనివారలకు రుణమాఫీ పథకాన్ని అమలుచేయడం జరుగుతుంది. దీనివల్ల 7,748 గ్రూపులకు చెందిన 20,747 మంది నేత పనివారు లబ్ధి పొందనున్నారు. ఇందుకుగాను రూ.169 కోట్లు ఖర్చు కాగలదని అంచనా. ఇందుకు తగిన విధి విధానాలు రూపకల్పనలో ఉన్నాయి.

81. 2014-15 లో 28 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు చెందిన నేతపనివారలకు ప్రయోజనం కలిగించే విధంగా రూ.56 లక్షలు షేర్ కాపిటల్ కాంట్రిబ్యూషన్ విడుదల చేయడం జరిగింది.

82. ప్రాథమిక చేనేతకారుల సహకార సంఘాలకూ, ఏసిసి హోల్డర్లకూ, మరియు ఆప్కోకూ పావలా వడ్డీ పథకం కింద రూ.3.08 కోట్లు విడుదల చేయడం జరిగింది.

83. 2014-15 లో 278 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు నూలుకండెలు, రంగులు, రసాయనాల కొనుగోలుకు గాను రూ.1.21 కోట్లు సబ్సిడీగా విడుదల చేయడం జరిగింది.

84. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ. 46 కోట్లు ప్రతిపాదించడమైనది.

## గృహనిర్మాణం

85. ఆంధ్రప్రదేశ్‌ను గుడిసెలు, మురికివాడలు లేని రాష్ట్రంగా రూపొందించడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టడం గృహనిర్మాణ శాఖ లక్ష్యం. ఈ దిశగా షెడ్యూల్డ్ తెగలకు యూనిట్ కాస్ట్‌ను ఒక్కొక్క ఇంటికీ రూ.1.50 లక్షలకు, ఇతర లబ్దిదారులకు రూ.లక్షకు పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. (ట్రెజరీ బెంచీల నుండి చప్పట్లు) 2015-16 లో 2.07 లక్షల కొత్త ఇళ్లు నిర్మించనున్నాం. 2004-05 నుండి ఇప్పటిదాకా నిర్మించిన 41.35 లక్షల ఇళ్ల లబ్ధిదారులకు ఆధార్‌తో అనుసంధానం చేసి జియో ట్యాగింగ్ చెయ్యాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటిదాకా 33.48లక్షల ఇళ్లకు ఆధార్ అనుసంధానం పూర్తికాగా 26.22 లక్షల ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తయింది. లబ్దిదారులకు చెందిన మొత్తం సమాచారాన్ని గృహ నిర్మాణ శాఖ వారి వెబ్‌సైట్‌లో పొందుపరచడమే కాక, మొత్తం నిధులు ఆన్‌లైన్ ద్వారానే విడుదల చేయడం జరుగుతుంది.

86. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ. 897 కోట్లు ప్రతిపాదించడమైనది.

(ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు, ప్రతిపక్ష సభ్యులు షేమ్ అని అన్నారు)

**పౌర సరఫరాలు**

87. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు ఆహారభద్రత అవసరాలను తీర్చడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నది.

88. కుటుంబంలో ఉన్న సభ్యులతో నిమిత్తం లేకుండా ప్రస్తుతమున్న కార్డుల మీద ప్రతి ఒక్క కుటుంబ సభ్యుడికి 5కిలోల బియ్యం పంపిణీని ఉద్దేశిస్తున్న జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013 ను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయాలనుకుంటున్నది.

(ట్రెజరీ బెంచెస్ నుంచి హర్షధ్వానాలు)

89. సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన బియ్యం అందించడానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. సంక్రాంతి పండగ సందర్భంగా చంద్రన్న సంక్రాంతి కానుక పేరిట 6 రకాల ఆహార దినుసులను ప్రభుత్వం అందించినందువల్ల దారిద్ర్యరేఖ దిగువనున్న ప్రతి కుటుంబ వదనంలో సంతోషం వెల్లివిరిసింది.

(ట్రెజరీ బెంచెస్ నుంచి హర్షధ్వానాలు)

90. రేషన్ కార్డులను ఆధార్ నంబర్‌కు అనుసంధానం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. రాష్ట్రంలోని 28,953 చౌకధరల దుకాణాలలో దశలవారీగా ఈ-పిఓఎస్ యంత్రాలు నెలకొల్పాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. తూర్పుగోదావరి జిల్లాలో

100 చౌకధరల దుకాణాల్లో ఈపిఓఎస్ మిషన్‌ల ద్వారా చేపట్టిన పైలట్ ప్రాజెక్ట్ వల్ల 15 శాతం మిగులు కనబడింది.

91. 2014-15 సంవత్సరంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న అర్హులైన మహిళలందరికీ 3.12 లక్షల దీపం కనెక్షన్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

(ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

92. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నది. వరి పంటకు రైతుకు కనీస మద్దతు ధర పొందడానికి వీలుగా స్వయం సహాయక బృందాల ద్వారా తగినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుత సంవత్సరంలో ఇంతవరకూ ఎన్నడూ లేని విధంగా 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది. దీనివల్ల స్వయం సహాయక బృందాలకు కమిషన్ రూపంలో చెప్పుకోదగ్గ ఆదాయం కూడా సమకూరింది. ప్రస్తుత సంవత్సరంలో 3.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా మిల్లు లెవీ రూపంలో సేకరించడం జరిగింది.

93. అత్యవసర వస్తువుల ధరలు నియంత్రించడం కోసం తగిన చర్యలను ఎప్పటికప్పుడు తీసుకోవడం జరుగుతుంది. అక్రమంగా సరుకులు నిలువ చేసేవారినీ, నల్లబజారుకు తరలించేవారినీ అత్యవసర సరుకుల చట్టం ప్రకారం కనుగొని, ఆ విధంగా పట్టుబడ్డ సరుకుల్ని జప్తు చేసి, వారి లైసెన్సులు రద్దు చేయడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నది.

94. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ. 2,459కోట్లు ప్రతిపాదించడమైనది.

(ట్రెజరీ బెంచెస్ బల్లలు చరచడంద్వారా తమ హర్షాన్ని వ్యక్తం చేశారు)

## ఆరోగ్యం, వైద్యం, కుటుంబసంక్షేమం

95. నాణ్యమైన, సత్వర వైద్య సేవలను, వైద్య విద్యను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన బాధ్యత. ఈ బాధ్యతను నెరవేర్చడానికి వీలుగా ఈ శాఖకు అవసరమైన పూర్తి సహాయం అందించబడుతున్నది.

96. డా. నందమూరి తారకరామారావు వైద్య సేవ, (ట్రెజరీ బెంచెస్ నుండి హర్షాతిరేకాలు) గ్రామీణ అత్యవసర ఆరోగ్య రవాణా వ్యవస్థ (108 సర్వీసులు), నిర్దిష్ట తేదీనాడు వైద్య సేవలు అందించే కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను బలోపేతం చేయడంతోపాటు, ప్రభుత్వం ఆరోగ్య శాఖకు బడ్జెట్ కేటాయింపులను గణనీయంగా పెంచడం ద్వారా వైద్య ఆరోగ్య కార్యక్రమాలను మరింత విస్తరించనున్నది. భద్రత, పారిశుధ్య సేవలు, కేంద్రీకృతంగా ఔషధాల కొనుగోలు, నిరాఘాటంగా ఆరోగ్యసేవలు అందించడం కోసం అవసరమైన అన్నిరకాల వస్తువుల సరఫరా, మొదలైన కార్యక్రమాల కోసం తగినన్ని నిధులు కేటాయించడం జరిగింది.

97. ఇందులో భాగంగా ప్రాథమిక, ద్వితీయ ఆరోగ్య రంగాలను బలోపేతం చేయడం జరుగుతుంది. ఆరోగ్య కేంద్రాల పని తీరును మెరుగుపర్చడం కోసం అవసరమైన మౌలిక సదుపాయాలనూ, ఆరోగ్య పరీక్ష సదుపాయాలనూ సమకూర్చడం, తగినన్ని ఔషధాలనూ, మందులనూ సరఫరా చేయడం, రోగులకు నాణ్యమైన ఆరోగ్య సేవలను నిరంతరాయంగా అందించడానికి అవసరమైన అన్నిరకాల సదుపాయాలను సమకూర్చడం జరుగుతున్నది.

98. నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ సేవలను అందించే విధంగా తృతీయ స్థాయి సదుపాయాల కల్పన మీద, విద్యార్థులకు గుణాత్మక వైద్య విద్యను అందించడం మీద కూడా శ్రద్ధ పెట్టడం జరుగుతుంది.

99. ఇవికాక, విశాఖపట్నంలో విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను నిర్వహణలోకి తీసుకురావటంతోపాటు బోధన ఆసుపత్రులను అత్యాధునిక సాంకేతిక సామగ్రితోనూ, మరింత నాణ్యమైన సమర్థవంతమైన సేవలతోనూ బలోపేతం చేయడం జరుగుతుంది.

100. జాతీయ ఆరోగ్య మిషన్ కింద మెరుగైన మాతా శిశు ఆరోగ్య సేవలను, ఇతర కుటుంబ సంక్షేమ సేవలను మరింత మెరుగైన రీతిలో అందించడానికి మా ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ప్రసూతి, శిశు మరణాల రేటును మరింత తగ్గించడానికి జాతీయ ఆరోగ్య మిషన్ కింద మరింత అధికంగా కేటాయింపులు చేయడం కోసం భారత ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించడం జరుగుతున్నది. ఎ.ఐ.యమ్.యస్. తరహా సంస్థ స్థాపనకు చర్యలు తీసుకుంటున్నాము.

101. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.5728 కోట్లు ప్రతిపాదించడమైనది.

**పాఠశాల విద్య**

102. అందరికీ విద్యనందించడం కోసం మన ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆ దిశగా ఎన్నో ముఖ్యమైన పథకాలనూ, కార్యక్రమాలనూ అమలుచేస్తున్నది.

103. ఈ దిశగా భారతప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలలో ఒకటైన సర్వ శిక్షా అభియాన్‌ను రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యతతో అమలుచేయడం జరుగుతున్నది. 6-14 సంవత్సరాల మధ్య గల పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం, వారు కనీసం 8 సంవత్సరాల ఎలిమెంటరీ విద్యను పూర్తి చేసుకునేలా సహకరించడం, లింగపరంగానూ, సామాజికవర్గ పరంగానూ ఉన్న వ్యత్యాసాలను తగ్గించడం, నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించడం ఆ పథకం ముఖ్య లక్షణాలు.

104. 2014-15లో కొత్తగా 48 ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించబడ్డాయి. 11 పాఠశాలలు ప్రాథమికోన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ కాబడ్డాయి. 2,441 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి ప్రారంభించబడింది. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులందరికీ ఇన్ సర్వీస్ శిక్షణ ఇవ్వబడింది. 33 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ 2జతల చొప్పున యూనిఫాం అందించబడింది. విద్యాపరంగా వెనుకబడ్డ మండలాల్లో సామాజికంగా వెనుకబడ్డ బాలికలకు గుణాత్మకంగా విద్యను అందుబాటులోకి తీసుకురావడం కోసం 352 కస్తూర్బా గాంధీ బాలికావిద్యాలయాలు నెలకొల్పబడ్డాయి. అవి ఎలిమెంటరీ స్థాయి దాకా విద్యనందిస్తున్నాయి.

105. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, విద్యార్థుల హాజరు పెంపొందించడం, డ్రాప్ఔట్ రేట్లను తగ్గించడం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో 'బడి పిలుస్తోంది' అనే కార్యక్రమాన్ని గౌరవనీయ ముఖ్యమంత్రివర్యులు 25.7.2014న అనంతపురం జిల్లాలో ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా 6,33,528మంది విద్యార్థులు ఒకటవ తరగతిలో చేరారు. బడిలో చేరకుండా బయట ఉన్న 25,923మంది విద్యార్థులు కూడా బడికి చేరుకున్నారు.

106. 47,635 పాఠశాలల్లో 44లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయబడుతున్నది.

107. భారతప్రభుత్వం మన రాష్ట్రానికి 163 మోడల్ పాఠశాలలను మంజూరు చేసింది. ఈ పాఠశాలల్లో క్రీడలు, వినోదం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలకు చాలినంత అవకాశముంది. ఈ పాఠశాలల్లో కంప్యూటర్ సదుపాయం, ఇంటర్నెట్, పూర్తిస్థాయి కంప్యూటర్ ఉపాధ్యాయులూ ఉన్నారు. ఒక్కొక్క పాఠశాలకూ రూ.302 లక్షల చొప్పున 163 పాఠశాలలకు భవనాలు, ఫర్నిచర్, కంప్యూటర్‌లు, లాబరేటరీలు సమకూర్చడానికి రూ.492 కోట్లు ఖర్చు చేయడం జరిగింది.

108. ప్రస్తుత సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 3 కోట్ల పాఠ్యపుస్తకాలు సరఫరా చేయడం జరిగింది.

109. ఎస్‌సిఇఆర్‌టి ద్వారా పాఠశాల విద్యార్థులకూ, డిఇడి, బిఇడి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వీడియో పాఠాలు రూపొందించడం జరిగింది. ఇప్పటిదాకా 820 వీడియో పాఠాలు పబ్లిక్ లైబ్రరీల వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరిగింది.

110. 14 నుంచి 18 మధ్య వయసు గల పిల్లలకు విద్యనందిస్తూ మాధ్యమిక విద్య ఎలిమెంటరీ మరియు ఉన్నత విద్యారంగాల మధ్య ఒక సేతువుగా పనిచేస్తుంది. కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకమైన రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎమ్ఎస్ఎ) నాణ్యమైన మాధ్యమిక విద్యను అందుబాటులోకి తీసుకురావడం కోసం కృషి చేస్తున్నది. గుణాత్మక విద్యనందించడం మౌలికసదుపాయాల కల్పన, సమత్వసాధన ఈ పథకం ముఖ్య ఉద్దేశాలు.

111. 10,313 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గాను డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డిఎస్‌సి) 2014 నోటిఫికేషన్ విడుదల చేయబడింది.

112. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.14,962కోట్లు ప్రతిపాదించడమైనది.

**ఇంటర్మీడియట్ విద్య**

113. రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో 444 జూనియర్ కళాశాలలు, 131 ప్రైవేట్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు పనిచేస్తున్నాయి. కాలేజీ లేని మండలాల్లో ప్రైవేటు జూనియర్ కళాశాలల స్థాపనకు గాను ప్రభుత్వం ఇన్‌సెంటివ్ జూనియర్ కళాశాలల పథకాన్ని ప్రవేశపెట్టింది. 2014-15 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలన్నిటిలోనూ 5.07లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

114. ఈ శాఖకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ. 585 కోట్లు ప్రతిపాదించడమైనది.

115. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ప్రాకృతిక మానవ వనరులను వినియోగించుకోవడం ద్వారా రానున్న కొంత కాలంలో రాష్ట్రాన్ని ఒక అంతర్జాతీయ విద్యాకేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షిస్తున్నది. రాష్ట్రాన్ని ఒక విజ్ఞాన సమాజంగా అభివృద్ధి పరచడమే కాక, దేశంలోనూ, ప్రపంచంలోనూ కూడా ఎన్నో నైపుణ్యాల కల్పనకు ఒక గమ్యంగా రూపొందించాలని కూడా ప్రభుత్వం భావిస్తున్నది. నైపుణ్యాల కల్పన, పరిశోధన, సాంకేతిక సలహాలతో పాటు, ప్రపంచస్థాయి అనుసంధానాన్ని కూడా ప్రోత్సహించడం జరుగుతున్నది. అన్ని వర్గాలనూ కలుపుకుపోయే విధంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించే విధంగా ఉన్నతవిద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావటానికీ, ఉన్నతవిద్యాసంస్థల్లో బోధించే బోధనను మెరుగుపర్చడానికీ, బోధనాంశాలను ప్రయోజనకరంగా ఉండేటట్లు చూడటానికి ప్రభుత్వం

ఎన్నో చర్యలు చేపట్టింది. రానున్న విద్యాసంవత్సరం మొదలయ్యే లోపే రాష్ట్రంలో ఐఐఎం, ఐఐటి, ఐఐఎస్ఇఆర్, ఐఐఐటి, ఎన్ఐటి, సెంట్రల్ యూనివర్సిటీ, పెట్రోలియం యూనివర్సిటీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిశాస్టర్ మేనేజ్‌మెంట్, గిరిజన విశ్వవిద్యాలయాలు వంటి ప్రతిష్ఠాత్మక జాతీయస్థాయి విద్యాసంస్థలను నెలకొల్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నవి.

116. విశ్వవిద్యాలయాల్లోను, కళాశాలల్లోనూ అనుభవజ్ఞులైన సిబ్బంది సేవలను వినియోగించుకునే ఉద్దేశంతో ప్రభుత్వం బోధన, బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయస్సును మరొక రెండు సంవత్సరాలు పెంచింది. (ట్రెజరీ బెంచీల నుండి హర్షధ్వానాలు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో ప్రసిద్ధ విద్యావేత్తలతో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆధునిక అవసరాలకు తగ్గట్లుగా ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల చట్టం 1991ని సమీక్షించడం ఈ కమిటీ ఉద్దేశం. ఉన్నతవిద్యలో నాణ్యతను పెంపొందించడానికి రాష్ట్రస్థాయి ఎసెస్‌మెంట్ మరియు ఎక్రెడిటేషన్ కౌన్సిల్‌ను నెలకొల్పడానికి కూడా ప్రయత్నాలు మొదలయ్యాయి. ముఖ్యరంగాల్లో పరిశోధనను ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రీసెర్చి బోర్డు కూడా నెలకొల్పబడుతోంది. కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకమైన రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ కింద రూ.1747కోట్ల సహాయం కోసం భారతప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించబడ్డాయి.

117. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చడం కోసం ప్రభుత్వం 120 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో శిక్షణ కార్యక్రమం మొదలుపెట్టింది. కళాశాలల్లోని షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల విద్యార్థులందరికీ ఈ శిక్షణ ఉచితం. 2014-15 లో 17,123 మంది విద్యార్థులకి శిక్షణ ఇవ్వగా, ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు చెందిన 3,817 మంది విద్యార్థులకు వివిధ సంస్థల్లో, కంపెనీల్లో ఉద్యోగావకాశాలు దొరికాయి. ఈ మధ్యనే జెకెసి స్టూడెంట్ మెటీరియల్ ప్రచురించి, విద్యార్థులందరికీ అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.

118. సంప్రదాయికంగా బోధిస్తున్న విషయాల్లోనూ, కొత్తగా రూపకల్పన చేసిన విషయాల్లోనూ కూడా పాఠ్యాంశాలను 'మన టీవీ' ద్వారా ప్రసారం చేయడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రస్తుతం 45 కళాశాలల్లో ఉన్న ఇంగ్లీషు లాంగ్వేజీ లాబరేటరీలను విస్తరింపచేయటానికీ, వివిధ సంస్థలతో అనుసంధానం ద్వారా నాణ్యతను మెరుగుపర్చడానికీ ప్రతిపాదనలు ఉన్నాయి. అదేవిధంగా సాంకేతిక విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న గ్రామీణ కళాశాలలతో నైపుణ్యాలను, సదుపాయాలను పంచుకోవడం కోసం జిల్లా రిసోర్స్ కేంద్రాలు స్థాపించబడ్డాయి. కళాశాలల్లో విలువలతో కూడుకున్న విద్యను అందించడం కోసం మానవవిలువల్లో, ఉద్యోగనైతికతో 1458 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగింది.

119. 11 ఇంజనీరింగు కళాశాలలో రూ.88 కోట్ల అంచనా వ్యయంతో గుణాత్మక సాంకేతిక విద్యాభివృద్ధి కార్యక్రమాన్ని (టిఇక్యూఐపి) ప్రభుత్వం అమలుచేస్తున్నది. పాలిటెక్నిక్‌లను ఉన్నతీకరించడం, పాలిటెక్నిక్‌ల ద్వారా సామాజిక వికాసం, స్త్రీలకు ప్రత్యేక వసతిగృహాల నిర్మాణం వంటి మరికొన్ని కార్యక్రమాలు కూడా ఈ శాఖ అమలుచేస్తున్నది.

120. ఈ శాఖకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.3,049కోట్లు ప్రతిపాదించడమైనది.

గ్రామీణాభివృద్ధి శాఖ

121. దారిద్ర్య నిర్మూలన కోసం గ్రామీణాభివృద్ధి శాఖ ఎన్నో పథకాలు అమలుచేస్తున్నది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 8లక్షల కుటుంబాలకు వంద రోజుల ఉపాధి కల్పించబడింది. మొత్తం పథకం కింద రూ. 3,417 కోట్లు ఖర్చు చేయబడింది. 5.49 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించబడ్డాయి.

122. భూసారం, పచ్చదనం, జలసంపద వంటి ప్రాకృతిక వనరులు అంతరించిపోకుండా పరిరక్షించడానికీ, అభివృద్ధి పర్చడానికీ, తద్వారా నిరుపేద కుటుంబాలకు నికర జీవనోపాధి కల్పిస్తూ, వాతావరణ సమతౌల్యం కాపాడడం కోసం ఉద్దేశించబడ్డ సమగ్ర వాటర్ షెడ్ నిర్వహణ కార్యక్రమం (ఐడబ్ల్యుఎంపి) 12 డిపిఎపి/డిడిపి జిల్లాల్లో అమలు జరుగుతున్నది.

123. ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీ సాధికారికతా ఉద్యమం మొత్తం ఎస్.ఇ.ఆర్.పి నేతృత్వంలో జరుగుతోంది. తద్వారా రూపుదిద్దుకున్న ప్రభుత్వ-సామాజిక భాగస్వామ్య నమూనా నేడు జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎమ్)రూపంలో దేశమంతటా విస్తరించింది. ఇప్పటిదాకా అర్హత గలిగిన స్వయం సేవా సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా రూ.44,026 కోట్ల మేరకు బ్యాంకు రుణాలు అందాయి. సకాలంలో అప్పు చెల్లించిన వాళ్లకి ప్రోత్సాహకంగా వడ్డీ లేని రుణాల పథకం కింద రూ. 1,636 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. ఇదికాక, స్వయం సహాయక బృందాల పరపతిని ఇప్పుడున్న దానికన్నా నాలుగురెట్లు పెంచడానికి 2015-16 నుంచి క్యాపిటల్ ఇన్ఫ్యూజన్ పథకాన్ని అమలు చేయనున్నాం. స్వయం సహాయక బృందాల సభ్యుల నైపుణ్యాలు మెరుగుపరచి తద్వారా వారు ఆదాయ పరికల్పన కోసం, సాంప్రదాయేతర రంగాల్లో కూడా విస్తరించే విధంగా తద్వారా దారిద్ర్యం నుంచి బయట పడేందుకు వారికి తోడ్పాటు అందించనున్నాం.

124. ఇసుక తవ్వకాన్నీ, అమ్మకాన్నీ స్వయం సహాయక బృందాలే అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల సరసమైన ధరకు (ప్రతిపక్ష సభ్యులు సరసమైన ధరా? అని అన్నారు) ఇసుక అందుబాటులోకి రావడమే కాకుండా, ఆదాయం పక్కదారికి పోకుండా సక్రమంగా ప్రభుత్వానికి అందుతూ ప్రభుత్వాదాయం పెరిగింది కూడా. అంతేకాకుండా నదులు, వాగులు, వంకలు, పర్యావరణ వ్యవస్థకు సంభవిస్తున్న నష్టాలను అరికట్టడం

సాధ్యమవుతున్నది కూడా. ఈ నిర్ణయం అమలు చేయడం మొదలు పెట్టిన కొన్ని వారాల్లోనే 27లక్షల ఘనపుటడుగుల ఇసుక రూ.180కోట్ల మేరకు అమ్ముడుపోయింది. ఈ కార్యక్రమంలో 5,000 మంది స్వయం సహాయక బృందాల సభ్యులు ప్రత్యక్షంగా పాల్గొంటుండగా 70 లక్షలమంది సభ్యులు పరోక్షంగా లబ్ధి పొందుతున్నారు.(ప్రతిపక్షసభ్యులు పరోక్షమైన వాళ్లు ఎవరో? అని అన్నారు)

125. అలాగే బీదలు, బలహీనులందరూ ముఖ్యంగా వృద్ధులూ, వికలాంగులు కూడా గౌరవప్రదమైన జీవితం జీవించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అందుకోసం వృద్ధులకూ, వితంతువులకూ, నేతపనివారికీ, కల్లుగీత కార్మికులకూ హెచ్.ఐ.వి.బాధితులకు ప్రస్తుతం ఇస్తున్న నెలకు రూ.200 పింఛనును నెలకు రూ.1000 రూపాయలకి ప్రభుత్వం పెంపుదల చేసింది. (ట్రెజరీ బెంచీల నుండి చప్పట్లు) 40-79 శాతం మేరకు వైకల్యం కలిగిన వికలాంగులకు రూ.500 నుండి 1000 రూపాయలకు, 80 శాతం కన్నా ఎక్కువ వైకల్యం కల్గిన వికలాంగులకు నెలకు రూ.1500కు పెంచింది. ఈ పెంచిన రేట్లు సెప్టెంబరు 2014 నుండి అమలులోకి వచ్చాయి. అక్టోబరు 2, 2014 నుండి చెల్లించబడుతున్నాయి. 2015 జనవరిలో సుమారు 41 లక్షల మంది పింఛనుదారులకు ఆధార్‌తో అనుసంధానించబడి పెన్షన్లు చెల్లించబడ్డాయి.

126. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.8,212 కోట్లు ప్రతిపాదించడమైనది.

(ట్రెజరీ బెంచెస్ బల్లలు చరచడం ద్వారా తమ హర్షాతిరేకాలు వ్యక్తపరిచారు)

**పంచాయితీరాజ్**

127. గ్రామీణ ప్రజలకు తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధిదీపాలు, పంచాయితీ భవనాలు వంటి మౌలిక సదుపాయాలు మరియు పాలనా సేవలు అందించడానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధ్యానత నిచ్చింది.

128. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కార్యక్రమంతోపాటు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన రహదారులను బిటి ప్రమాణాల స్థాయికి అభివృద్ధి చేయడం కోసం రాష్ట్రప్రభుత్వం ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది.

129. ఎమ్ఆర్ఆర్, సిఆర్ఆర్ మరియు ఆర్‌డిఎఫ్ కార్యక్రమాల కింద సమకూరుతున్న నిధులతో రహదారుల మరమ్మతులు చేపట్టడం జరుగుతున్నది.

130. ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయటం కోసం ప్రభుత్వం స్థానిక సంస్థల సామర్థ్యాన్ని మెరుగుపర్చడానికి కృషి చేస్తున్నది.

131. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.3,296 కోట్లు ప్రతిపాదించడమైనది.

## గ్రామీణ నీటి సరఫరా

132. నాణ్యత లోపించిన ప్రాంతాల్లోనూ, పాక్షికంగా నీటిసరఫరా అందుతున్న ప్రాంతాల్లోనూ, షెడ్యూల్ కులాల, షెడ్యూల్డ్ తెగల జనావాసాల్లోనూ రక్షిత మంచినీటి సరఫరా చేయడం, గ్రామీణ నీటిసరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ ముఖ్య కార్యక్రమం. చేతిపంపులు బిగించిన బోరుబావుల ద్వారా రక్షిత మంచినీటి సరఫరా పథకాల ద్వారా, సమగ్ర మంచినీటి సరఫరా పథకాల ద్వారా మంచినీటి సరఫరా చేపట్టబడుతున్నది. ఇందుకు అవసరమైన నిధులు ఎన్ఆర్డిడబ్ల్యుపి, రాష్ట్ర ప్రణాళిక నిధులు మరియు నాబార్డు, ప్రపంచ బ్యాంకు వంటి ఆర్థిక సంస్థలు అందిస్తున్న రుణసదుపాయం ద్వారా చేకూరుతున్నవి.

133. ప్రజలకు అందుబాటులోకి తెస్తున్న మంచినీటి నాణ్యతను మెరుగుపర్చే దిశగా రాష్ట్రప్రభుత్వం ఎన్టీఆర్ సుజల పథకాన్ని ప్రకటించింది. (ట్రెజరీ బెంచీల నుండి చప్పట్లు మరియు ప్రతిపక్ష సభ్యులు 'ఎక్కడా అందలేదు' అన్నారు) ఇందులో భాగంగా ప్రతి కుటుంబానికీ రెండు రూపాయల నామమాత్రపు ధరకు 20 లీటర్ల సురక్షితమైన మంచినీటిని సరఫరా చేపడుతున్నది.

134. టోటల్ శానిటేషన్ కేంపైన్(టిఎస్సి)ని 2014 అక్టోబరు 2 నుంచి స్వచ్ఛ భారత్ మిషన్గా పిలుస్తున్నారు. ఈ పథకం కింద నిర్మల గ్రామ పంచాయితీలను రూపొందించడానికి ప్రయత్నాలు చేపట్టబడ్డాయి.

135. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.881కోట్లు ప్రతిపాదించడమైనది.(ట్రెజరీ బెంచీలచే హర్షధ్వానాలు)

## పట్టణాభివృద్ధి

136. 97 మున్సిపాలిటీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లతో గత రెండు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్లో పట్టణీకరణ శరవేగంతో జరుగుతున్నది. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కనీసమౌలిక సదుపాయాలు కల్పించడం ఒక సవాలుగా మారింది. పట్టణ ప్రాంతాలను సమగ్రంగానూ, సమూలంగానూ అభివృద్ధి చేయటానికి రాష్ట్రప్రభుత్వం ఎన్నో విధాన నిర్ణయాలను తీసుకుని ఎన్నో చర్యలు చేపట్టింది. భారతప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల కింద నిధులు సమకూర్చుకోవడానికి క్రియాశీలక చర్యలు చేపట్టబడ్డాయి.

137. నగరవాసుల ఉన్నతవిద్య, నైపుణ్యాల కల్పన, సామాజికాభివృద్ధిని కూడా ప్రోత్సహించే విధంగానూ, రాష్ట్రాభివృద్ధికి గణనీయంగా దోహదపడేలానూ శక్తిమంతమైన నగరాలు రూపొందడానికి అనువైన సమగ్రాభివృద్ధి కోసం పట్టణాభివృద్ధి మిషన్ కృషి చేస్తుంది.

138. మున్సిపల్ ప్రాంతాల్లో దారిద్ర్య నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన మిషన్(మెప్మా) పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదలు పేదరికం నుంచీ, బలహీనత నుంచీ బయటపడ్డానికీ, తమ జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చుకోవడానికీ స్వయం సహాయక బృందాలుగా ఏర్పడడానికీ సహకరిస్తుంది. ప్రస్తుత సంవత్సరంలో 2834 స్వయం సహాయక బృందాలు, 176 ఎస్ఎల్ఎఫ్ లు, 5 టిఎల్ఎఫ్‌లు ఏర్పడ్డాయి. వీటితోపాటు ఇప్పటికే పనిచేస్తున్న 23,188 సహాయక బృందాలు మొత్తం రూ.775 కోట్ల మేరకు బ్యాంకు రుణాలు పొందగలిగాయి. 90951 స్వయం సహాయక బృందాలు రూ.110 కోట్ల మేరకు వడ్డీ లేని రుణాలు పొందాయి. ఇడిపి శిక్షణ, ఎన్టీఆర్ సుజల స్రవంతి, వంటి పథకాలు కూడా అమలు జరుగుతున్నాయి.

139. ప్రస్తుతమున్న నీటిసరఫరా వ్యవస్థనూ, మురుగునీటి వ్యవసనూ మెరుగుపర్చడం ద్వారా పట్టణ స్థానిక సంస్థల కింద ఉన్న ప్రజలకు రక్షిత మంచినీరు అందించడం, ఆరోగ్యకరమైన పరిశుద్ధ వాతావరణం కల్పించడం పట్ల ప్రభుత్వం దృష్టి పెట్టింది. జెఎన్ఎన్‌యుఆర్ఎమ్, హడ్కో, రాష్ట్ర ప్రణాళిక, ఎపిఎమ్‌డిపి వంటి పథకాల కింద నీటి పారుదల, మురుగునీటి పారుదల, వరదనీటి నిర్వహణ వంటి పథకాలకు గాను రూ.4513కోట్ల అంచనాతో 125 పథకాలు మంజూరు చేయడం జరిగింది. వీటిలో రూ.2556 కోట్ల ఖర్చుతో 69 నీటిపారుదల పథకాలు, 5 ఎస్‌డబ్ల్యుడి పథకాలు, 4 మురుగునీటి పారుదల పథకాలు, 20 మౌలిక సదుపాయాల పథకాలు పూర్తయ్యాయి. రూ.1956 కోట్ల విలువగల మిగిలిన 27 పథకాలు పురోగతిలో ఉన్నాయి. 2016 మార్చి నాటికి పూర్తికానున్నాయి. పట్టణప్రాంతాల్లో అత్యున్నత స్థాయి పరిశుభ్రతను సాధించాలన్న సమగ్ర లక్ష్యంతో పట్టణ ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, వ్యర్థ పదార్థాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టడం కోసం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ స్థాపించడం జరిగింది. పట్టణ స్థానిక సంస్థల్లో వార్షిక లెక్కల తయారీ, వాటి ఆడిట్ చాలా కాలంగా జరగటం లేదు. పట్టణ సంస్థల లెక్కలు సత్వరమే సంకలనం చేసి ఆడిట్ చేయించి, ఆడిట్ అభ్యంతరాలకు తక్షణమే సమాధానం చెప్పవలసిందిగా కఠినమైన ఆదేశాలను జారీ చేయడం జరిగింది.

140. నేషనల్ అర్బన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎన్‌యుఐఎస్) ఒక కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకం. ఈ గవర్నెన్స్‌లో భాగంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి, కీలక నిర్ణయాలు తీసుకోవడానికీ అవసరమైన సమాచార వ్యవస్థను నిర్మించడం ఈ పథకం ఉద్దేశం. ఈ పథకం మదనపల్లి, తాడేపల్లిగూడెం, ధర్మవరం, శ్రీకాకుళంలకు వర్తిస్తుంది.

**నూతన రాష్ట్ర రాజధాని**

141. ఆంధ్రప్రదేశ్ విభజన వల్ల రాష్ట్రానికి ఒక కొత్త రాజధానిని నిర్మించవలసిన తక్షణ ఆవశ్యకత ఏర్పడింది. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా ప్రజల సహకారంతో ప్రపంచస్థాయి ప్రజారాజధానిని నిర్మించడం మొదలయ్యింది. ఈ నూతన రాజధానిలో సృజనాత్మకత, నవీన కల్పనలకు నెలవుకాబోతున్నవి. మౌలిక సదుపాయాలు, పర్యావరణం, సమత, భద్రతల దృష్ట్యా అది సతతహరిత రాజధాని కానున్నది. అటువంటి ఒక రాజధానిని నిర్మించాలంటే రానున్న తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలంపాటు మనగల మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి అవసరమైన ప్రణాళిక చేపట్టవలసి ఉంది. అటువంటి మౌలిక సదుపాయాల గురించిన ముందస్తు ఆలోచన లేకుండా భవిష్యతరాల అవసరాలకు తగిన పునాది లేకుండా ఒక పెద్ద నగరాన్ని నిర్మిస్తే, రేపది పూర్తిగా నిరర్థకమైపోయే ప్రమాదముంది. సరైన ప్రణాళిక లేకుండా నిర్మించే నగరం వల్ల వనరులు వృథా కావడమే కాకుండా రాష్ట్రాభివృద్ధికి అది పెద్ద గుదిబండగా కూడా మారే ప్రమాదముంది.

142. దాదాపు 33,252 ఎకరాల విస్తీర్ణం గల ఈ నగరం అక్కడి రైతుల సమ్మతితోనే నిర్మించబడనున్నది. వారిలో ఇప్పటిదాకా దాదాపు 87శాతం మంది భూసేకరణకు అంగీకరించారు. ఈ విధంగా సేకరించిన భూమిలో 50శాతం భూమి నగరానికి అవసరమైన ఉమ్మడి సదుపాయాల కోసం ఉపయోగించబడుతున్నది. అందులో అత్యాధునిక సదుపాయాలు కల్పించబడతాయి. 25 శాతం భూమి తిరిగి మళ్లా రైతులకే అభివృద్ధి పరచిన ప్లాట్లుగా అప్పగించబడుతుంది. ఇక మిగిలిన 7,000 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వ అధీనానికి వస్తుంది. దానిలో రాష్ట్ర రాజధాని భవన సముదాయ నిర్మాణానికీ, రాజధాని నగరంలోని ప్రజలకు స్థిర ఉపాధి అవకాశాలు కల్పించడానికీ, అవసరమైన పెట్టుబడులు సమకూర్చడానికీ చర్యలు చేపట్టబడతాయి. రానున్న మూడేళ్ల కాలంలో అభివృద్ధి పరచబడ్డ భూమిని తిరిగి రైతులకు అప్పగించడం, రాజధాని భవన సముదాయ నిర్మాణం, నగరాన్ని స్వయంపోషకంగా రూపొందించడానికి అవసరమైన ఉద్యోగావకాశాల కల్పన సాధ్యపడేలా చర్యలు తీసుకుంటున్నాం. రాజధాని నిర్మాణానికి రైతులు భూములు ఇవ్వడానికి అంగీకరించడం అనేది ఒక చారిత్రాత్మక సందర్భం. రైతులకు పరిహారం చెల్లించడానికి సి.ఆర్.డి.ఎ.కు నిధులు మంజూరు చేస్తున్నాము. (ట్రెజరీ బెంచెస్‌చే హర్షాతిరేకాలు వ్యక్తం)

143. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.3,168 కోట్లు ప్రతిపాదించడమైనది.

### రోడ్లు మరియు భవనాలు

144. రాష్ట్రంలోని 46,440 కిలోమీటర్ల మేజర్ రోడ్ రవాణాకు అనుకూలంగా నిర్వహించడంతో పాటు దృఢమైన రహదారి వ్యవస్థను నిర్మించడం రోడ్లు, భవనాల శాఖ ముఖ్య బాధ్యత. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో సుమారు 2,000 కి.మీ పొడవు గల ఆర్&బి రోడ్లను అభివృద్ధి

పరిచే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఇందుకుగాను "ట్రాన్సాక్షన్ ఎడ్వైజరీ కన్సల్టెంట్లను" నియమించడం కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ కోరడమైంది.

145. రాష్ట్రంలో రహదారుల మీద సంభవిస్తున్న ప్రమాదాలను ప్రభుత్వం తీవ్ర పరిగణనలోకి తీసుకుని, రవాదారులు మరియు భవనాల శాఖ ఆధ్వర్యంలో అన్ని రహదారుల మీద రహదారి భద్రతా చర్యలను అమలు చేయటానికి సమగ్ర ఆదేశాలను జారీ చేసింది. ఈ ఆదేశాలు రహదారి భద్రతకు సంబంధించిన రాష్ట్రస్థాయి సాంకేతిక సంఘం వారి సిఫారసులకు అనుగుణంగా జారీచేయబడ్డాయి.

146. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.2,960 కోట్లు ప్రతిపాదించడమైనది.

**మౌలిక సదుపాయాలు-పెట్టుబడులు**

147. రాష్ట్రంలో మౌలికసదుపాయాల కల్పన మరియు పెట్టుబడుల శాఖ ఓడరేవులు, విమానాశ్రయాలు మరియు సహజవాయువుకు సంబంధించిన విషయాలను పరిశీలిస్తుంది. ఈ రంగంలో పబ్లిక్ ప్రైవేట్ రంగ భాగస్వామ్య పద్ధతిలో ప్రభుత్వం ఎన్నో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపట్టింది.

148. ఆంధ్రప్రదేశ్‌కు 975 కిలోమీటర్ల పొడవైన తీరరేఖ ఉంది. ఈ తీరంలో విశాఖపట్నంలో గల ఒక పెద్ద నౌకాశ్రయంతో పాటు 14 నాన్ మేజర్ నౌకాశ్రయాలు కూడా ఉన్నాయి. వీటిలో కాకినాడ యాంకరేజ్ పోర్ట్, కాకినాడ డీప్‌వాటర్‌పోర్ట్, కృష్ణపట్నం పోర్ట్, గంగవరం పోర్ట్ మరియు రవ్వలో గల ఒక కేప్టివ్ పోర్ట్‌లో వాణిజ్య కార్యక్రమాలు నడుస్తున్నాయి.

149. పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రభుత్వం మచిలీపట్నం నౌకాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదిస్తున్నది. ప్రస్తుతమున్న నాన్‌మేజర్ నౌకాశ్రయాలతోపాటు, ప్రభుత్వం 14 మైనర్ పోర్ట్‌లను కూడా పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భావనపాడు, కళింగపట్నంలతోపాటు, నరసాపురం రేవు పట్టణాలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో మరొక పెద్ద నౌకాశ్రయాన్ని నెలకొల్పాలనే ప్రతిపాదన భారతప్రభుత్వం నుంచి అంది ఉన్నది. ఇందుకు సమాన వాటాగా ప్రభుత్వ భూమిని సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తన అంగీకారం తెలియజేసింది. దీనితో పాటుగా కాకినాడలో ప్రైవేటు రంగంలో మరొక వాణిజ్యరేవు పట్టణాన్ని నిర్మించాలనే ప్రతిపాదన ఉంది.

150. విజయవాడ, రాజమండ్రి, తిరుపతిలలో గల విమానాశ్రయాలను విస్తరించడానికీ / ఆధునికీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వారికి సహకరిస్తున్నది. విజయనగరం జిల్లాలో భోగాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అభివృద్ధి పరచడానికి ఒక ప్రతిపాదన ఉంది. ఇది కాక, గుంటూరు జిల్లాలోని నాగార్జున సాగర్‌లో, ప్రకాశం జిల్లాలోని దొనకొండ వద్ద నోఫ్రిల్స్ విమానాశ్రయాలు, చిత్తూరు జిల్లాలోని కుప్పం వద్ద, నెల్లూరు

జిల్లాలో దగదర్తి వద్ద, కర్నూలు జిల్లాలో ఓర్వకలు వద్ద ప్రాంతీయ విమానాశ్రయాలు అభివృద్ధి పరచాలని ప్రతిపాదనలు ఉన్నాయి.

151. భారతప్రభుత్వం నిర్వహించిన వేలంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఆంధ్రప్రదేశ్ గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ (ఎపిజిఐసి) తన భాగస్వాములతో కలికి కేజి బేసిన్‌లో 4బ్లాకులకు అనుమతి సాధించింది.

152. ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పోరేషన్ (ఎపిజిడిసి) ఎపిజిఐసి మరియు గెయిల్ ఇండియా లిమిటెడ్ వారి అనుబంధ సంస్థ అయిన గెయిల్ గ్యాస్ లిమిటెడ్ వారు సంయుక్తంగా ఏర్పరచిన సంస్థ. ట్రంక్ పైప్‌లైన్లు, సిజిడి నెట్‌వర్క్‌లు, రీజనల్ గ్రిడ్‌లు, సిఎన్‌జి, ఎల్‌ఎన్‌జి దిగుమతి మరియు దాని రీగాసిఫికేషన్ వంటి కార్యక్రమాలకు సంబంధించిన వ్యాపారంలో పాలుపంచుకోవడానికి ఎపిజిడిసి ఆసక్తి కనబరుస్తున్నది.

153. సహజవాయువుకు సంబంధించిన గిరాకీ మరియు సరఫరాలో నానాటికీ పెరుగుతున్న వ్యత్యాసాన్ని దృష్టిలో ఉంచుకుని తీరాంధ్రంలో ఒక ఎల్‌ఎల్‌జి ఇంపోర్టేషన్ టెర్మినల్‌ను నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్సాహపడుతున్నది. ఇందుకు సంబంధించిన గిరాకీ రాష్ట్రంలోనే ముఖ్యంగా ఇంధనశాఖ, ఎరువులు, రిఫైనరీ, గ్లాసు, పింగాణీ మరియు సీజిడి రంగాల్లో అధికంగా ఉంది. ఈ టెర్మినల్‌ను నెలకొల్పడానికి కాకినాడలోని కాకినాడ డీప్ వాటర్ పోర్టును అత్యంత అనుకూల స్థలంగా ఎపిజిడిసి గుర్తించింది. కాకినాడ డీప్ వాటర్ పోర్టు దగ్గర ఎఫ్‌ఎస్‌ఆర్‌యు ఆధారిత ఎల్‌ఎన్‌జి టెర్మినల్‌ను నెలకొల్పడానికి సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జి టెర్మినల్‌తో కూడిన ఒక జె.వి. కంపెనీ ద్వారా విశాఖపట్నం జిల్లాలోని గంగవరం పోర్టు దగ్గర కూడా మరొక ఎల్‌ఎన్‌జి టెర్మినల్‌ను నెలకొల్పడానికి కూడా అనుమతి నివ్వడం కూడా జరిగింది.

154. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ. 195 కోట్లు ప్రతిపాదించడమైనది.

**ఇంధన శాఖ**

155. గృహోపయోగానికీ, వ్యాపార పారిశ్రామిక సంస్థలకు, 14.85 లక్షల మంది రైతులకు 7 నుంచి 9 గంటల పాటు నిర్ణీత కాల వ్యవధిలో విశ్వసనీయ, నాణ్యమైన మరియు సముచితమైన ధరకు 24X7 పాటు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.

(ట్రైజరీ బెంచెస్ నుంచి చప్పట్లు)

156. 2014-15 లో డిసెంబరు 2014 నాటికి 36,701 వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వబడ్డాయి. తద్వారా మొత్తం వ్యవసాయ కనెక్షన్లు 14.85 లక్షలకు చేరుకున్నాయి. ప్రస్తుత సంవత్సరంలో రైతులకు ఉచిత విద్యుత్తు కింద రూ.3188 కోట్ల మేరకు నిధులు విడుదల చేసింది.

157. ఎపిజెన్‌కో ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత పెద్ద విద్యుదుత్పత్తి సంస్థ. 4559.6 మెగావాట్ల సామర్థ్యంలో థర్మల్ విద్యుత్ వాటా 61.63 శాతం కాగా, జలవిద్యుత్ 38.33 శాతం, పవన విద్యుత్ 0.04 శాతం. 2014-15 లో జనవరి 15 నాటికి ఏపిజెన్‌కో విద్యుత్ కేంద్రాలు 19,472 ఎం.యు. విద్యుత్తును ఉత్పత్తి చేశాయి.

158. ప్రస్తుత సంవత్సరంలో ఏపిజెన్‌కో నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం వద్ద గల శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్రాజెక్టులో అత్యంత కీలకసామర్థ్యం కలిగిన రెండు యూనిట్లను అదనంగా నెలకొల్పటానికి ఏర్పాట్లు చేసింది. వీటిద్వారా 1650 మెగా వాట్ల సామర్థ్యం గల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కానుంది. నాగార్జున సాగర్ టైల్‌పాండ్ వద్ద రెండు మినీ జల విద్యుత్ కేంద్రాలు మార్చి 2015 నాటికి పని మొదలుపెట్టనున్నాయి. వీటన్నిటిద్వారా 2014-15 లో 1650 మెగా వాట్ల అదనపు సామర్థ్యం సమకూరనుంది.

159. పవన, సౌరవిద్యుత్ పథకాల్లో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం సమగ్ర పవన, సౌరవిద్యుత్ విధానాలను ప్రకటించింది. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలలో 2500 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ సముదాయాలను ప్రభుత్వం అభివృద్ధి పరుస్తున్నది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో 10,000 సోలార్ పంపుసెట్లు నెలకొల్పాలని కూడా లక్ష్యం నిర్దేశించుకోవడం జరిగింది.

160. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.4,360 కోట్లు ప్రతిపాదించడమైనది.

**పరిశ్రమలు – వాణిజ్యం**

161. యువతకు ఉద్యోవకాశ కల్పనకూ, ప్రభుత్వానికి ఆదాయ సమీకరణకూ పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం శీఘ్రగతిన పారిశ్రామికరణ జరగడం కోసం ప్రభుత్వం ఒక శక్తివంతమైన ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ పాలసీ 2010-15 ను సిద్ధం చేసింది. తద్వారా రాష్ట్రంలో నెలకొల్పే కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహకాలను, రాయితీలను ప్రకటించింది. దేశీయ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడం కోసం రాష్ట్రంలో ఒక సానుకూల పారిశ్రామిక వాతావరణాన్ని ఏర్పరచడానికీ, నాణ్యమైన మౌలిక సదుపాయాలు సమకూర్చడానికీ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది.

162. విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం జరుగుతున్నది. పెట్టుబడులు పెట్టడానికి వీలైన అనుకూల వాతావరణాన్ని ఏర్పరచడం కోసం ప్రభుత్వం సింగిల్

విండో ద్వారా అనుమతులను సమర్థవంతంగా మంజూరు చేస్తున్నది. 21 రోజుల వ్యవధిలోనే వివిధ రకాల పారిశ్రామిక అనుమతులను మంజూరు చేయగలుగుతున్నది. షెడ్యూలు కులాల, షెడ్యూల తెగలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ఒక ప్రత్యేక విధి, విధానాన్ని రూపొందించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలబడింది. (ట్రెజరీ బెంచెస్ బల్లలు చరిచారు)

163. చిత్తూరు జిల్లాలో 5000 నుంచి 6000 హెక్టార్ల విస్తీర్ణంలో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మాన్యుఫ్యాక్టరింగ్ జోన్‌లను నెలకొల్పడానికి భారత ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. పరిశుభ్రమైన, శక్తిని అదుపుచేయగల సాంకేతిక పరిజ్ఞానం, అవసరమైన సామాజిక వనరులు, నైపుణ్య కల్పన సదుపాయాలు, సమగ్ర క్షేత్ర నిర్వహణ వంటి అంశాల్లో అత్యున్నత స్థాయి సదుపాయాలు కలిగిన ఒక సమగ్ర పారిశ్రామిక పట్టణంగా ఈ జోన్ రూపుదిద్దుకోనుంది. ఈ జోన్‌కు సుమారు రూ.30,000 కోట్ల మేరకు పెట్టుబడులు రాగలవనీ, 3లక్షల మేరకు ఉద్యోగావకాశాలు సాధ్యం కాగలవనీ అంచనా. ఇందుకు అవసరమైన భూసేకరణ చిత్తూరు జిల్లాలో సాగుతోంది.

164. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.637 కోట్లు ప్రతిపాదించడమైనది.

## పర్యాటకరంగం మరియు సాంస్కృతిక రంగం

165. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రాకృతిక సంపద, చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద వల్ల ఇప్పటికే భారతదేశంలో దేశీయ స్థాయి పర్యాటకులను ఆకర్షిస్తూ ఉన్నది. ఈ పరిస్థితిని మరింత మెరుగుపర్చుకోవడంతోపాటు, మరెంతోమంది పర్యాటకులను ఆకర్షించే దిశగా రాష్ట్రంలోని అన్ని పర్యాటక కేంద్రాల్లోనూ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దేశంలోనే ఒక అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక రంగంగా మార్చడంతోపాటు ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగాన్ని గ్లోబల్ టూరిజం బ్రాండుగా రూపుదిద్దడానికి ప్రభుత్వం కృత నిశ్చయంగా ఉంది. రాష్ట్రంలోని ప్రాకృతిక సౌందర్యాన్నీ, పర్యావరణ సమతౌల్యాన్నీ, సాంస్కృతిక వారసత్వాన్నీ కాపాడుకుంటూనే ప్రపంచస్థాయి పర్యాటక సేవలు అందించే విధంగా పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దనుంది.

166. 2015-16 లో కృష్ణ, గుంటూరు, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో టూరిస్టు సర్క్యూట్లు వంటి కొత్త పర్యాటక పథకాలను అమలుపరచాలని ప్రతిపాదించడం జరిగింది. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో పర్యాటకరంగం అభివృద్ధికి ప్రైవేటు పెట్టుబడులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. విజయవాడ వద్ద గల భవాని ద్వీపాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం జరుగుతుంది. (ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

167. 2014-15 లో శ్రీకాకుళం జిల్లాలోని బారువ, కళింగపట్నం, తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ, ప్రకాశం జిల్లాలోని రామాయపట్నం, నెల్లూరు జిల్లాలోని తుమ్మల పెంట వద్ద కొత్త సముద్ర తీర విహార స్థలాలను ఏపిటిడిసి ప్రారంభించింది. విజయనగరంలోని చింతపల్లి వద్ద సముద్రతీర విహార స్థలం 2015 జూన్ నాటికి పూర్తి కానుంది. పర్యావరణ, దేవాలయ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించనున్నాము.

168. ఆంధ్రప్రదేశ్‌లోని కళలు, హస్తకళలు, సంస్కృతిని పునరుద్ధరించడానికీ, ప్రోత్సహించడానికీ శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి (కాకినాడ), పశ్చిమ గోదావరి (ఏలూరు), కృష్ణా, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, కడప, కర్నూలులో కొత్తగా శిల్పారామాలు మంజూరయ్యాయి. వీటి మొదటి దశ నిర్మాణం 2015 జూన్ నాటికి పూర్తవుతుంది.

169. 2015 జనవరి నుండి 6746 మంది వృద్ధ కళాకారులకు ఇచ్చే నెలవారీ పింఛన్‌ను రూ.500 నుండి రూ.1500లకు పెంచడం జరిగింది. సంక్రాంతి సంబరాలు రాష్ట్రస్థాయి ఉత్సవంగా నిర్వహించడం జరిగింది. కృష్ణా జిల్లాలోని కూచిపూడి వద్ద కూచిపూడి నృత్యం కోసం కూచిపూడి నాట్యారామం అనే కొత్త అకాడమీని ప్రభుత్వం నెలకొల్పనుంది. (ట్రెజరీ బెంచెస్ నుంచి చప్పట్లు) సంగీతనాటక అకాడమీ, సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ అనే మూడు అకాడమీలను పునరుద్ధరించనుంది. ఠాగూర్ సాంస్కృతిక సముదాయాన్ని కాకినాడలో నిర్మించే ఆలోచన ఉంది.

170. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.330 కోట్లు ప్రతిపాదించడమైనది.

## నైపుణ్యాల పెంపు, ఎంటర్ ప్రెన్యూర్షిప్, ఇన్నోవేషన్

171. ప్రజల నైపుణ్యాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. ప్రజల నైపుణ్యాలను పెంపొందించడమనేది ప్రతి ఒక్క మిషన్‌కూ ముఖ్యమైన అంశమే. ప్రభుత్వం ప్రారంభించిన అన్ని మిషన్లు సఫలం చెందడానికి దోహదం పడేదే. అందుకని వివిధ శాఖల నైపుణ్య కల్పనా కార్యక్రమాలను సమన్వయం పరచడం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి కార్పోరేషన్‌ను నెలకొల్పడం జరిగింది. ఈ కార్పోరేషన్ నైపుణ్యాల అభివృద్ధికీ, ఉద్యమిత్వానికీ, నవీన భావాల రూపకల్పనకూ దోహదపడుతుంది.

172. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల్లో, సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్లలో వివిధ కార్యక్రమాలు చేపట్టడం కోసం ప్రభుత్వం 17 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ప్రారంభించింది.

173. ఇంజనీర్ల సాంకేతిక పట్టభద్రుల నైపుణ్యాలను గణనీయంగా మెరుగుపెట్టడానికి ప్రభుత్వం రాష్ట్రంలో ఆరు క్లస్టర్ ఎక్సెలెన్స్‌లను మంజూరు చేసింది. ఇవి వస్తువుల రూపరచన

పైనా, నవీన భావాల రూపకల్పన పైనా దృష్టి పెడతాయి. నూతన పారిశ్రామిక అవసరాలను చేజిక్కించుకోవడంలో ఇవి ముఖ్య పాత్ర వహిస్తాయి. సాంకేతిక పట్టభద్రులకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు సముపార్జించుకోవటానికి తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపర్చుకోవడానికి ఇవి దోహదపడతాయి. ఈ కారణాల వల్ల పెట్టుబడులను ఆకర్షించడానికీ, పారిశ్రామిక ప్రగతికీ కూడా ఇవి తోడ్పడతాయి.

174. విద్యార్థుల నిరుద్యోగ యువతీయువకుల ఉద్యోగావకాశాలు మెరుగుపర్చడానికి ప్రభుత్వం వివిధ రకాల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కంప్యూటర్ నైపుణ్యాలు, ఇతర సూక్ష్మ నైపుణ్యాలను విద్యార్థులకు అందజేస్తున్నది.

175. నైపుణ్యాభివృద్ధి ప్రధానంగా పనిచేసే ఒక ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా రాష్ట్రంలో నెలకొల్పబడనున్నది.

176. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ. 360 కోట్లు ప్రతిపాదించడమైనది.

## ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు కమ్యూనికేషన్లు

177. రాష్ట్రాన్ని అంతర్జాతీయ ప్రఖ్యాతి చెందిన ఒక నవీకరణ సమాజంగా రూపొందించడానికి, నవ్యాంధ్రప్రదేశ్ బృహత్తర ప్రణాళికలను సిద్ధం చేసుకోవడమే కాకుండా, ఆ కలలను సాకారం చేసుకోవడానికి తీవ్రంగా కృషి చేయడం కూడా మొదలుపెట్టింది.

178. రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ పరిశ్రమను శీఘ్రగతిన అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం మిషన్ పద్ధతి వ్యూహాన్ని అనుసరిస్తున్నది. ఇందులో భాగంగా ఈ-గవర్నెన్స్ అథారిటీ, ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి ఏజెన్సీ ఇన్నొవేషన్ సొసైటీలను నెలకొల్పింది.

179. ప్రభుత్వ పని తీరులో పారదర్శకతను తీసుకురావడం కోసం ప్రభుత్వం ఈ-గవర్నెన్స్‌ను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నది. హుద్‌హుద్ తుపాను అనంతరం తుపాను కల్పించిన నష్టాన్ని అంచనా వేయడానికీ, పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించడానికీ ఒక పోర్టల్ నెలకొల్పడం జరిగింది. క్రౌడ్ సోర్సింగ్ పద్ధతి ద్వారా నెలకొల్పబడిన ఈ పోర్టల్ ద్వారా ప్రజలు తమకు సంభవించిన విపత్తు వివరాలను నమోదు చేసి తమ సమస్య పరిష్కారమయ్యే విధంగా కోరే అవకాశం లభించింది. మొదటి దశలో భాగంగా పది శాఖల్లో ఈ-ఆఫీస్ ప్రారంభించబడింది.

180. రెవిన్యూ, సాగునీరు, వ్యవసాయ రంగాలను అనుసంధానపరుస్తూ, సమగ్ర సమాచార వ్యవస్థను 'హరిత' పేరిట నెలకొల్పడం జరుగుతున్నది. దీని ద్వారా ఈ మూడు శాఖలకూ సంబంధించి పౌరులకు కూడా మొత్తం సమాచారం ఒకేచోట లభ్యమయ్యే ఏర్పాటు ఉంటుంది. ప్రభుత్వం ప్రారంభించిన స్మార్ట్ విలేజ్ కార్యక్రమం కోసం కూడా ఒక పోర్టల్ ప్రారంభించబడింది. ఇందులో 360 డిగ్రీల దృశ్యంతో పాటు, అక్కడ దాతలు చేపడుతున్న కార్యక్రమాల మరియు

సమకూరుస్తున్న సదుపాయాల ప్రగతిని సమీక్షించడానికి వివిధ రకాల నివేదికలను చూడడానికి కూడా ఏర్పాటు ఉంటుంది.

181. తొలిసారిగా తలెత్తుతున్న కంపెనీలు బాలారిష్టాలను దాటడానికి వీలుగా ప్రభుత్వం విశాఖపట్నంలోని మధురవాడ ఐటి లే-అవుట్‌లో సన్‌రైజ్ స్టార్టప్ టెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఇంకుబేషన్ పార్కును నెలకొల్పింది. అందులో ఇప్పటిదాకా 50 స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం ఇవ్వడం జరిగింది. అనంతపురంలో, చిత్తూరులోని శ్రీసిటీలో రెండు ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లను నెలకొల్పడానికి భారత ప్రభుత్వం అంగీకారం తెలిపింది.

182. సూర్యోదయ ఆంధ్రప్రదేశ్ బ్రాండుకు విస్తృతప్రచారం కల్పించి, తద్వారా ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించడం కోసం 2014 సెప్టెంబరులో విశాఖపట్నంలో సిఐఒ కాంక్లేవ్ నిర్వహించడం జరిగింది. ఇందులో 600 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మహా సమావేశంతో పాటు జాతీయ స్థాయిలో చెన్నైలో, బెంగళూరులోనూ, ప్రపంచస్థాయిలో సింగపూర్, జపాన్, యుకె, దావోస్‌లలోనూ రోడ్డుషోలు నిర్వహించడం జరిగింది. తమ కార్యక్రమాలు నెలకొల్పడం కోసం లేదా విస్తరించడం కోసం ఐటి దిగ్గజాలను ఆహ్వానించడానికి రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను ఈ ప్రదర్శనల్లో వివరించడం జరిగింది. ఇప్పటిదాకా చేపట్టిన చర్యల వల్ల రూ.4311కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టే అవకాశమున్న ఐటి కంపెనీలను ఆకర్షించడం జరిగింది. అలాగే తద్వారా 25,110 మంది ఐటి నిపుణులకు ఉద్యోగావకాశాలు దొరుకుతాయని కూడా అంచనా.

183. ప్రస్తుతం 'సమాచార సమాజం' గా ఉన్న రాష్ట్రాన్ని 'విజ్ఞాన సమాజం' గా మార్చాలన్నదే మా ధ్యేయం. యునెస్కో ప్రచురించిన 'టువర్డ్స్ నాలెడ్జ్ సొసైటీస్' (2005) అనే నివేదికలోని ఒక వాక్యాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాను.

*'విజ్ఞాన సమాజాలు గురించి ఆలోచించడమంటే వాటినెలా నిర్మించడమా అని ఆలోచించడమంటే అసలు అభివృద్ధి గురించే మళ్లీ కొత్తగా ఆలోచించడమన్న మాట. '*

184. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ. 370 కోట్లు ప్రతిపాదించడమైనది.

**యువజన సేవలు, క్రీడలు**

185. యువత అవసరాలనూ, మారుతున్న ఆకాంక్షలనూ దృష్టిలో పెట్టుకుని తగిన రీతిలో యువజన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నది. నిరుద్యోగ యువత పారిశ్రామిక రంగంలో, సేవా రంగంలో స్వయం ఉపాధి పథకాలను నెలకొల్పడం కోసం చీఫ్ మినిస్టర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ యూత్ (సిఎమ్‌ఇవై) పథకాన్ని అమలు చేస్తున్నది. సైనికాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ సైనిక నియామక శిబిరాలను నిర్వహిస్తున్నది. తద్వారా

విద్యావంతులైన నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో సైన్యంలోనూ, సంబంధిత రంగాల్లోనూ చేరడానికి ప్రోత్సహిస్తున్నది.

186. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.45 కోట్లు ప్రతిపాదించడమైనది.

**కార్మిక మరియు ఉపాధి శాఖ**

187. శ్రామికుల సంక్షేమం కోసం పథకాలు అమలుచేయడం, కార్మిక చట్టాలను అమలుచేయటం కార్మికశాఖ బాధ్యత. 2014-15 లో 4,124 నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం రూ.44 కోట్లు, 4,825 మంది ఇతర రంగాలకు చెందిన కార్మికుల సంక్షేమం కోసం రూ.2కోట్లు ఖర్చు చేయడం జరిగింది. రూ.180కోట్ల వ్యయంతో 50 పారిశ్రామిక శిక్షణ సంస్థలను నవీకరించి, ఆధునిక యంత్ర సామగ్రిని సమకూర్చడం జరిగింది.

188. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ. 281 కోట్లు ప్రతిపాదించడమైనది.

**పర్యావరణం, అడవులు, సైన్స్ మరియు టెక్నాలజీ**

189. రాష్ట్రంలో అడవులు 36,917చదరపు కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉన్నాయి. ఇందులో దట్టమైన అడవులు కేవలం 9,764 చదరపు కిలోమీటర్ల మేరకు మాత్రమే అనగా మొత్తం రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 22.61 శాతం మేరకు మాత్రమే విస్తరించి ఉన్నాయి. రాష్ట్రంలో 13 వన్యప్రాణి అభయారణ్యాలు, 3 నేషనల్ పార్కులు, 2 జూపార్కులు ఉన్నాయి. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఏర్పరచిన 4,320 వన సంరక్షణ సమితుల (వివిఎస్ఎస్) ద్వారా మరియు ఇకో డెవలప్‌మెంట్ కమిటీల ద్వారా ప్రస్తుతమున్న అడవులను సంరక్షించడానికీ, అభివృద్ధి చేయటానికీ వివిధ రకాల అటవీ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి.

190. ఆధునిక సమాచార సాంకేతిక సాధనాలను అటవీ శాఖ వినియోగిస్తున్నది.

191. అడవులను రక్షించడం, అన్యాక్రాంతం కాకుండా కాపాడడం, ఎర్రచందనం వంటి విలువైన కలప స్మగ్లింగ్‌కు లోనుకాకుండా కాపాడడం నేడు రాష్ట్రం ముందున్న ముఖ్యమైన సవాళ్లు, అక్రమ రవాణా నుండి చేజిక్కుంచుకున్న ఎర్ర చందనం నిలువల్లో కొంత భాగాన్ని వేలం వేయడం ద్వారా ప్రభుత్వం అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోగలిగింది. అటవీ వనరులను సంరక్షించుకోవడం కోసం ప్రభుత్వం ఎన్నో ముఖ్య చర్యలను చేపట్టింది.

192. జాతీయ అటవీ విధానం మొత్తం భౌగోళిక ప్రదేశంలో 33శాతం అటవీ విస్తీర్ణం ఉండాలని నిర్దేశించింది. కాగా రాష్ట్రంలో వృక్ష విస్తీర్ణం సుమారు 25.64శాతం మాత్రమే. ఈ రెండిటి మధ్య వ్యత్యాసం 7.6శాతం ఉంది. ఈ వ్యత్యాసాన్ని తగ్గించడం కోసం పెద్ద ఎత్తున

చెట్లు నాటి పెంచవలసి ఉంది. ఇందుకుగాను రానున్న వానాకాలంలో నాటడం కోసం 50కోట్ల నర్సరీ మొక్కలు పెంచడానికి చర్యలు చేపట్టడం జరిగింది.

193. రాష్ట్రంలో అంతరించిపోతున్న అటవీ ప్రాంతానికి సంబంధించిన 48,637.61హెక్టార్ల ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ వివిధ పథకాలను చేపడుతున్నది. అందులో 26,932హెక్టార్లలో అధిక దిగుబడిని ఇవ్వగల యూకలిప్టస్ క్లోనల్ ప్లాంటేషన్స్ చేపట్టబడ్డాయి. ఇవికాక, కార్పోరేషన్ వెదురు, జీడిమామిడి, కాఫీ తోటల పెంపకం కూడా చేపట్టింది.

194. నీటి వనరులను సక్రమంగా వినియోగించుకోవడానికి, భూగర్భ జలమట్టం పెంపుదలకు, క్షామ నివారణకు ప్రభుత్వం 19.2.2015న నీరు-చెట్టు పథకాన్ని ప్రకటించింది.

195. ఈ శాఖకు గాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.284కోట్లు ప్రతిపాదించడమైనది.

**విపత్తుల నిర్వహణ**

196. విపత్తులను ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండడానికీ, విపత్తులు సంభవించినప్పుడు ధీటుగా ఎదుర్కోవడానికీ, విపత్తుల వల్ల దెబ్బతిన్న ప్రజానీకానికి పునరావాసం కల్పించడానికీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నది. 2014 ఖరీఫ్ సీజన్‌లో సంభవించిన వర్షాభావం, 2014 అక్టోబరులో ముంచెత్తిన హుద్‌హుద్ తుపాను అనే తీవ్ర రెండు ప్రాకృతిక వైపరీత్యాలకు ఆంధ్రప్రదేశ్ గురయ్యింది. ఈ విపత్తుల్లో రక్షణ, పునరావాస చర్యలకు రూ.716కోట్లు, పునరుద్ధరణ కార్యక్రమాలకు రూ.4144కోట్లు మొత్తం రూ.4,860కోట్లు సహాయం కొరకు భారత ప్రభుత్వానికి విజ్ఞాపన సమర్పించడం జరిగింది. అందులో రూ.400కోట్ల మేరకు భారత ప్రభుత్వం తక్షణ సహాయాన్ని అందించింది. మిగిలిన సహాయం ఇంటర్ మినిస్టీరియల్ కేంద్ర బృందం నివేదిక అందిన తరువాత పరిశీలిస్తామని చెప్పింది.

197. ఎస్‌డిఆర్ఎఫ్ / ఎన్‌డిఆర్ఎఫ్ ఖాతాలో జమ అయిన రూ.750.68కోట్లకు గాను రూ.1156.77కోట్లు ఖర్చు చేయడం జరిగింది. విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు, ప్రజలకూ నేరుగా అందే విధంగా నష్టపరిహారాన్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లించడం జరిగింది.

198. హుద్‌హుద్ తుపాను వల్ల సంభవించిన నష్టాన్ని శాశ్వతంగా పూడ్చడం కోసం రూ.2700 కోట్ల ఆర్థిక సహాయం కోసం భారత ప్రభుత్వం ద్వారా ప్రపంచ బ్యాంకుని కోరడం జరుగుతున్నది.

199. అక్టోబరు 2014 లో హుద్‌హుద్ తుపాను సృష్టించిన భీతావహ పరిస్థితిలో ప్రజలకు ధైర్యాన్నిచ్చి, తక్షణ పునరావాస సదుపాయాలను అందించడంలో మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు నిర్వహించిన నిరుపమానమైన పాత్రకు నేను

నా హృదయపూర్వక ప్రశంసలనూ, ధన్యవాదనలనూ ప్రకటిస్తున్నాను. (ట్రెజరీ బెంచెస్ వాళ్లు తమ హర్షాన్ని వ్యక్తపరిచారు) రానున్న విపత్తు గురించి జిల్లా యంత్రాంగాన్ని ముందస్తుగా హెచ్చరించడమే కాకుండా, తుపాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో పునరావాస చర్యలను గౌరవ ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షించారు. సమర్థవంతమైన, నలుగురికీ ఉదాహరణగా నిలబడగల ఆయన నాయకత్వంలో ప్రభుత్వం శాశ్వత పునరావాస చర్యలను చేపట్టింది. తుపాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రపంచ బ్యాంకు సహాయంతో అండర్ గ్రౌండ్ కేబిలింగ్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఆ ప్రాంతాలు భవిష్యత్తులో మరెప్పటికీ దెబ్బ తినకుండా ఉండే విధంగా కాపాడే ప్రయత్నాలు చేపట్టనుంది.

200. నేషనల్ సైక్లోన్ రిస్క్ మిటిగేషన్ ప్రాజెక్టు (ఎన్‌సిఆర్ఎంపి) 9 తీరాంధ్ర జిల్లాల్లో ప్రపంచబ్యాంకు సహాయంతో అమలు జరుగుతున్న పథకం. తుపాను విపత్తు వాటిల్లిన సందర్భంలో పునరావాస సామగ్రిని త్వరితంగా చేర్చటానికీ, లేదా జనాలను సత్వరమే సురక్షిత ప్రాంతాలకు తరలించడానికీ జననివాసాల అనుసంధానం, మరియు సైక్లోన్ షెల్టర్ల నిర్మాణం ఈ పథకం కింద చేపట్టబడుతున్నాయి.

201. ప్రస్తుత సంవత్సరంలో అనుకూల వర్షపాత పరిస్థితి వల్ల 7 జిల్లాల్లో 230 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించబడ్డాయి. రాష్ట్రంలో ప్రజలు తాగునీటి కోసం పడుతున్న కటకటను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పట్టణ ప్రాంతాలకు రూ.57కోట్లు, గ్రామీణ ప్రాంతాలకు రూ.82కోట్లు విడుదల చేసింది. పశుగ్రాస లభ్యతను కూడా అంచనా వేస్తూ అవసరమైనచోట పశుగ్రాసం సరఫరాకు ఏర్పాట్లు జరుగుతున్నవి.

202. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.488 కోట్లు ప్రతిపాదించడమైనది.

**రవాణా**

203. రాష్ట్రంలో రహదారి ప్రమాదాలను తగ్గించడం కోసం రవాణాశాఖ అన్ని జిల్లాల్లోనూ రహదారి భద్రత ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. కంప్యూటర్ మీద లెర్నర్ లైసెన్సు తీసుకునేటప్పుడు రహదారి భద్రత గురించిన పరిజ్ఞానం కూడా ఒక తప్పనిసరి అంశంగా పొందుపరచబడింది. 19-01-2015 నుంచి 25-01-2015 దాకా రహదారి భద్రత మీద ఒక ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించబడింది. రహదారి ప్రమాదాలు తగ్గించడం కోసం, రహదారి భద్రతను పెంపొందించడం కోసం, ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో ప్రభుత్వం ఒక పైలట్ పథకాన్ని చేపట్టింది. ఈ పథకం కింద రహదారులు, భవనాలు, పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్య శాఖలను కలుపుకుని రేణిగుంట నుంచి రాయల చెరువు రోడ్డు దాకా ఒక డెమో కారిడార్ చేపట్టబడింది.

204. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.122 కోట్లు ప్రతిపాదించడమైనది.

## గనులు, భూగర్భ శాఖ

205. నిర్దిష్టమైన ఖనిజాల మీద ఆధారపడ్డ పరిశ్రమలకు తగిన విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుసంపన్నమైన, వైవిధ్యమైన ఖనిజ నిల్వలు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే శక్తుల్లో ఖనిజ రంగం కూడా ఒకటిగా గుర్తించబడింది. బాక్సైట్, బీచ్ సాండ్, సున్నపురాయి, బంగారం, వజ్రాలు, డోలమైట్, నూనె, సహజ వాయువు, యురేనియం, గార్నెట్, గ్రానైట్, టిటానియం వంటి ఖనిజాలు సిమ్మెంటు, గ్యాసు ఆధారిత థర్మల్ విద్యుత్ కర్మాగారాలు, చమురు శుద్ధి కర్మాగారాలు, గనులు, రిఫైనరీ, స్టీలు-స్పాంజి, అల్యూమినా స్మెల్టర్, అల్యూమినియం రిఫైనరీ వంటి కీలక పరిశ్రమలకు దోహదపడే కీలక ఖనిజాలుగా గుర్తించబడ్డాయి.

206. ఈ ఖనిజ వనరులను వెలికితీయడం, ఇందుకు సంబంధించిన శాసనపరమైన అంశాలనూ, జాతీయ ఖనిజ విధానం 2008 లక్ష్యాలనూ, వ్యూహాలనూ దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఖనిజరంగాన్ని అభివృద్ధి పర్చడం మీద దృష్టి పెడుతున్నది.

207. రాష్ట్రంలో ప్రస్తుతమున్న ఇసుక తవ్వకం విధానాన్ని ప్రభుత్వం సమీక్షించి కొత్త ఇసుక తవ్వకం విధానం 2014ను ప్రకటించింది. ఈ కొత్త విధానం ప్రకారం ఇసుక నిలువలన్నీ జిల్లా, మండల మహిళా సమాఖ్యలకూ, గ్రామ సంఘాలకూ అప్పగించబడతాయి. ఇసుక ఆదాయంలో 25శాతం పొదుపు సంఘాలకు చెందుతుంది.

208. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.27 కోట్లు ప్రతిపాదించడమైనది.

## శాంతిభద్రతలు

209. ఇటీవల కాలంలో హుద్‌హుద్ తుపాను విపత్తులో రక్షణ చర్యలు నిర్వహించడంతోపాటు, దేశంలోనే మొదటిసారిగా 21 కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్‌లను ప్రారంభించిన ఘనత సాధించడం మన శాంతిభద్రతల యంత్రాంగం ఇటీవల కాలంలో సాధించిన కొన్ని ముఖ్య విజయాలు.

210. ప్రజా సమస్యలకు సత్వరమే ప్రతిస్పందించి సమర్థవంతంగా పరిష్కరించడం కోసం డయల్ 100 కమాండ్ కంట్రోల్ సెంటర్ నెలకొల్పడం జరిగింది. కేంద్రం ప్రారంభించి, ఇప్పటిదాకా 2.94మిలియన్ కాల్స్‌ను స్వీకరించడం జరిగింది. వాటి పరిష్కారానికి సంబంధించిన సంతృప్తి 98 శాతం నమోదయ్యింది. ప్రజా సమస్యలను సన్నిహితంగా వినడం కోసం పోలీస్ స్టేషన్‌లలో రిసెప్షన్ సెంటర్ల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది.

211. మొదటిసారిగా ప్రభుత్వం పోలీసు శాఖలోని తక్కిన అన్ని తరగతుల పోలీసు సిబ్బందితో సమానంగా 12,063 మంది హోం గార్డులకు కూడా గ్రూప్ పర్సనల్ ఆక్సిడెంటల్ కవరేజిని వర్తింపజేసింది. దీని కింద ప్రమాదవశాత్తూ మరణించిన మరణాలకు గాను రూ.2.50లక్షల

పరిహారం చెల్లింపు ఉంటుంది. పోలీసు సంక్షేమం కోసం రూ.10కోట్ల నిధిని మంజూరు చేయడంతోపాటు, పోలీసు శాఖ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు రూ.40లక్షల గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ విడుదల చేయడం జరిగింది. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం వద్ద నేషనల్ మెరైన్ అకాడమి స్థాపించడం కోసం 300 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తించడం జరిగింది.

212. ఇందుకుగాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.4062 కోట్లు ప్రతిపాదించడమైనది.

## దేవాదాయ ధర్మాదాయ శాఖ

213. దేవాలయాల స్థాయితో నిమిత్తం లేకుండా అక్కడ పని చేస్తున్న అర్చకులకూ, ఇతర ధార్మిక సిబ్బందికీ ఒక్కొక్కరికీ నెలకు కనీసం రూ.5,000 కనీస పారితోషకం చెల్లించడం కోసం అర్చకులు మరియు ఇతర సిబ్బంది జీతాలు మరియు పారితోషికాల నిధి కింద రూ.250కోట్ల మూలనిధిని సమకూర్చడం కోసం ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరిగింది. ఇందుకుగాను సర్‌ప్లస్ ఎండోమెంట్స్ ఎడ్మినిస్ట్రేటివ్ ఫండ్ నుండి ప్రభుత్వం రూ.100కోట్లు మంజూరు చేసింది.

214. చిన్న దేవాలయాల్లో ధూప దీప నైవేద్యాలు నడవడానికి నెలకు రూ.2500చొప్పున మంజూరు చేయడం జరిగింది. ఈ పథకం కింద 1613 దేవాలయాల్లో ఈ కార్యక్రమ నిర్వహణకు గాను ప్రతి నెల రూ.41లక్షలు విడుదల చేయడం జరుగుతున్నది.

215. గోదావరి పుష్కరాల సందర్భంగా 14-07-2015 నుంచి 25-07-2015 దాకా ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని శాఖల సమన్వయంతో యాత్రికులకు అన్ని సదుపాయాలు కలిగించడం ద్వారా పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. రూ.1368కోట్ల విలువ గల పనులు వివిధ శాఖలు చేపట్టాయి. ఇందులో రవాణా రోడ్లు భవనాల శాఖ రూ.749 కోట్లు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పట్టణాభివృద్ధి శాఖ రూ.343 కోట్లు, పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ రూ.141 కోట్లు, ఇరిగేషన్ శాఖ రూ.92 కోట్లు మేరకు పనులు చేపట్టాయి. యాత్రికులకు సదుపాయాల కోసం పుష్కరాల సందర్భంగా వివిధ దేవాలయాల అభివృద్ధి కోసం దేవాదాయ శాఖ రూ.25కోట్ల మేరకు 248 పనులు మంజూరు చేసింది. పుష్కరాలకు గాను 2015-16 బడ్జెట్ అంచనాల్లో రూ.200 కోట్లు ప్రతిపాదించడమైనది.

## రెవిన్యూ

216. భూములకు సంబంధించిన రికార్డులను నిర్దిష్టంగానూ, సక్రమంగానూ నిర్వహించడం ద్వారా రెవిన్యూ శాఖ ప్రజలకూ, ముఖ్యంగా రైతులకు అమూల్యమైన సేవలు అందిస్తున్నది. రెవిన్యూ మరియు రిజిస్ట్రేషన్ రికార్డులను కూడా అనుసంధానపరచడానికి చర్యలు మొదలుపెట్టింది. అంతేకాక ఈ-పట్టాదార్ పాస్ పుస్తకాలను కూడా ఇవ్వడం మొదలు పెట్టింది.

ప్రభుత్వ భూములను గుర్తించి వాటి సవివరమైన జాబితాలు తయారు చేయడం కోసం ' సర్కార్ భూమి ' పేరిట ఒక కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించడం మొదలుపెట్టింది.

217. సమర్థవంతమైన పౌర సేవలను అందించడంలో భాగంగా ఎన్‌కంబరన్స్ సర్టిఫికేట్లూ, సర్టిఫైడ్ కాపీలు మీ–సేవ ద్వారా అందించే ఏర్పాటు చేసింది. ఇందువల్ల పౌరులు ఈ సర్టిఫికేట్లు పొందడానికి కార్యాలయాల చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా పోయింది.

218. స్టేట్ సర్వీసెస్ డెలివరీ గేట్‌వే లో భాగంగా వివిధ సంస్థల, సంఘాల రిజిస్ట్రేషన్ సేవలు కూడా మీ–సేవ ద్వారా అందించబడుతున్నాయి. పౌరుల సౌకర్యార్థం 2015 ఫిబ్రవరి నుంచి 'ఎక్కడినుంచైనా రిజిస్ట్రేషన్' కార్యక్రమం చేపట్టబడుతున్నది.

219. ఇందుకుగాను 2015–16 బడ్జెట్ అంచనాల్లో రూ.1,429 కోట్లు ప్రతిపాదించడమైనది.

**ఆర్థిక శాఖ**

220. ప్రజాధన నిర్వహణలో సమర్థత, పారదర్శకత, జవాబుదారీతనాలను నెలకొల్పడం కోసం ఏకకాలంలో ప్రజా ధనాన్నీ, మానవ వనరుల నిర్వహణనూ సక్రమంగా చేపట్టడానికి ఆర్థిక శాఖ, కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సిఎఫ్ఎమ్ఎస్)ను రూపొందిస్తున్నదని నేను గత బడ్జెట్ సమావేశంలో సభలో ప్రకటించాను. ఈ వ్యవస్థలో మూడు అంశాలున్నాయి. అవి బడ్జెట్ నిర్వహణ, లెక్కల నిర్వహణ, మానవ వనరుల నిర్వహణ. ఈ వ్యవస్థలు ఏకకాలంలో ఎకౌంటెంట్ జనరల్ కార్యాలయంతో, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాతో, తక్కిన భాగస్వాములతో లావాదేవీలు చేపడుతాయి. నేను ప్రకటించిన విధంగా ఈ ఏడాదిలో ఈ దిశగా గణనీయంగా ముందడుగు వేశామని సగర్వంగా, సంతోషంగా ప్రకటిస్తున్నాను. రానున్న ఆర్థిక సంవత్సరం నుండి పైలట్ జిల్లాగా గుంటూరు జిల్లాలో ఈ నూతన వ్యవస్థను అమలు చేయడానికి సన్నాహాలు మొదలయ్యాయి. అనతి కాలంలోనే ఈ వ్యవస్థను తక్కిన 12 జిల్లాలకు కూడా విస్తరిస్తాము. ప్రభుత్వ పాలనా ప్రక్రియలో ఒక నూతన పరివర్తనను సాధ్యం చేసుకోవటానికి సిఎఫ్ఎమ్ఎస్‌ను ఒక విలువైన సాధనంగా ప్రభుత్వం భావిస్తున్నది.

**2013–14 కు గాను లెక్కలు**

221. 2013–14 సంవత్సరానికి చెందిన తుది లెక్కల ప్రకారం రూ.344కోట్ల రెవిన్యూ మిగులు ఉండగా, రూ.18,050 కోట్లు ఆర్థిక లోటు నమోదయింది. మొత్తం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 2.11శాతం అయిన ఈ లోటు ఎఫ్ఆర్‌బిఎమ్ చట్ట పరిధి దాటలేదని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

**2014–15 సంవత్సరానికి సవరించిన అంచనాలు**

222. 2014–15 సంవత్సరానికి చెందిన సవరించిన అంచనాల ప్రకారం రూ.14,242 కోట్లు రెవిన్యూ లోటు కనిపిస్తున్నది. మొత్తం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఆర్థిక లోటు రూ.20,320 కోట్లు. ఇది రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3.88 శాతం.

**2015–16 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు**

223. 2015–16 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం రూ.1,13,049 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నది. (ట్రెజరీ బెంచెస్ నుంచి చప్పట్లు) అందులో రూ.78,637 కోట్లు ప్రణాళికేతర వ్యయంగా, రూ.34,412కోట్లు ప్రణాళికా వ్యయంగా అంచనా వేయబడింది. రెవిన్యూ లోటు రూ.7,300 కోట్లుగా మరియు ఆర్థిక లోటు రూ.17,584 కోట్లు గానూ అంచనా వేయబడింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఆర్థిక లోటు 3శాతం గానూ, రెవిన్యూ లోటు 1.24 శాతం గానూ అంచనా వేయబడింది.

224. 2015–16 సంవత్సరానికి సమర్పిస్తున్న ఈ బడ్జెట్ రానున్న కాలంలో శీఘ్రగతిన ముందంజ వేయడానికీ, కొత్త రాష్ట్రాన్ని సువ్యవస్థితంగా నిర్మించడానికీ దారి చూపుతుందని నేను నమ్ముతున్నాను. సంఘటిత అభివృద్ధి మా ప్రాధాన్యత. రాష్ట్రం అభివృద్ధి చెందే క్రమంలో భాగస్వాములైన వారందరికీ సమాన అవకాశాలు సిద్ధించాలనీ, సమాజంలోని అన్ని వర్గాల వారికీ ముఖ్యంగా బలహీన వర్గాల వారికి లబ్ధి చేకూరాలనీ మా ఆకాంక్ష.

225. మహాత్మాగాంధీ మాటల్ని స్మరిస్తూ నేను నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను. ఆయనిలా అన్నారు.

> ***నిజమైన సైనికుడు విజయమెట్లా సిద్ధిస్తుందా అని వాదిస్తూ కూర్చోడు.***
> ***తాను నిర్వహించవలసిన పాత్రను సవినయంగా నిర్వహిస్తే ఏదో ఒక***
> ***విధంగా యుద్ధంలో విజయం సాధ్యపడి తీరుతుందనే అతడు నమ్ముతాడు.***
> ***మనలో ప్రతి ఒక్కరం ఈ స్ఫూర్తితోనే పని చేయాలి. భవిష్యత్తు ఎలా***
> ***ఉంటుందో తెలుసుకోవడం మన వల్ల కాకపోవచ్చు. కానీ మనలో***
> ***ప్రతి ఒక్కరం మన పాత్ర సక్రమంగా పోషించడం మాత్రం మన చేతుల్లో ఉన్నదే.***

226. నేనింతదాకా ప్రస్తావించిన లక్ష్యాలను సాధించడం కోసం రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడం కోసం మా ప్రభుత్వం అంకితమై ఉంది.

227. మహాకవి వాల్ట్ విట్మన్ వాక్యాల్ని తలచుకుంటూ ఒక ఆశావహ దృక్పథంతో నేను నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను. ఆ మహాకవి ఇలా అన్నాడుః

> **' సూర్య కాంతిలో సదా తలెత్తుకు నడు. నీడల జాడల్ని వెనక పడనివ్వు. '**

228. ఈ బడ్జెట్‌ను గౌరవ సభ్యుల ఆమోదం కోసం సమర్పిస్తున్నాను.

జైహింద్!

(ఆర్థిక శాఖామాత్యులచే ఏకధాటిగా సాగిన బడ్జెట్ ప్రసంగం మధ్యాహ్నం గం.2.10 నిమిషాలకు ముగిసినది)

MR.SPEAKER: The House is adjourned to meet again tomorrow at 9.00 a.m.

**(The House then adjourned at 2.10 p.m. to meet again tomorrow at 9.00 a.m. i.e., 13th of March, 2015).**